# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

ఏప్రిల్ 2024

వెల: రూ. 25/-





# శ్రీవేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 17 సంచిక: 4

సలహాదారులు, స్ఫూర్తిదాత,
కర్త, కర్మ, క్రియ మా ప్రభు
తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు

ప్రధాన సంపాదకులు:
పుల్లగూర్ల సాయిరెడ్డి
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
డా॥ టి. గౌరీశంకర్

ఫొటోగ్రాఫర్:
పత్తి సుబ్రమణ్యం, శ్రీనివాస మంగాపురం

డి.టి.పి & డిజైన్: సాయినాథ్, రమేష్

**Email:** srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.readwhere.com
Phone: **040–27175050**
Cell: **9348212354**


**లోపలి పేజీల్లో**


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| కమనీయం రమణీయం... | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశ... | 9 |
| జగన్మోహినీ కేశవస్వామి | 18 |
| మహాభారతంలోని మహోపాఖ్యానాలు | 21 |
| గంజాయివనంలో తులసిమొక్క త్రిజట | 27 |
| తొండరడిప్పొడి ఆళ్వార్ | 30 |
| రామాయణ రత్నాకరం | 36 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం | 40 |
| హిందువుల తొలిపండుగ ఉగాది | 45 |
| శ్రీరామ నవమి | 46 |
| ముకుందమాల | 48 |
| శ్రీకృష్ణ తత్త్వం | 53 |
| మీ ప్రశ్న మా సమాధానం | 55 |
| ధనుర్విద్యా ప్రవీణుడు, వీరుడు అర్జునుడు | 56 |
| పీఠికాపుర క్షేత్ర వైభవం | 59 |
| శ్రీవిష్ణుమూర్తి మోహినీ రూపాన్ని దరించుట | 62 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |


## శరణాగతి

శ్రీవేంకటేశం పాఠకులకు శ్రీ క్రోధి నామ సంవత్సర శుభాకాంక్షలు. ఈ నూతన సంవత్సరంలో తిరుమల శ్రీవేంకటేశ్వరుని కృపాకటాక్షాల వలన మనమందరము సుఖసంతోషాలతో వర్ధిల్లగలమని ఆశిస్తున్నాను. శ్రీవేంకటేశం మాసపత్రిక కూడా ఈ నెలతో 17 సంవత్సరాలు పూర్తి చేసుకుని 18వ సంవత్సరంలోకి అడుగిడుతోంది.

ఈ పత్రికను తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే ఏప్రిల్ 2007 నుండి ప్రచురిస్తున్నాము. స్వామివారి ప్రతి లీలకు ఏదో ఒక అర్థం, పరమార్థం దాగి ఉంటుంది. అదేవిధంగా ఈ పత్రిక నడుపుటలో మేము ఎంతవరకు సఫలీకృతులమైనామో స్వామివారికే తెలుసు. కోవిడ్–19 విజృంభణ సమయాన మొత్తం 3 నెలలు తప్ప ప్రతి నెల ప్రచురించాము. ఈ పత్రికను స్వామివారి తత్వజ్ఞానము ప్రచారము చేయుటతో పాటు మా శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠ సేవలకు కూడా ప్రభావము కలిగిస్తున్నాము. ముఖ్యంగా స్వామివారి నామజప కార్యక్రమము, శ్రీనివాస కళ్యాణాలకు వాడుచున్నాము. హరినామ క్షేత్ర స్థాపనే స్వామివారి ముఖ్యోద్దేశంగా భావించి, స్వామివారు ప్రసాదించిన లీలలను 'తిరుమల శ్రీవేంకటేశ్వరుని దిశా నిర్దేశం' అనే శీర్షికతో గత సంవత్సరం నుండి ప్రచురిస్తున్నాము. మరియు ఈ పత్రిక ద్వారా భక్తులు ఎంతగా బాగుపడుచున్నారో అంతకు రెండింతల లాభం మేము పొందుచున్నట్లు భావన ఏర్పడుచున్నది. స్వామివారి సంకల్ప సాధనలో తగిన యోగ్యత సాధించుటతో పాటు భాగవతులను కూడా భాగస్వాములను చేయవలసి ఉంది. అందుకు ఈ పత్రిక ఎంతో ఉపయోగపడుచున్నదని భావిస్తున్నాను.

తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞలో భాగంగా మేము శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠమును 2002 సంవత్సరంలో స్థాపించాము. ఆ తరువాత మరెన్నో సేవలను స్వామివారి ఆజ్ఞచే కొనసాగిస్తున్నాము. హే ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! మేము కలియుగపు మానవులము. అరిషడ్వర్గాలతో నిండి జీవిస్తున్నాము. కనుక మీరు మా వెనుక ఉండి ఎంత మార్గనిర్దేశం చేస్తున్నప్పటికీ ఎన్నో తప్పులను చేశాము. కావున క్షమించమని ప్రార్థనాపూర్వకంగా విన్నవించుకుంటున్నాము. శరణాగతి ఘటిస్తున్నాము. మీరు ఎంతో దయామయులు. పూర్వము శత్రుపక్షము వాడైన విభీషణుని శరణాగతి స్వీకరించారు. అంత తప్పు చేసిన రావణుడు సైతం శరణు కోరితే రక్షించెదనని చెప్పారు. కాబట్టి మమ్ము కూడా అనుగ్రహించవలసిందిగా ప్రార్థిస్తున్నాము. మరియు ఏ సంకల్పము సిద్ధించుటకు మీరు మాచే ఈ సేవాకార్యక్రమములు కొనసాగిస్తున్నారో ఆ సంకల్పము త్వరగా నెరవేరునట్లు అనుగ్రహించగలరని ప్రార్థన. ఉపాయము, ఉపేయము మీరే అని నమ్మి శరణు కోరుచున్నాము.

భగవంతుని కృపను పొందుటకు శరణాగతి అత్యంత ప్రధానమైన విధానము. నేను మీకు దాసుడనై జీవించెదను. నా సంపూర్ణ వ్యక్తిత్వమును వదలి వేయుచున్నాను. ఇకనుండి మీరే నాకు దిక్కు అని మనస్సాక్షిగా భావించాలి. మరియు సదా స్వామివారి నామస్మరణలో జీవిస్తూ జీవితమును కొనసాగించాలి. ఈ విధమైన జీవితము గడుపువాడిని శ్రీవేంకటేశ్వరుడు తప్పక రక్షించగలడు. అప్పుడు ఆ మానవుడు ఈ లోకములోని ఏ శక్తికీ భయపడవలసిన అవసరము లేదు. భగవంతుడే నాకు రక్ష అని నమ్మి జీవించవచ్చును. ఈ సృష్టిలో మనము అనుభవించు ఆస్తి, అంతస్తులు, మనవారనుకునే వారందరు ఏదో ఒకరోజు మననుండి దూరము కాక మానరు. కేవలము శ్రీవేంకటేశ్వరుడు ఒక్కడే శాశ్వతుడు. మనతో కడవరకు అంటిపెట్టుకుని ఉండువాడు. కాబట్టి ప్రతి జీవి తనవారనుకునే వారికంటే ఎక్కువగా స్వామివారిని ప్రేమించువారు ధన్యులు.

నమో వేంకటేశాయ

**వినా వేంకటేశం న నాథో న నాథః ।**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి ॥**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)

Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. **Editor: Pullagurla Saireddy:** Cell : **93482 12354**, Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

## చందా వివరాలు
(రూ.లలో)

| | |
|---|---|
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 5,000-00 |
| ☐ పోషకులు | 10,000-00 |
| ☐ రాజపోషకులు | 50,000-00 |

**9348212354**

నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.

లేదా

శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను

లేదా


**Srivenkatesham**

A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు:____________________
____________________
చిరునామా:____________________
____________________
____________________
____________________
____________________
పిన్‌కోడ్:____________________
చందా వివరాలు:____________________

మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

చందాదారులకు
స్వామివారి పవిత్ర పాదాలు
(10"x8") **ఉచితం**

# శ్రీ వేంకటేశ్వర స్తుతి

శ్లో ॥ సేవాపరాః శివసురేశ కృశానుధర్మ
రక్షోంబు నాథ పవమాన ధనాధినాథాః
బద్ధాంజలి ప్రవిలసన్నిజ శీర్షదేశాః
శ్రీవేంకటాచలపతే! తవసుప్రభాతమ్ ॥

తాత్పర్యం – వేంకటేశ్వరా! శివుడు, ఇంద్రుడు, అగ్ని, యముడు, నిర్మతి, వరుణుడు, వాయువు, కుబేరుడు అను దిక్పాలకులు ఎనిమిదిమంది తమ తలలపై జోడించిన చేతులతో ప్రకాశిస్తూ నిన్ను సేవించుట కొరకు వేచియున్నారు. ఓ వేంకటేశా! నీకు శుభోదయమగుగాక!

శ్లో ॥ ధాటీషు తే విహగరాజ మృగాధిరాజ
నాగాధిరాజ గజరాజ హయాధిరాజాః
స్వస్వాధికార మహిమాధిక మర్థయంతే
శ్రీవేంకటాచలపతే! తవ సుప్రభాతమ్ ॥

తాత్పర్యం – ఓ వేంకటేశా! నీవు సైన్యముతో విజయముకై చేయు ప్రయాణములలో గరుత్మంతుడు, సింహము, శేషుడు, గజరాజు, అశ్వము మొదలగు వారు ఇంతకుముందు తమకు గల అధికార వైభవం కంటె ఎక్కువైన అధికార వైభవం కలుగవలెనని నిన్ను ప్రార్థించుచున్నాను. వేంకటేశా! నీకు శుభోదయమగుగాక!

– డా॥ కె.వి. రాఘవాచార్యులు

# ముక్తిమార్గము



## కేదారగౌళ

పరమాతుమని నోరఁ – బాడుచును ఇరు
దరులు గూడఁగ దోసి – దంచీ మాయ ॥పల్లవి॥

1. కొలది బ్రహ్మండపుఁ – గుందెనలోన
కులికి జీవులను – కొలుచు నించి
కలికి దుర్మోహపు రో – కలి వేసి
తలఁచి తనువులను – దంచీ మాయ ॥పర॥

2. తొంగలి రెప్పల రా – త్రులుఁ బగలును
సంగడి కన్నులుగా – సరిఁదిప్పచు
చెంగలించి దిక్కులనే – చేతు లూచుచు
దంగుడు బియ్యాలుగా – దంచీ మాయ ॥పర॥

3. అనయముఁ దిరువేంక – టాధీశ్వరుని
పనుపడి తనలోఁ – బాడుచును
వొనరి విన్నాణి జీ – వులనెడి బియ్యము
తనర నాతనికియ్య – దంచీ మాయ





భావము – మాయ యనునది ఒక ఇల్లాలు. ఆమె పరమాత్ముడు విషయముగా గల దంపుడు పాట నోరార బాడుచు జీవులు అను ధాన్యమును రోటవేసి దంచుచున్నది. సుఖదుఃఖములు, పుణ్యపాపములు అను ద్వంద్వములే రోటిమీది ధాన్యమునకు ఇరు దరులుగా నున్నవి. వాటిని కూడ ద్రోసికొనుచు మాయ తన దంపుడు పని కొనసాగించుచున్నది.

మాయ స్వల్పమైన బ్రహ్మాండము అను కుందెనలో జీవులు అను ధాన్యమును అల్లాడించి నింపుచున్నది. ఆపైన జీవులను లొంగదీయుటలో నేర్పరియైన వ్యామోహము అను రోకలి వేసి బుద్ధి పూర్వకముగా వారి శరీరము లనెడు పొట్టు ఊడిపోవునట్లు దంచుచున్నది.

వాలు రెప్పలు గల (రెప్పల బోలు రెండు సంధ్యలు గల) రేయింబవళ్ళు అను జంట కన్నులను సరిగా ద్రిప్పుచు విజృంభించి దిక్కులనెడు చేతులు ఇటునటు ఊపుచు మాయ జీవులను మెదుగుడు బియ్య మగునట్లుగా దంచుచున్నది.

ఎల్లప్పుడు శ్రీవేంకటేశ్వరుని తనలో తాను అలవాటు చొప్పున పాడుకొనుచు జ్ఞాన స్వరూపులైన జీవులనెడు బియ్యమును ఆ దేవున కర్పించుటకై మాయ పై విధముగా దంచుచున్నది.

భావానువాదం:
**శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య**



# కమనీయం రమణీయం ఇనకుల తిలకుడి కల్యాణం

: చింతలపాటి శివశంకర శాస్త్రి

శ్లో ॥ "వైదేహీ సహితం సురద్రుమతలే హైమే మహామంటపే
మధ్యే పుష్పకమాసనే మణిమయే వీరాసనే సుస్థితమ్
అగ్రే వాచయతి ప్రభంజన సులే తత్వం మునిభ్యఃపరం
వ్యాఖ్యాంతం భరతాదిభిః పరివృతం రామం భజే శ్యామలం"

చిత్తా నక్షత్రంతో కూడిన పూర్ణిమ గల మాసం చైత్రమాసం. కృతయుగం వంటి యుగం, వేదం వంటి శాస్త్రము, గంగ వంటి తీర్థం, జలదానం వంటి దానం ఇంకొకటి లేదు. ఈ మాసమునకు అధిదేవతలు సీతారాములు. కనుక ఈ మాసంలో చేయు కర్మలన్నీ సీతారాములకు సమర్పణ చేయాలి. చైత్రమాసానికి మధుమాసమని పేరు.

మంగళకరుడు, నిత్యుడు, సజాతీయాది భేదరహితుడు, సర్వవ్యాపకుడు, తారకరాముడు. నామజపం చేసినవారిని తరింపచేయువాడు. సుఖస్వరూపుడు. ఆనంద భిన్నమైన ఆకారము లేనివాడు. మిక్కిలి పూజ్యుడు. మహేశ్వరుడు. సర్వకళలకు అధిపతి. దేవతలకు ప్రభువు శ్రీరామచంద్రుడు.

"పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే"

సజ్జన సంరక్షణకు, దుర్జన శిక్షణకు , ధర్మసంస్థాపనకు ప్రతి యుగంలోను నేను పుడుతున్నాను అంటాడు గీతాచార్యుడు. ధర్మానికి, అధర్మానికి, న్యాయానికి, అన్యాయానికి, సత్యానికి,

అసత్యానికి సంఘర్షణ జరిగినప్పుడు ధర్మాన్ని నిలబెట్టడానికి, సజ్జనులను రక్షించడానికి భగవంతుడు దశావతారాలను ధరించాడు. ప్రతి అవతారానికి ఒక లక్ష్యం ఉంది. ప్రతి ఆకృతికీ ప్రత్యేకత ఉంది. అధర్మపాలనలో దురాచారాన్ని ప్రబలింప చేస్తున్న రాక్షస సంహారం కోసమే నారాయణుడు దాల్చిన అవతారాలలో రామావతారం మహోన్నతమైంది.

"శ్రీకర! పరితోషిత ర
త్నాకర! కమనీయ గుణ గణకర! కారు
ణ్యాకర! భీకర శరధా
రా కంపిత దానవేంద్ర! రామ నరేంద్రా!"

అని పోతన మహాకవి ప్రస్తుతించాడు. శ్రీరామచంద్రుడు సిరులందించే దొర. సముద్రుణ్ణి కూడా సాధించి శోషింప జేయజాలిన సాధుశీలి. కమనీయ గుణ రత్నాకరుడు. దయానిధి. 'శ్రీరామ' అనే అక్షర త్రయమే తారక మంత్రం. త్రిజగద్రక్షేక దీక్షా గురుడైన స్వామిని సామాన్య రాజుగా భావించడమే అవివేకం. పరబ్రహ్మ తేజంతో సదా భాసించే ఆ పరంధాముడు మానుష రూపంలో ఉన్న మాధవుడు. సీతమ్మే లక్ష్మీదేవి. ''బాలే వరమతే'' బాలాత్రిపురసుందరి వలె ప్రకాశించే యోగమాయా శక్తి. ఈ దివ్యశక్తుల కలయిక, కళ్యాణం జగత్కళ్యాణ కారకం. లోక కంటకులైన రాక్షసులకు వినాశకరం. సత్యధర్మ సంరక్షణకు శ్రీకారం. విశిష్టమైన శీలం, విశేషమైన సామర్థ్యం, విశ్వాన్నే విభ్రమ పరిచే సౌందర్యాలతో సీతారాములు సాధారణ మానవుల వలె మన కళ్ళకు దగ్గరగా సంచరించడం మన సుకృతం.

విశ్వాన్నే విభ్రమ పరిచే సౌందర్యాలతో విరాజిల్లే సీతారాముల కళ్యాణం జగత్కళ్యాణ కారకం. భక్తజనుల హృదయానందకరం. అపురూపం. ఇహ పర సాధనం అయిన స్త్రీ పురుష శక్తుల సమ్మేళనమే సంపూర్ణ సృష్టి విధానానికి పరమపద సోపానం. విశ్వ వృద్ధికీ, సమృద్ధికి అభివృద్ధి మూలకందకం. బ్రహ్మానందానుభూతిని కల్గించే కళ్యాణం విశిష్టమైంది. ఉత్కృష్టమైంది. అభీష్ట ఫలదాయకమైంది.

అయోధ్యా నగరాన్ని పరిపాలించే దశరథ మహారాజుకు ముగ్గురు భార్యలు. మొదటి భార్య కౌసల్య. శ్రీమహావిష్ణువు కౌసల్య గర్భాన చైత్రశుద్ధ నవమినాడు పునర్వసు నక్షత్రాన జన్మించాడు. శ్రీహరి జన్మించు సమయాన లగ్న, గ్రహ, తిథి, వార, యోగాలన్నీ అనుకూలంగా ఉన్నాయి. ఆ సమయాన సృష్టిలోని ప్రాణులన్నీ ఆనందంతో ఉన్నాయి. ఆకాశంలో నగారాలు మ్రోగాయి. దేవతలు, నాగులు, మునులు భగవంతుని వేనోళ్ళ పొగుడుతూ కీర్తించారు. మిగిలిన భార్యలైన సుమిత్ర, కైకేయి పండంటి పిల్లల్ని ప్రసవించారు.

వాల్మీకి రామాయణాన్ని అనుసరించి శ్రీమహావిష్ణువు తనను నాలుగు భాగాలుగా చేసుకొని దశరథునిలో ప్రవేశించాడు. విష్ణువులో అర్థభాగం రాముడై, చతుర్థభాగం భరతుడై, అర్థభాగం లక్ష్మణ శత్రుఘ్నులై జన్మించారు. దశరథుని నలుగురు కుమారులు దిన దిన ప్రవర్ధమానులై పెరిగి గురువుల వద్ద అస్త్ర శస్త్ర విద్యలన్నీ ఆసాంతం గ్రహించారు. పిల్లలందరూ యుక్త వయస్సుకు రాగానే దశరథుడు వయోభారం చేత, తన పెద్ద కుమారుడైన శ్రీరామునికి పట్టాభిషేకం చేయాలని నిశ్చయించుకొని మంత్రులతో, కులగురువుతో చర్చించి ముహూర్తం నిర్ణయించాడు. మరుసటిరోజు దశరథ మహారాజు సభాభవనానికి విచ్చేశాడు. సభకు నమస్కరించి ధర్మపీఠాన్ని అధిష్ఠించాడు. ఆ సభ వేదవేత్తలైన బ్రాహ్మణులతో, పౌరులతో, వసిష్ఠుడు, కశ్యపుడు మున్నగు మహర్షులతో, వ్యవహార జ్ఞాన సంపత్తి గల మంత్రులతో ధర్మజ్ఞులు, న్యాయకోవిదులు, సభ్యులు మున్నగు వారితో దిక్పాలకుల సభవోలె శోభాయమానంగా ప్రకాశిస్తోంది. దశరథుడు రాజ్యానికి సంబంధించిన విషయములను మంత్రులతో చర్చిస్తుండగా విశ్వామిత్ర మహర్షి విచ్చేశాడు. సభకు ఏతెంచిన మహర్షిని చూసి దిగ్గున లేచి ఉచితాసనమున కూర్చుండబెట్టి పాదపూజ చేసి, అతిథి సత్కారము లొనరించి సత్కరించాడు. అనంతరం మహర్షి నుద్దేశించి ''విశ్వామిత్ర మహర్షీ! మీ రాకతో ఈ సభ పావనమైంది. మిమ్ములను కాంచి ధన్యత నొందాము. నా వలన మీ యజ్ఞ యాగాదులకు అవసరమైన సహాయం కావలసిన నిస్సంశయముగా ప్రస్తావించండి. మీ కోరిక ఎంతటిదైనా నెరవేర్చడానికి సిద్ధంగా ఉన్నానని, ఏదైనా తప్పక తీరుస్తానని, సంశయించవద్దు''ని పలికాడు.

దశరథుని మాటలను ఆలకించిన విశ్వామిత్రుడు చిరునవ్వుతో తిలకించి, మహారాజును ఆశీర్వదించి, మహారాజా! లోక కళ్యాణ నిమిత్తం నేనొక యజ్ఞము చేయుచున్నాను. లోక కంటకులైన రాక్షసులు తమ తమ శక్తి యుక్తులతో, మాయాజాలంతో విఘ్నములు గావిస్తున్నారు. యాగ రక్షణార్థము మీ కుమారుడైన శ్రీరాముని నాతో పంపించ''మని పలికాడు. అందులకు విశ్వామిత్రునితో ''మహర్షీ! నా పిల్లలు ముక్కుపచ్చలారని పసికందులు. రాక్షసులను తుదముట్టించడం వారివలన ఏమవుతుంది? మీకు సహాయంగా నా సైన్యమంతటినీ పంపిస్తానని, అలా కాని పక్షంలో యాగ రక్షణార్థం నేనే వస్తా''నని పలికాడు. ఆ మాటలు విన్న విశ్వామిత్రుడు రాజా! శ్రీరాముడు నీ కుమారుడే కాని, నిజానికి లోకానికే ప్రభువు. సత్యధర్మ సంస్థాపనం కొరకు రామునికున్న బలపరాక్రమములు తానెరుగుదునని, అంతేకాక నీ కులగురువైన వసిష్ఠునికీ రాముని గూర్చి సమస్తము తెలియునని, పుత్రవ్యామోహంతో, అజ్ఞానంతో నీకు తెలియడంలేదు. ఇక్కడున్న తాపసులందరూ నీ కుమారుని గురించి సమస్తమూ ఎరుగుదురు. వారి మాటనైనా విని శ్రీరాముణ్ణి నాతో పంపించు. నీకు, నీ రాజ్యానికి శుభం కలుగుతుందని పలికి లోకంలో ధర్మసంస్థాపన చెయ్యడం కోసం తన వెంట

తీసుకువెడతాడు. రాముని వెంట లక్ష్మణుని కూడా పంపించగా రామలక్ష్మణ సహితుడై యజ్ఞభూమియైన సిద్ధాశ్రమమును చేరుకున్నాడు విశ్వామిత్రుడు. ప్రయాణ సమయాన వారికి అలుపూ, సొలుపూ తెలియకుండా ఉండే నిమిత్తం గంగానది సమీపాన "బల – అతిబల" అను మంత్రవిద్యలను ఉపదేశించాడు. అనంతరం వారితో ఈ బలాతిబల మంత్రములు పఠించు. నీతో భుజబలముచే సమానమగువాడు భూలోకమున ఎవ్వడూ ఉండడు. నీ గుణములన్నింటిచే సాటియగువాడు ముల్లోకములందను కానరాడని పలికాడు.

రామలక్ష్మణుల కోరికపై విశ్వామిత్రుడు యజ్ఞదీక్షితుడయ్యాడు. రామలక్ష్మణులు తమకు ఎదురైన తాటకీ, సుబాహువులను వధించి రాక్షసులను అంతం చేశాడు. యజ్ఞం నిర్విఘ్నంగా జరిగింది.

మరునాడు ఉదయానే విశ్వామిత్రుడు రామలక్ష్మణులను తీసుకొని తిరుగు ప్రయాణమై "రామా! మిథిలానగరపు ప్రభువు జనక మహారాజు, అతని వద్ద అద్భుతమైన ధనుస్సు ఉంది. మీరు చూడవచ్చునని పలికి మిథిలా నగరము వైపుగా ముందుకు సాగుతూ నగరాన్ని చేరుకున్నారు. తమ నగరానికి విచ్చేసిన విశ్వామిత్ర మహర్షినకి, వారి శిష్యులకు ఎదురేగి వారిని సముచితంగా ఆదరించి సత్కరించి గౌరవించాడు. జనకుని ఆహ్వానంపై రామలక్ష్మణులను తీసుకొని సభలోనికి ప్రవేశించాడు. అంతట మహర్షి అనుమతితో శ్రీరాముడు ధనుస్సును అవలీలగా ఎక్కుపెట్టి అల్లెత్రాడును లాగి విల్లును విరిచాడు. జనకుని మనస్సు ఆనందంతో నిండిపోయింది. విశ్వామిత్ర మహర్షితో నా కుమార్తె 'వీర్యశుల్క' అని నేను చేసిన ప్రతిజ్ఞ నేటితో నెరవేరింది. అసంభవం, అసాధ్యం అనుకున్న ఈ శివధనుర్భంగం మేము ఊహించనంత అద్భుతంగా జరిగింది. రామచంద్రునికి నేను నా కుమార్తె అయిన సీతావధూటిని ఇచ్చి వివాహము చేయ సంకల్పించాను. ఇపుడే నా మంత్రులను అయోధ్యా నగరానికి పంపించి దశరథ మహారాజును, వారి కుటుంబాన్ని సగౌరవంగా ఆహ్వానిస్తానని పలికి వెంటనే దశరథ మహారాజుకి వర్తమానం పంపిచాడు.

జనకుని ఆహ్వానమును అందుకొని దశరథమహారాజు పురోహిత,మిత్ర,మంత్రి,బంధువర్గసమేతంగా మిథిలానగరానికి వచ్చాడు. అందరూ ఆసీనులయ్యాక ఆడపిల్లవారి మర్యాదలు జరిగాక జనకుని చూచి "నేడు మఖా నక్షత్రము. ఎల్లుండి ఉత్తర ఫల్గుణీ నక్షత్రం. ఆరోజు వసిష్ఠులవారు చెప్పిన విధంగా వివాహం జరిపిద్దాము" అని పలికాడు.

జనకుని ఆజ్ఞానుసారం మిథిలా నగరమంతా రంగు రంగుల తోరణాలతో అలంకరించారు. ఆకుపచ్చని రాళ్ళను, నల్లని రాళ్ళను తెప్పించి రంగరంగ వైభవంగా కళ్యాణ మండపాన్ని నిర్మించారు. మామిడి తోరణాలను కట్టారు. మండపానికి ముందు అరటి చెట్లను ఉంచారు. మంగళ వాయిద్యాల నడుమ వేదమంత్రాల సాక్షిగా శ్రీరాముని మంటపానికి తీసుకు వచ్చారు. జనకరాజ దంపతులు వరుని కాళ్ళు కడిగి, ఆ నీటిని తలపైకి చల్లుకున్నారు. జనకమహారాజు శాస్త్రోక్తంగా నూతన పట్టు వస్త్రములు సమర్పించాడు. పట్టుబట్టలతో, బుగ్గపై కాటుక చుక్కతో, నుదుట కళ్యాణ బొట్టుతో బాసికాలతో శ్రీరాముడు చిరునవ్వులు చిందించుచుండగా అందరికీ శోభాయమానంగా కనిపించి ఆహ్లాదమును కలిగింపచేశాడు.

ముహూర్తం మించిపోతోందంటూ పురోహితులు చెప్పగా ముత్తైదువలు మంగళహారతుల పళ్ళెంతో ముందు, ప్రక్కల నడుచుచుండగా జానకిని తీసుకు వచ్చారు. ఇద్దరి మధ్యా పరదాను ఏర్పాటు చేశారు. సుమూహర్తంలో వధూవరుల నెత్తిపై జీలకర్ర బెల్లమును ఉంచారు. జనక మహారాజు సముద్ర గంభీర స్వరంతో

**"ఇయం సీతా మమసుతా సహధర్మ చరీతవ**
**ప్రతీచ్ఛ చైనాం భద్రంతే పాణీ గృహ్ణీష్వపాణినా"**

రామా! ఇదిగో నా కుమార్తె సీత. ఇకపై నీకు సహధర్మచారిణి అవుతోంది. ఈమెను అంగీకరించి పాణిగ్రహణము చేయి. ఈమె సర్వకాల సర్వావస్థలలోనూ సహధర్మచారిణిగా తోడునీడగా ఉండి అనుసరించగల అనురాగవతి. ఈమె వలన నీకు సకల ధర్మార్థ కామాలు సిద్ధిస్తాయి అని పలికి బంగారము కలిపిన అక్షింతలు , జలములోనూ సీత హస్తమును రామకరమున ఉంచి కన్యాదానము చేశాడు. పురోహితులు వేదమంత్రాలతో అక్షతలు చల్లి ఆశీర్వదించారు. మంగళవాద్యాలు మిన్నంటాయి. మింట దేవదుందుభులు మ్రోగాయి. ఋత్విక్కులు మంత్రాలు చదువుచుండగా మాంగళ్య దేవత అయిన సీతాదేవి మెడలో శ్రీరామచంద్రమూర్తి మంగళసూత్రం కట్టాడు. తరువాత సీత శిరస్సున శ్రీరాముడు తలంబ్రాలు పోశాడు.

లక్ష్మణుడు, భరతుడు, శత్రుఘ్నులు సైతం ఊర్మిళ, మాండవి, శ్రుతకీర్తులను తమ తమ ధర్మపత్నులుగా స్వీకరించి వారి వారి మెడలలో మూడు ముళ్ళు వేసి అందరికీ ప్రమోదాన్ని కలిగించారు. అగ్నికి ముమ్మారు ప్రదక్షిణ చేశారు నూతన వధూవరులు. అనంతరం పెద్దలందరికీ నమస్కరించి ఆశీస్సులందుకున్నారు.

వివాహ సందర్భంగా జనకమహారాజు సీతకు, మిగిలిన కుమార్తెలకు ఏడువారాల నగలు, చెలికత్తెలకు వజ్రవైఢూర్య మరకత మణిమయాలంకారముల నొసంగెను. దివి, భువి ఒక్కటై దంపతులను దీవించాయి.

సౌభాగ్యాన్ని, సౌజన్యాన్ని, సౌశీల్యాన్ని అందించే శ్రీహరి హృదయవాసిని, జగాలను బ్రోచే, కాపాడే మహా ఇల్లాలు అయిన సీతాదేవిని, ఆ రామచంద్ర ప్రభువును ఆరాధించి, కొలిచి ధన్యులమవుదాము.

**"ఓం సర్వేషం స్వస్తిర్భవతు, సర్వేషాం శాంతిర్భవతు**
**సర్వేషాం పూర్ణం భవతు – సర్వేషాం మంగళం భవతు"**



13వ భాగము

# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం స్వామి వారి దివ్య లీలలు


**తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**— గోవింద దాసు**

**(పుల్లగూర్ల సాయిరెడ్డి)**

దిశ : సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం వెండి వాకిలి వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారిగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వార ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగ చేయుటకు వీలుగ స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగానే ప్రస్తుతపు 13 వ భాగపు లీలల ప్రచురణ. (ఆగస్టు-2004-నవంబర్ 2004)



## రథమును హైదరాబాదులో ప్రారంభించుట

### గోవింద రామానుజ దాసుగా దాస్య నామం లభించుట

తేది 07-09-04 నాడు గోకులాష్టమి. ఆ రోజు తిరుమల శ్రీవేంకటేశ్వరునికి 2వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ చేయవలసి ఉంది. ప్రతి సంవత్సరం సమర్పించబోయే 7 కోట్ల జపములో కనీసం 70 వేల మంది భక్తులను భాగస్వాములుగా చేర్చుటకని 'నమో వేంకటేశాయ' అనే దివ్య రథమును, స్వామివారి కృపచే తయారు చేసి, తిరుపతిలో ప్రారంభోత్సవము కూడా చేశాము. దానిని హైదరాబాద్ లో తేది 25-08-04 నాడు ఉదయం 10 గంటలకు హిమాయత్ నగర్ లోని టిటిడి ప్రాంగణములో ప్రారంభించదలచాము. హైదరాబాద్ లో ఈ రథమును ఒక యతీశ్వరుడు ప్రారంభించగా, రాష్ట్ర చీఫ్ సెక్రటరీ ప్రథమ క్రతువును సమర్పించాలనే కోరిక నా మనస్సులో ఉండేది. దాని ప్రకారం శ్రీశ్రీశ్రీ వ్రతధర్ నారాయణ రామానుజ జీయర్ స్వామి వారిని మరియు అప్పటి చీఫ్ సెక్రటరీ శ్రీమోహన్ కందా గారిని ఆహ్వానించాను. అప్పటి టూరిజం మినిస్టర్ శ్రీమతి గీతారెడ్డి, మంచిరెడ్డి కిషన్ రెడ్డి, శ్రీ ముఠా గోపాల్ గార్లను కూడా ఆహ్వానించాను. టిటిడి ప్రాంగణములో కుదరనందున దీని ముందు ఉన్న ఆఫీసు ప్రాంగణములో సభను ఏర్పాటు చేశాము. ఎంతోమంది భక్తులు, ప్రెస్ వారు వచ్చారు. శ్రీశ్రీశ్రీ జీయర్ స్వామివారు వచ్చి రథాన్ని ప్రారంభించారు. నేననుకున్నట్లే శ్రీమాన్ మోహన్ కందా, ఐఏఎస్ గారు రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుచు ప్రథమ క్రతువును సమర్పించారు. తరువాత గీతారెడ్డి గారు, మంచిరెడ్డి కిషన్ రెడ్డి గారు, మా అమ్మ కీ.శే. పుల్లగూర్ల రుక్కమ్మ గార్లు మిగిలిన 3 ప్రక్కలు క్రతువును వ్రాసి సమర్పించారు. నేను



వారిని సన్మానించాను. తరువాత భక్తులు సమర్పించారు. జీయర్ స్వామివారు ఈ కార్యక్రమమును ఎంతో మెచ్చుకున్నారు. నేను ఏదేని స్వామి సభ జరుపునప్పుడు నాలో పూర్తిగా స్వామివారే నిండి ఉంటారు. నాకు మరేదీ గుర్తుండదు. ఇక్కడ కూడా ఇదే జరిగింది. పైగా ఇది నా మొదటి సభ కావడం వల్ల కొన్ని తప్పులు జరిగాయి. దానికి జీయర్ స్వామి వారు చింతించకు, నీవు మహా సంకల్పాన్ని చేశావు, ఇది చాలా గొప్పది, మరింత శక్తి లభిస్తుందన్నారు. మరియు ఇది అత్యంత నూతనంగా ఉందన్నారు. భగవంతుని కృపతోనే ఈ పని సాధ్యమైందన్నారు. నన్నెంతో ప్రశంసిస్తూ ఈ సందర్భంగా జీయర్ స్వామి వారు నాకు "గోవింద రామానుజ దాసు"గ దాస్య నామం ఇచ్చారు. మరియు వారు ఎప్పటికీ అందుబాటులో ఉంటూ చక్కని మార్గదర్శకం చేస్తానని కూడా మాట ఇచ్చారు. ఇక్కడి నుండి 'నమో వేంకటేశాయ' రథయాత్ర హైదరాబాదులో ప్రారంభమైంది. దీనిని 25-08-04 నుండి 30-08-04 వరకు హైదరాబాదులో త్రిప్పాము. జనాలు అత్యంత చిత్రంగా ఈ రథాన్ని చూచారు. స్వామి మహామంత్రం పలుకుచు ఈ రథం వారి వీధిలోనికి వెళ్ళగానే ఎంతోమంది భక్తులు ఆసక్తిగా రథం వద్దకు చేరేవారు. తరువాత మేము చెప్పినట్లు స్వామిని పూజించి, ప్రణమిల్లి, సమర్పణ క్రతువును సమర్పించేవారు. వారి ఇంటికి స్వయంగా స్వామివారు రావడంతో ఎంతో పొంగిపోయారు. ప్రతిరోజు ఉదయం 8.30 నుండి మధ్యాహ్నం 1.30 వరకు, సాయంత్రం 5 నుండి 9.30 వరకు కనీసం 9 గంటలు రథయాత్ర చేసేవారిమి. ఇక్కడ స్వామివారు మరో లీల చూపారు. హైదరాబాద్ లో ఈ రథం ఉదయం మరియు సాయంత్రం 25-08-04నుండి 30-08-04 వరకు వీధి వీధి తిరిగింది. ఈ కాలంలో మా ఆఫీసులో చాలా నెమ్మదిగా (తక్కువ సౌండుతో) "ఓం నమో వేంకటేశాయ" అను శబ్దము ఛాంటింగ్ మిషన్ పెట్టిన విధంగా రావడం జరిగింది. దీనిని ఎంతోమంది గమనించి ఆశ్చర్యపోయారు.

## సురేఖను మార్చుట

నేను రథయాత్ర నిర్వహించుట మొదటిసారి. మరియు గత 9 నెలలు రథాన్ని తయారు చేయుటలోనే గడిపాను. కాబట్టి రథాన్ని ఆహ్వానించే భక్తులపై ఈ పర్యాయం ఎక్కువ శ్రద్ధ పెట్టలేదు. మరోప్రక్క ఆ సమయాన కృష్ణా పుష్కరాలు జరుగుచున్నవి. ఈ సందర్భంగా విజయవాడకు అన్ని ప్రాంతాల నుండి జనాలు వస్తారని భావించాను. 31-08-04 నుండి 05-09-04 వరకు విజయవాడలోనే ఉండి పుష్కర భక్తులచే స్వామి నామాన్ని వ్రాయించాలని నిర్ణయించాము. అనుకున్నట్లే తేది 31-08-04 నాడు సాయంత్రము విజయవాడలో కృత్తాళం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామి గారు రథాన్ని ప్రారంభించారు. మమ్ములను ఆశీర్వదించారు. ఆ తరువాత అక్కడి జనాలతో వ్రాయించాము. అద్భుత స్పందన వచ్చింది. ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు టిటిడి వారు స్వామివారిని కృష్ణానీటి వరకు తీసుకుపోయే ఊరేగింపులో మా రథం పాల్గొనేది. టిటిడి బ్రాహ్మణులు మా రథంపై కూర్చుండేవారు. ఇది టీవీలో కూడా ప్రసారం అవుచుండేది. రాత్రి 9.30 గంటల వరకు రథం వద్ద జనం రద్దీ విపరీతంగా ఉండేది. నేను నా స్వామివారి ఈ రకమైన సేవతో ఎంతో ఆనందించాను, మైమరచిపోయేవాడిని. ఇల్లు భార్య గుర్తుండేవారు కాదు. ఇక్కడ శ్రీవేంకటేశ్వరుడు ఒక చమత్కారమైన, అద్భుతమైన, మరువలేని లీలను ప్రయోగించాడు. మేము 'నమో వేంకటేశాయ' రథయాత్రను 2004 నుండి 2019 వరకు 16 సంవత్సరాలు చేశాము. ఈ మొత్తం రథయాత్ర కాలానికి ఈ లీల వెన్నెముకలా పని చేసింది. ఆ లీల ఈ విధంగా ఉంది.

నేను 'నమో వేంకటేశాయ' రథంతో రథయాత్ర నిమిత్తమని 31-08-04 నాడు ఉదయం ఇంటినుండి రథంతో పాటు విజయవాడ వచ్చాను. హైదరాబాద్ నుండి వచ్చింది మొదలు స్వామివారి సేవలో మరియు ఈ యాత్రలో, ఏ విధంగా ఎక్కువమంది భక్తులు పాల్గొనాలని, ఫలప్రదం కావాలని ఆలోచిస్తూ ఉండేవాడిని. ఆయన సేవలో తన్మయత్వము పొందేవాడిని. ఇతర విషయాలను మరిచే వాడిని. హైదరాబాద్ నుండి వచ్చినప్పటి నుండి ఒక్కసారి టిటిడి వారి ఊరేగింపులో, 31-08-04 నాటి సాయంత్రం ఈ రథ యాత్రలో ఉండగా మా ఇంటికి ఫోన్ చేసి "రథయాత్ర బాగా జరుగుతోంది, ఇది టీవీలో రావచ్చును, టీవీ చూడమని నా భార్యతో చెప్పాను". తరువాత స్వామి సేవలో పడి ఇల్లు, భార్య, పిల్లలను మరచి 3 రోజుల వరకు ఇంటికి ఫోన్ చేయలేదు. రథయాత్రలో లభించే మధురానుభూతిలో ఇల్లు, భార్య, పిల్లలను మరచాను.

కాని ఇంటివద్ద నా భార్య సురేఖ మాత్రం నా వియోగం వల్ల చాలా బాధపడ్డది. నేను తనను పూర్తిగా మరచానని భావించింది. తనకు ఎవ్వరూ లేరని, ఏకాకినని, మరియు నేను స్వార్థపరుణ్ణని, ఆమెను మరచానని అనుకున్నది. ఇంటికి ఫోన్ చేసి వారి క్షేమములు తెలుసుకోలేదని బాధ పడ్డది. ఇంటినుండి పోయినప్పటి నుండి ఒకేసారి ఫోన్ చేశాడు, అది కూడా తన యోగక్షేమాలు తెలుసుకొనుటకు కాకుండా టీవీలో మా కార్యక్రమము వస్తున్నది చూడమని చెప్పటానికి మాత్రమే ఫోన్

చేశాడని బాధపడ్డది. నాకు ఆమెపై ఏమాత్రము ప్రేమ లేదని భావించింది. నాపై తీవ్రమైన వ్యతిరేక భావం ఏర్పడ్డది. ఒక ఆడది అవసరము కావున, వండిపెట్టుటకు ఒక మనిషి అవసరము కావున నేను ఆమెతో ఉంటున్నాను తప్ప నిజంగా ఆమెపై ప్రేమతో కాదు అని తీవ్ర వ్యధ చెందింది. ఈ బాధతో ఆమెకు గత 2 రాత్రుల నుండి నిద్ర పట్టలేదు. అన్నం తినలేదు. ఉదయం 4 గంటలకు లేచి స్నానం చేసి పూజ చేసేదట. ఈ పూజ కూడా కేవలం టైంపాస్ కొరకు మాత్రమే చేసేది. మనస్సు లగ్నం అయ్యేది కాదు. తరువాత తాను ఒంటరిదానినని ఏడుస్తూ కూర్చుండేది. ప్రతి ఫోన్ రింగ్ ను గమనించి అది నాది కాదని తెలుసుకుని బాధ పడేది. ఈ విధంగా ఆమె ఇంటిలో నరకయాతన అనుభవించింది. ఇక నేనేమో నా మైకంలో ఇల్లు, భార్య, పిల్లలను మరచి స్వామి సేవయందే మనస్సు పెట్టి ఆనందమును అనుభవిస్తున్నాను.

తేది 02-09-04 ఉదయం 7.30 గంటలకు సురేఖ నాకు ఫోన్ చేసింది. నేను నీకు గుర్తున్నానా? అనే మాటతో మొదలుపెట్టి ఏడ్వసాగింది. తను అనుభవిస్తున్న బాధను చెప్పుచు ఏడ్చింది. తనను నేను మోసం చేశానని నాపై కోపించింది. ఆమె కోపాన్ని తగ్గించుటకు, నేను ఫోన్ చేశాను, కాని ఎవ్వరూ లేపలేదని ఏదోరకంగా ఊరడించ ప్రయత్నించాను. కాని లాభం లేకపోయింది. ఆమె ఆవేదనకు బాధ కలిగింది. నా మనస్సు కలత చెందింది. నేను ఆమెను సరిగ్గా చూడలేదని ఆమె భావన. కాని ఏమి చేయను, స్వామి సేవలో పూర్తిగా మరచాను. అందుకే ఆమెకు ఫోన్ చేసి మాట్లాడలేదు. చివరికి సురేఖను కొన్ని అబద్ధాలతో ఏదోవిధంగా చల్లబరిచాను. ప్రతిరోజు 4-5 సార్లు ఆమెతో మాట్లాడుతానని చెప్పాను. మరోప్రక్క ఆమెకు నిద్ర రావడం లేదు. మనస్సు బాగాలేదు. ఏమి చేయాలని భావించి, నా స్వామివారిని మనసారా వేడుకున్నాను. ''ప్రభూ! నా భార్యకు కలిగే బాధను నివారించండి. నేను మీ సేవలో ఎలాంటి ఆనందమును పొందుచున్నానో అలాంటి ఆనందమును ఆమెకు కూడా కలిగించండి'' అని ప్రార్థించాను. మరియు ''మీరు ఏమి చేస్తారో తెలియదు కాని ఇకనుండి నా గురించి బెంగ ఉండకూడదు. నా దారికి అడ్డు రాకూడదు. నిద్ర బాగా రావాలి. ఎలాంటి బాధ ఉండకూడదు అని ప్రార్థించాను''. లేనిచో నేను ఈ రథయాత్రను ఆనందంగా చేయలేనని విన్నవించాను. శ్రీవేంకటేశ్వరుడు నా ఈ ప్రార్థనను తప్పక కరుణించుననే నమ్మకంతో ఉన్నాను.

నా స్వామివారు నా ప్రార్థనను ఆలకించారు. ఒక చమత్కారమును చూపెట్టారు. దానితో నా భార్యకు అంతులేని ఆనందం కలిగింది. నన్ను పూర్తిగా మరచిపోయింది. నేను ఎప్పుడైనా ఫోన్ చేస్తే, సాయిరెడ్డి అనే ఆయన తన భర్త అని గుర్తుకు తెచ్చుకునేది. అంతగా నన్ను మరిచింది. మంచి నిద్ర పోయింది. నేను స్వామివారికి ఇంకా సేవ చేయాలి అనే భావము ఆమెలో




ఎక్కువైంది. ఆ స్వామివారు చూపిన లీల అంత మహత్యమైంది. ఆ లీల ఈవిధంగా ఉంది.

02-09-04 కల : ఈరోజు రాత్రి సురేఖ కలలో స్వామివారు కనబడ్డారు. ఆయన తన ముఖము అంటే శంఖు, చక్రములతో సహా దర్శనమిచ్చారు. ఆ దర్శనములో కేవలం ఆయన ముఖమును మరియు శంఖు చక్రములను తదేక దృష్టితో చూపారు. ఇలా చూస్తున్నప్పుడు ఒక మాయను ఆమెపై ప్రయోగించాడు. అత్యంత నల్లనిదైన ఆ ముఖమును చూచిన వెంటనే ఆమెలో భక్తిభావం పెంపొందింది. ఆనందానికి హద్దులు లేవు. నన్ను మరిచిపోయింది. ఇంకా చెప్పాలంటే నేనసలు గుర్తే లేదు. ఆ స్వామి సేవ ఇంకా చేయాలి అనే సంకల్పము కలిగింది. తరువాత మంచి నిద్ర పట్టిందట. ఈ విధమైన మార్పును స్వామివారు ఆమెలో కలిగించారు. లేదా ఆమెకు దర్శనమివ్వ తలంచి ఈ విధమైన లీలను చేశాడో? ఆయనకు ఆయనే సాటి! ఈ సంఘటన తరువాత ఆమె నాకు ఎప్పుడూ ఫోన్ చేయలేదు. నేను ఎప్పుడైనా ఫోన్ చేస్తే సంతోషంగా మాట్లాడేది. పూర్వపు చిరాకు ఉండేది కాదు. తేది 06-09-04 నాడు సురేఖ తిరుపతికి జప సమర్పణకు వచ్చినప్పుడు ఈ విషయం నాతో చెప్పి సంతోషించింది. అప్పుడు నేను నా స్వామివారికి కోటి కోటి ప్రణామాలను సమర్పించుకున్నాను. అప్పటినుండి అంటే 2004 నుండి 2019 వరకు ప్రతి రథయాత్ర సమయాన ఆమె ఆనందాన్ని అనుభవిస్తున్నది. నా మార్గానికి ఎప్పుడూ అడ్డు రాలేదు. ఈ మార్పు రథయాత్ర నిర్వహణలో ఎంతో ఉపయోగపడింది.

## 2వ పర్యాయంగా 7 కోట్ల జపాన్ని సమర్పించుట

తేది 06-09-04 : ఈరోజు సాయంత్రం 'నమో వేంకటేశాయ' రథంలో, రెండో పర్యాయంగా 7 కోట్ల జపమును,

తిరుపతిలోని అలిపిరి వద్దనున్న శ్రీవారి పాదాల మండపము వద్దకు తీసుకెళ్ళి పాదాల మండపముపై పెట్టి స్వామివారికి సమర్పించాము. పూజా కార్యక్రమము కొరకు స్వామివారి పాదములను టిటిడి వారి అనుమతితో తీసుకువచ్చి అభిషేకించి పూజించాము. శ్రీవిష్ణు సహస్ర నామమును శ్రీవేంకటేశ్వర మహామంత్రముతో అనుసంధానించుచు పారాయణం చేశాము. జపం వ్రాసినవారి కోరికలను తీర్చుమని, అందరికీ స్వామి అనుగ్రహము లభించాలని ప్రార్థించాము. ఈ పూజా కార్యక్రమము అయిన వెంటనే బ్రహ్మాండమైన వర్షము వచ్చింది. ఇది స్వామివారు ఈ జపమును స్వీకరించుటకు నిదర్శనమని భావిస్తూ సంతోషించాము. ఇక్కడ స్వామివారు మరోచమత్కారమును చూపారు. తేది 21-12-03 నాటి కలలో మాదిరి శ్రీవారు తన రూపమును పాదాల మండపముపై చూపారు. ఇది తిరుమలలో స్వామివారి అభిషేక రూపం లాగా ఉన్నది. నేను ఈ స్వామివారి పాదాలకే ఈ జపాన్ని సమర్పించి, పాదపూజ చేశాను. ఎంతో ఆనందించాను. ఈ రూపం కేవలం నా ఒక్కడికే కనబడింది. (ఈ లీల ప్రతి సంవత్సరం పాదాల మండపముపై జప సమర్పణ సందర్భంగా నేటికీ కనబడుతోంది). స్వామివారు స్వయంగా ఈ జపాన్ని, పూజను స్వీకరించినట్లు అనిపించింది.

07-09-04 : ఈరోజు గోకులాష్టమి. టిటిడి వారి సూచన మేర, ప్రతి గోకులాష్టమికి 7 కోట్ల జప సమర్పణ చేయ నిర్ణయించాము. ప్రతి సంవత్సరం టిటిడి వారు గోకులాష్టమిని వారి డైరీఫాంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. స్వామివారి కృపా విశేషం చేత , వారి కార్యక్రమము అయిన తరువాత ఈ.వో గారితో పాటు టిటిడి అధికారులు ఈ జప సమర్పణ కార్యక్రమములో పాల్గొంటారు. శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపమును పూలచే చక్కగా అలంకరించారు. మేము ఉదయం శ్రీవేంకటేశ్వర మహామంత్ర యజ్ఞమును చేశాము. తరువాత శ్రీ విష్ణు సహస్ర నామమును శ్రీవేంకటేశ్వర మహామంత్రముచే అనుసంధానము చేసి పూజ చేశాము. మధ్యాహ్నం 1 గంటకు ఈ.వో శ్రీమాన్ అజయ్ కళ్ళాం గారు అధికారులతో సహా వచ్చారు. యజ్ఞ పూర్ణాహుతి కావించి స్వామివారికి 2వ పర్యాయంగా 7 కోట్ల జపమును సమర్పించారు. జపము వ్రాసిన వారందరి కోరికలు తీరాలని ప్రార్థించారు. ఆ తరువాత తృతీయ పర్యాయంగా 7 కోట్ల జపమును ప్రారంభించారు. ఈవో శ్రీ అజయ్ కళ్ళాం గారు మాట్లాడుతూ నేను పెద్ద పెద్ద పీఠాధిపతులు చేయలేని పనిని చేస్తున్నానని అభినందించారు. ఆ తరువాత భక్తులు తలా కొంత జపమును అత్యంత భక్తిపూర్వకంగా 'శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపము'లో సమర్పించారు.

ఇక్కడ శ్రీవేంకటేశ్వరుడు మరో లీలను ప్రసాదించారు. జప సమర్పణ సమయాన స్థూపము ప్రక్కన 5' X 6' సైజుతో 4' అడుగుల ఎత్తు వరకు వ్రాసిన జపమును కుప్పగా పేర్చి



పూజించాము. ఈ జప కుప్పపైన స్వామివారు విరాట్ రూపునిగ నిలుచున్నట్లు భ్రమ కలిగింది. ఈ కుప్పకు సమాన సైజు గల వారి పాదాలు మరియు ఆ పాదాలపై రెప రెపలాడుతున్న స్వామి పంచె అంచును మాత్రం స్పష్టంగా చూచాను. ప్రతి జప పుస్తకము స్వామి పాదాల క్రింద ఉన్నట్లు అనుభూతి చెందాను. నేను ఆ పాదాలనే పూజించాను.

ఈ విధంగా మొదటి రథయాత్ర, 2వ జప సమర్పణ అత్యంత తృప్తి కలిగించి, స్వామి సూచించినట్లు 70 వేల కంటే ఎక్కువ భక్తులను భాగస్వాములుగా చేయగలిగాము. నా మొదటి రథయాత్రలో అత్యంత తృప్తి లభించింది. రథయాత్ర ప్రారంభం నుండి స్వామి పట్ల శరణాగత భావము, సేవక భావము రోజులు గడిచిన కొద్దీ పెరిగింది. చివరి రోజైన జప సమర్పణ వరకు ఈ భావం తారాస్థాయికి చేరింది. నా కళ్ళకు స్వామి తప్ప మరేదీ కనిపించేది కాదు. తరువాత మేము కొండకు వెళ్ళి తేది 08-09-04 నాడు స్వామివారిని దర్శించుకున్నాము. జపాన్ని, మా సేవను స్వీకరించమని ప్రార్థించాము. తెల్లవారి హైదరాబాద్ వచ్చాము. పిదప తృతీయ పర్యాయంగా ఏడు కోట్లకు జప పుస్తకములను పంచుట ప్రారంభించాము.

ఇంటి గురించి : హైదరాబాద్ లో నాకు ఒక ఇంటి స్థలమును ప్రసాదించుమని స్వామివారిని గతంలో వేడుకున్నాను. హైదరాబాద్ లో హబ్సిగూడ లోని కాకతీయనగర్ కాలనీలో ప్లాట్ నెం.9/3 ఎం బ్లాక్ లో 755 గజములు గల ప్లాటును చూపెట్టాడు. ఇది ఉస్మానియా యూనివర్సిటీ గోడకు ఆనుకుని ఉంది. చిత్రమేమిటంటే నవంబర్-డిసెంబర్ 2003 లో స్వామివారు కలలో చూపిన ప్లాట్ ఇదే. విద్యానగర్ లోని మా ఆఫీసు నుండి యూనివర్సిటీ గుండా ఈ ప్లాట్ వద్దకు అనధికార దారి గుండా వెళ్ళితే నేను కలలో చూచిన పెద్ద పెద్ద చెట్లు, అడవి, పిల్లబాటలు, సరుగుడు చెట్లు అన్నీ కలలో చూచినట్లే ఉన్నాయి. యూనివర్సిటీ లోని సర్కారు తుమ్మచెట్లు ఈ ప్లాట్ లోనికి వంగి, కలలో నాకు తుమ్మచెట్ల మాదిరిగా కనబడ్డాయి కాని తుమ్మచెట్లు కావని కలలోనే అనుకున్నాను. ఈ ప్లాట్ శ్రీమాన్ జి.వి.జి కృష్ణమూర్తి గారిది. ఈయన ఈ మధ్యనే మన దేశానికి చీఫ్ ఎలక్షన్ కమిషనర్ గా పదవీ విరమణ చేశారు. ఆయన ప్లాట్

మొత్తం ధరను ఒక నెల ముందు ఢిల్లీకి వచ్చి ఇవ్వమన్నారు. ఒక నెల తరువాత తన భార్య హైదరాబాద్ వచ్చి రిజిస్ట్రేషన్ చేస్తుందని చెప్పారు. అందుకు నేను సిద్ధమైనాను. ఒక నెల ముందే పూర్తిగా డబ్బు ఇస్తున్నాను కాబట్టి అగ్రిమెంట్ జాగ్రత్తగా వ్రాసుకోవాలని భావించాను. మా అడ్వకేట్ సంపత్ కుమార్ గారికి ఈ విషయం చెప్పాను. ఆయన అగ్రిమెంట్ తయారు చేస్తాను రేపు రమ్మన్నాడు. ఇది స్వామివారి సేవలాగా భావించి జాగ్రత్తగా భక్తితో తయారు చేయమన్నాను. తెల్లవారి ఆయన వద్దకు వెళ్ళాను. ఇక్కడ స్వామివారు మరో చమత్కారం చూపెట్టారు.

11-09-04 కల : ఇది మా అడ్వకేట్ సంపత్ కు వచ్చింది. ఈ రాత్రి కలలో ఈయన తిరుపతికి వెళ్ళాడట, కొండ ఎక్కాడట, మరియు శ్రీవేంకటేశ్వరుని దర్శనము చేసుకున్నారట. ఇంతే కల. దీనికి ఈయన ఎంతో సంతోషించారు. మహదానందపడ్డారు. అగ్రిమెంట్ వ్రాయుటకు ఎలాంటి ఫీజ్ వద్దన్నారు. ఆయన కలను చెప్పి సంతోషపడ్డారు. ఇలా మాకే కాకుండా మేము చేసే పనిలో డైరెక్టుగా కాని ఇన్ డైరెక్టుగా కాని పాలు పంచుకున్న ప్రతి భక్తుణ్ణి స్వామివారు అనుగ్రహించేవారు.

తరువాత నేను ఢిల్లీ వెళ్ళాను. డబ్బులు ఇచ్చి అగ్రిమెంట్ చేసుకున్నాను. తరువాత తేది 18-10-04 నాడు జి.వి.జి కృష్ణమూర్తి గారి భార్య శ్రీమతి రాధామూర్తి గారు వచ్చి రిజిస్ట్రేషన్ చేశారు. మొత్తం 755 గజములు గల ప్లాట్ లో నా పేరు పైన 647 గజములు మరియు శ్రీవేంకటేశ్వర సేవాసమితి పేరుపైన 'నమో వేంకటేశాయ' రథం షెడ్డు కోసమని 108 గజములు రిజిస్ట్రేషన్ చేయించాను.

తరువాత ఈ స్థలములో రథానికి షెడ్డు మరియు మాకు మంచి ఇల్లు నిర్మించాలని నిర్ణయించాము. ఇక్కడ కూడా స్వామివారు లీలలను ప్రయోగించారు. వీటిని తరువాత చూద్దాం. నేను గత 14 సంవత్సరాల నుండి బిల్డరుగా ఎన్నో బంగ్లాలకు ప్లాన్లు తీయించి నిర్మించాను. సాధారణంగా ఒకటి రెండు ప్రయత్నాలతో నాకు నచ్చిన ప్లాను లభించేది. కాని మా ఇంటి విషయంలో మాత్రం అలా జరగలేదు. మా ఆర్కిటెక్ట్ శ్రీమాన్ శివలీలానంద్ గారు ఎన్నో చక్కని ప్లాన్స్ వేశాడు. కాని నాకు నచ్చలేదు. చివరికి నా సొంత ప్లాన్ ప్రకారం గీసి ఇచ్చాడు. నిజానికి నా ప్లాన్ కంటే ఆర్కిటెక్ట్ ప్లాన్ చాలా బాగుంది. కాని అప్పుడు నా మనస్సు ఒప్పుకోలేదు. చివరికి నా ప్లాన్ ప్రకారం ముందుకెళ్ళాము.

భూ సమస్య : ఈ సమస్య ప్రస్తుతం పోలీసు స్టేషన్ లో, కోర్టులో ఉంది. జప సమర్పణ ఉండుట వలన నేను ఈ కాలంలో నా ఆస్తి గొడవలను పట్టించుకోలేదు. స్వామి సేవకే విలువిచ్చాను. ఇప్పుడు తిరిగి దానికై ప్రయత్నించాను.

అక్టోబర్ 04 కల : ఈ కలలో నేను ఒక పెద్దమనిషి వద్దకు నా మియాపూర్ భూమి విషయమై న్యాయము చేయమని వెళ్ళాను. ఆ పెద్దమనిషి పురాతనమైన భవంతిలో సమస్యలు పరిష్కరించు వ్యక్తి లాగా సకులం ముకులం పెట్టుకుని కూర్చున్నాడు. ఆయన కొంచెం నలుపురంగులో ఉన్నాడు. ఆయన వెనకాల ఒక చెక్కగోడ ఉంది. నా గొడవ చెప్పాను. కాని నాకు సరిగా చెప్పడానికి రావడం లేదు. అంటే ఈ సమస్యను పూస గుచ్చినట్లు చెప్పుట లేదు. దానికి ఆయన, నాకు వారి గురించి బాగా తెలుసు, వారు మోసగాళ్ళు అని ఉండు ఉండు అని అన్నారు. కల చెదిరింది.

ఈ కల తరువాత దాదాపు వారం రోజులకు నేను మియాపూర్ పోలీసు స్టేషన్‌కు వెళ్ళాను. అప్పుడు ఒక క్రొత్త ఇనస్పెక్టర్ వచ్చారు. ఆయన సరిగ్గా నేను కలలో చూచిన వ్యక్తిలాగనే ఉన్నారు. నా సమస్యను చెప్పాను. నాకు సరిగా చెప్పడం రావట్లేదు. వెంటనే ఈయన కలుగజేసుకుని వారి గురించి తెలుసు, వారు పచ్చి మోసగాళ్ళు అన్నాడు. వెంటనే ఏదో విషయమై నన్ను ఉండు ఉండు మని సరిగ్గా కలలో జరిగినట్లే అన్నాడు.

తరువాత 2 రోజులకు మళ్ళీ పోలీసు స్టేషన్ కు వెళ్ళాను. అప్పుడు ఈయన ఆ దుండగులను అరెస్ట్ చేసి లోపల వేశాడు.

## ఎంచుకున్న మార్గాన్ని ఆమోదించుట

సేవ గురించి : నేను ప్రతి సంవత్సరం 70 వేల జప పుస్తకములను భక్తులకు పంచుచు, 7 కోట్ల జపమును వ్రాయిస్తున్నాను. అయితే జప సమర్పణ వరకు ఎన్ని వ్రాసిన జప పుస్తకాలు వస్తే వాటిని మాత్రమే తిరుపతిలో పూజ చేసి సమర్పించాము. రాని పుస్తకములను కూడా స్వామివారికి సమర్పించినట్లు భావించుచు పూజచేసి సమర్పించాము. ఈ క్రింది కల ద్వారా నేను ఎన్నుకున్న ఈ విధానం స్వామివారికి నచ్చిందనే భావం కలిగింది.

07-11-04 కల : ఈ కలలో నేను పుష్పగిరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విద్యా నృసింహా భారతీ స్వామివారి దర్శనానికై బేగంపేట లోని వారి ఆశ్రమానికి వెళ్ళాను. స్వామివారు లోన ఉన్నారు. నేను ముందు గదిలోనికి వెళ్ళాను. అక్కడ ఆ పీఠానికి ఇన్ ఛార్జి 'గోవిందగిరి' నాతో మాట్లాడాడు. మీ పేరు? ఏమి చేస్తుంటారు అని అడిగారు. నా పేరు చెప్పునప్పుడు స్వామివారు బయటికొచ్చారు. ఆయనకు ప్రణమిల్లిన తరువాత నేను శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కోట్ల జపమును సమర్పిస్తున్నాను. సంవత్సరానికి మొత్తం 70 వేల జప పుస్తకములను పంచుదును. ఎన్ని తిరిగి వచ్చునో అన్ని మాత్రమే 7 కోట్ల జపముగా భావించి సమర్పించెదనని చెప్పాను. ఆయన సరేనని అన్నారు. కల చెదిరింది. ఈ విధంగా స్వామివారు నేను ఎంచుకున్న మార్గాన్ని ఆమోదించారని భావించాను.

ప్రతిక్షణం స్వామివారిని స్మరిస్తూ ఉన్నాను. నన్ను, నా ఆస్తుల సమస్యలను రక్షించుమని వేడుకుంటున్నాను. ఈ విశ్వమంతటా ప్రతి దేశంలో స్వామివారే ఉన్నారని భావించాను.

08-11-04 కల : ఈ లీల నానిపోవుట వలన సరిగా

కనబడలేదు. అర్థం చేసుకున్నంత వరకు వివరిస్తున్నాను. నేను ఆఫ్ఘనిస్తాన్ వెళ్ళాను. అక్కడి భవనాలను రోడ్లను చూచాను. నేను మరియు నాతోపాటు మరో ఇద్దరు కారులో ఒక బజారులో వెళ్ళుచున్నాము. ఇంతలో ఒకాయన మీకు డ్రైవింగ్ లైసెన్స్ లేదు, ఇండియాది చెల్లదు పోలీసులు పట్టుకుంటారు, ఈ ప్రక్క సందునుండి వెళ్ళమన్నాడు. మేము ఆ సందు నుండి వెళ్ళుచున్నాము. ఇంతలో అక్కడ ఒక శ్రీకృష్ణుని గుడి కనబడింది. అందులో తిరునామాలు ధరించిన పూజారి కనబడ్డాడు. మేము కారు దిగి గుడిలోనికి వెళ్ళాము. ఇంతలో పూజారి గుడి ప్రక్కనే ఉన్న ఆయన ఇంటికి వెళ్ళాడు. మేము ఆయనను అనుసరించాము. ఈ క్రమములో గుడి గర్భాలయములో ఉన్న కృష్ణ, బలరామ, సుభద్రా మూర్తులను దర్శించాము. గర్భాలయము ప్రక్కన ఉన్న గోడపై కూడా స్వామివారి బొమ్మలను చూచాము. కల చెదిరింది. దీని అర్థం తెలియదు. బహుశా నన్ను అనుగ్రహించారనుకున్నాను.

నేను ఎన్నో స్వామివారి అనుభూతులను అనుభవించాను. వాటిని ఒక ప్రత్యేక పుస్తకములో వ్రాశాను. కాని ఎప్పుడు వాటిని తిరిగి చదవలేదు. వీటి ప్రభావం నాలో వారం పది రోజులు మాత్రమే ఉండేది. తరువాత మరిచేవాడిని. మళ్ళీ స్వామివారి క్రొత్త లీల కావాలని ప్రార్థించేవాడిని. స్వామివారు నా ఆత్రుతకు తగినట్లు ప్రసాదించేవారు. ఈ విధంగా జీవితం గడుస్తోంది.

## భక్తులతో కలిపి భగవంతుని సేవను ప్రసాదించుట

సేవ గురించి : జప సమర్పణ అనే కార్యక్రమములో సంవత్సరమునకు ఒక రెండు నెలల కాలము మాత్రమే స్వామి సేవ లభిస్తుంది. మిగిలిన రోజులలో జప పుస్తకముల వితరణ కార్యక్రమానికి మా ఆఫీసులో ఒక వ్యక్తిని నియమించుకున్నాను. కాబట్టి నాకు అంతగా పని ఉండేది కాదు. ఇలా సంవత్సరానికి పది నెలలు స్వామి సేవకు దూరంగా ఉండుటను తట్టుకోలేక పోయాను. స్వామిసేవకై నా నరనరాలలో రక్తం పరుగులు తీసేది. పూర్వం శంబరాసురుని యుద్ధ కాంక్ష లాగా నాలో స్వామివారి సేవాకాంక్ష పొగలు కక్కేది. దీనిని తీర్చుమని స్వామివారిని పలు రకాలుగా ప్రార్థించేవాడిని. మీకు మీ భక్తులకు కలిపి సేవ చేసుకునే భాగ్యమును ప్రసాదించుమని వేడుకున్నాను. నిజానికి స్వామివారు నా ఈ కోరికను తీర్చుటకు 'నమో వేంకటేశాయ' అనే ఒక మాసపత్రికను ప్రారంభించమని అప్పటికే ఆజ్ఞాపించారు. కాని అది ఎందుకో నాకు నచ్చలేదు. ఈ పత్రిక గుర్తులేదు. ఒక పత్రికను స్థాపించాలనే తలంపు నాలో ఎప్పుడూ లేదు. స్వామి ఆజ్ఞాపించారు కాబట్టి తేది 15-11-04 నాటికి, పత్రిక ప్రారంభించుటకు వీలుగా పోలీసు డిక్లరేషన్ కూడా సమర్పించాను. అంటే పత్రిక ప్రారంభించుటకు అన్ని అనుమతులను తీసుకున్నాను. జనవరి 2005 నుండి పత్రికను ప్రారంభించవలసి ఉంది. కాని నాకు దీనిపై ఆసక్తి లేక ఊరుకున్నాను. మరోప్రక్క స్వామి సేవ, ఆయన భక్తులతో కలిపి లభించాలని ఉవ్విళ్ళూరుచున్నాను. స్వామిని ప్రార్థిస్తున్నాను. ఆ రోజులలో నాకు ఏ కష్టము వచ్చినా తిరుమలగిరి శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారిని వేడుకునేవాడిని. 15-11-04 నాడుకూడా ఈ ఆలయానికి వెళ్ళాను. తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ఆయన భక్తులతో కలిపి సేవను ప్రసాదించుమని ప్రార్థించాను. మీరు ఒక మధ్యవర్తిగా వ్యవహరించమని వేడుకున్నాను. 11 ప్రదక్షిణాలు చేశాను. ఆ తరువాత వెనుకనే ఉన్న పరమశివుణ్ణి కూడా ప్రార్థించాను. ఈ ప్రార్థన సమయాన నా కళ్ళలో నీళ్ళు సుడులు తిరిగాయి. రోమాంచితుడనైనాను. ఎలాగైనా స్వామి సేవ కావాలనే పట్టుదలతో ప్రార్థించాను. చివరికి స్వామివారు ఈ విధంగా కరుణించారు. ఈ జీవితంలో ఇది మరో ఆణిముత్యం, పరవశించిపోయాను.

16-11-04 కల : నేను ఒక పొరుగూరికి పోయాను. నేను పోయిన పని తొందరగా అయిపోయింది. కాబట్టి మిగిలిన సమయాన ఏ పనిలేక సోమరిగా ఉన్న నాకు ఏదో ఒక పార్ట్ టైం పని చేయాలనే కోరిక కలిగింది. ఏదైనా పని దొరుకుతుందేమోననే ఉద్దేశ్యముతో రోడ్డుపై అటు ఇటు చూస్తూ, ఎవరైనా పిలిచి పని ఇస్తారేమోనని చూస్తూ పోవుచున్నాను. ఇంతలో ఎక్కడినుండో ఒక మేస్త్రీ నాకు జత కలిశాడు. నేను ఒక ఇంజనీరుని, నాతో ఒక మేస్త్రీ, కావున ఏదో ఒక పని ఎవ్వరిదైనా సరే చేసి కొంచెం డబ్బులు సంపాదించుకుంటే సరే అనే విధంగా ఇద్దరం కలిసి పోవుచున్నాము. వెడల్పుగా అందంగా ఉన్న



ఒక డాంబర్ రోడ్డుపై పోవుచున్నాము. ఆ రోడ్డకు ఇరువైపులా ధనవంతుల విలాసవంతమైన భవనాలు కనబడ్డాయి. మేము నడుస్తూ నడుస్తూ ఈ ఇళ్ళను దాటి జనసంచారము అంతగా లేని అడవి లాంటి ప్రదేశమునకు చేరుకున్నాము. ఇంతలో ఎదురుగా కొన్సటి గోపురము కలిగిన ఒక ఆంజనేయుని ఆలయమును చూచాను. అందులో శ్రీ ఆంజనేయుడు నమస్కారముతో చేతుల వరకు మాత్రమే ఉన్న ఆయన విగ్రహమును చూచాను (పటంలో చూపిన విధంగా). ఈ ఆలయం ముందు కాషాయ వస్త్రధారణలో ఈ ఆలయ పూజారి ఉన్నాడు. ఈ ఆలయానికి కొద్ది దూరములో ఒక గుట్ట ఉంది. ఆ పూజారి నన్ను పిలిచి, గుట్ట పైన నీళ్ళ ట్యాంక్ బాగు చేయాలి, చేస్తావా? అని అడిగాడు. నేను సరేనన్నాను. నేను పనిలేక ఊరికే ఉన్నాను, ఏదైనా పని చేసి నాలుగు రాళ్ళు సంపాదించాలన్నాను. నా దగ్గర కూడా కొంత ధనమున్నది, కానీ ఊరికే ఎందుకుండాలి? కాబట్టి ఏదైనా పని చేద్దామనుకున్నానని వినయంగా ఆయనతో అన్నాను. ఇంతలో ఆయన నాకు స్వామివారి ప్రసాదమును ఒక దొప్పలో పెట్టి ఇచ్చారు. ఈ ప్రసాదమును తిని పని చేయండని చెప్పారు. ఆ నీళ్ళ ట్యాంకు ప్రక్కనున్న గుట్టపైన ఉన్నది, వెళ్ళి బాగు చేయమని చెప్పారు. ఆ ట్యాంకు నీళ్ళే ఈ ఆలయమునకు వచ్చునట, గుడి అవసరాలతో పాటు భక్తుల అవసరాలను కూడా తీర్చునట. ఇంతలో మరికొంతమంది భక్తులు అక్కడికి వచ్చారు. మమ్ములను ప్రక్కకు జరగమని పూజారితో ఏదో ముహూర్త విషయం మాట్లాడుచున్నారు. నేను ఈ పూజారి ఇచ్చిన ప్రసాదమును తిన్నాను. చిత్రమేమిటంటే ఈ పూజారి ఇచ్చిన ప్రసాదము సాక్షాత్ తిరుపతి ప్రసాదమే. టిటిడి వారు వారి మీటింగులలో ఇచ్చే ప్రసాదమునే ఈ పూజారి ఇచ్చారు. తినుటకు ఒక ప్లాస్టిక్ స్టిక్ ను కూడా దొప్పలో ప్రసాదంతో పాటు ఇచ్చారు. నేను తిరుపతిలో కొన్ని సందర్భాలలో ఈ ప్రసాదమును తిన్నాను. నేను కలలోనే ఇది తిరుపతి ప్రసాదమని అనుకున్నాను. ఆ తరువాత కొండపైకి పని నిమిత్తమని నడుచుకుంటూ వెళ్ళాను. అక్కడ చూచేసరికి నీళ్ళ ట్యాంక్ లేదు. ఒక కాలిబాట ఉంది. దూరంగా ఉన్న ఒక ఆలయానికి పోవుటకు ఈ బాట ఉన్నదట. అక్కడున్నవారిని నీళ్ళ ట్యాంకు ఎక్కడుంది అని అడిగాను. వారు అది ఇంకా కొంత దూరంగా ఉంది, కొండపైన శ్రీవేంకటేశ్వరస్వామి గుడికి వెళ్ళేదారిలో ఉన్న మరో గుడి వద్ద ఉన్నదని చెప్పారు. ఆ గుడిలో ఎవ్వరున్నారని అడిగాను. ఆ గుడిలో శ్రీవేంకటేశ్వరుడున్నారని చెప్పారు. ఆ దూరాన ఉన్న శ్రీవేంకటేశ్వరుని గుడి నాకు మిరుమిట్లు గొల్పుతూ కనబడింది. నేను ఇక్కడినుండే ఆ గుడిలో ఉన్న శ్రీవేంకటేశ్వరుణ్ణి ఊహించుకున్నాను. ఆయన బంగారు వస్త్రములను, నల్లని ముఖమును, కిరీటమును, బంగారు ఆభరణములతో చూచినట్లు ఊహించుకున్నాను, కాదు చూచాను. మైమరచిపోయాను. చిత్రమేమిటంటే ఆ దారి తిరుమల శ్రీవారి గుడికి కాలి నడకన వెళ్ళే దారేనట. ఆ శ్రీవేంకటేశ్వరుని గుడి అనుబంధంగా ఎన్నో చిన్న చిన్న గుళ్ళు ఉన్నాయట. అక్కడి భక్తులు చెప్పారు. కల చెదిరింది.

తెల్లవారి లేచి సంతోషంతో ఎగిరి గంతేశాను. నా ఆనందమునకు హద్దులు లేవు. సాక్షాత్ భగవంతుడు నా కోరికను తీర్చాడని అరవబోయాను. మహదానందం పొందాను. ఆ సమయాన సాక్షాత్ భగవంతుడు ప్రత్యక్షమై నీకు ముక్తినిస్తానని కాని లేక ఈ దేశానికి ప్రధాని లాంటి పదవినిస్తానని చెప్పినప్పటికీ, నాకు ఇదే పుల్లగూర్ల సాయిరెడ్డి జీవితమే కావాలని కోరేవాడిని. శ్రీవేంకటేశ్వరునికి, ఆయన భక్తులకు కలిపి సేవ చేయాలనే నా కోరిక అంత బలంగా ఉంది. మరియు ఈ కలను విశ్లేషించాను. శ్రీవేంకటేశ్వరుని గుడివద్ద గల వాటర్ ట్యాంకును బాగు చేయు పనిని నాకు అప్పజెప్పారు. ఆ ట్యాంకు నీరు స్వామివారి ఆలయంతో పాటు వచ్చిన భక్తుల అవసరాలను కూడా తీర్చుటకు ఉపయోగపడుతుంది. అంటే నేను చేయబోవు పని స్వామిసేవతో పాటు భక్తుల సేవను కూడా తీర్చుచున్నది. నా మనస్సులోని కోరికలను గ్రహించి స్వామివారు ఈవిధంగా అనుగ్రహించబోవుచున్నారని భావించాను. కాని ఈ సేవ చేయు రోజు ఎప్పుడు వస్తుందా అని వేయి కళ్ళతో వేచి చూడసాగాను. మరో విషయం. ఈ కలలో నావద్ద కొన్ని డబ్బులు ఉన్నప్పటికీ ఊరికే ఉండలేక మరికొన్ని డబ్బులు సంపాదించాలని ప్రయత్నించాను. దీని అర్థం – నాకు ఇంతకుముందే జప సమర్పణ సేవ ఉన్నప్పటికీ తృప్తి చెందక మరో సేవ కోరుకుంటున్నానని అర్థం. ఇంత చక్కని కలను స్వామివారు చూపెట్టారు.

నిజానికి పైన చెప్పిన సేవను 'నమో వేంకటేశాయ' పత్రిక ద్వారా స్వామివారు ప్రసాదించారు. కాని ఆ సమయాన నేను దీనిని అర్థం చేసుకోలేదు. పత్రిక నా వల్ల కాదు, మీరు మరో వ్యక్తిని చూసుకోండని స్వామివారితో చెప్పేవాడిని. ఇది పత్రిక విషయమై స్వామివారు చూపిన రెండవ లీల.

ఇంటి గురించి : స్వామివారు నాకు తను గతంలో చూపెట్టిన ప్లాటును ప్రసాదించారు. నాకు నచ్చినట్లు ప్లాను సిద్ధం చేసి ఈనాడు అనగా 22-11-04, కార్తీక ఏకాదశి ఉదయం 5.15 గంటలకు భూమి పూజ చేశాము. ఇందులో రెండు భూమి పూజలు చేశాము. ఒకటి మా ఇంటి గురించి, మరోటి 'నమో వేంకటేశాయ' రథము షెడ్డు గురించి. ఈ పూజలో కూడా స్వామివారు చక్కని లీలలను చూపారు.

22-11-04 లీల : బ్రాహ్మణులు భూమి పూజా కార్యక్రమములో భాగంగా, నాలుగు గ్లాసులలో నీరు నింపి అందులో మామిడి ఆకులు వేయించారు. పాలు, పెరుగు, పంచామృతములను కూడా వేశాము. ఆ తరువాత రెండు గ్లాసుల నీటిని మరో రెండు గ్లాసులలో పోయించారు. ఈ నీరు




పోయుచున్న సమయాన నేను స్వయంగా నీరు, పాలు, పెరుగు, పంచామృతాలతో నా స్వామివారి పాదాలను, స్వయంగా నా చేతులతో రాసి కడుగుచున్నటుల అనుభూతి పొందాను. ఆయన పాదాలపైననే నీరు పోస్తున్న భావన కలిగింది. కార్యక్రమము మొత్తం సమయం ఆయన పాదాలనే చూశాను. ఇక నా భార్య సురేఖకి మాత్రము స్వామివారి కిరీటము కనబడిందట. నాకు ఆయన పాదాలు, సురేఖకు స్వామి కిరీటము కనబడ్డాయి. ఈ ఇంటిలో మీ సేవను మరింత ఎక్కువగా, తృప్తిగా చేసే భాగ్యాన్ని ప్రసాదించమని వేడుకున్నాము. ఇలా పూజా కార్యక్రమము ముగిసింది.

ఈ మధ్యన చాలా కలలు వచ్చాయి. కాని గుర్తు లేవు. ప్రతి కల స్వామి గురించి, ఆయన పూజా కార్యక్రమముల గురించే ఉంది. నేను, నా ఆస్తి గొడవలలో నా మనస్సు లగ్నం అవుట వలన ఈ కలల విషయం గుర్తించలేదు. సమయం వచ్చినప్పుడు స్వామివారు తప్పక తెలియజేస్తారనుకున్నాను.

## మంత్రోపదేశం చేయుట

పత్రిక గురించి: తేది 25-08-2004 నాడు హైదరాబాదులో రథయాత్ర ప్రారంభ సమయాన శ్రీశ్రీశ్రీ వ్రతధర్ నారాయణ రామానుజజీయర్ స్వామివారు పలికిన మాటలు యథార్థమైనాయి. నాకు మరింత శక్తిని మరియు మంత్రోపదేశమును శ్రీశ్రీశ్రీ జీయర్ స్వామి చేత చేయించారు. నా ప్రభు తిరుమల శ్రీవేంకటేశ్వరుని నామము అందరికీ చేరి, అందరూ ధన్యులు కావాలనే నా కోరికకు అనుగుణంగా ఈ లీల ఉంది.

30-11-04 కల : ఈ కలలో నేను ఒక అడవిలో ఉన్నాను. ఆ అడవిలో కొన్ని చోట్ల మైదానములు, అక్కడక్కడ చెట్లు, చిన్న చిన్న పుట్టలు ఉన్నవి. నేను వాటి పరిసర ప్రాంతములలో ఉన్నాను. ఇంతలో నా మిత్రులు లేదా శ్రేయోభిలాషులు కొందరు శ్రీశ్రీశ్రీ శ్రీనివాస వ్రతధర్ నారాయణ రామానుజ జీయర్ స్వామివారిని తీసుకొని వచ్చారు. నాకు మంత్రోపదేశము చేయుటకు వారు వచ్చారు. ఆయన నాకు మంత్రోపదేశము చేశారు. కాని ఈ ఉపదేశించుట నాకు కనపడలేదు. ఆయన ఉపదేశమును పొందిన వెంటనే నిద్ర నుండి లేచినటుల (కలలోన) అనిపించింది. మరియు అప్పుడు నేను మునుపటి ప్రదేశము కాకుండా, ఒక సరికొత్త ప్రదేశములో ఉన్నట్లు భ్రమ కలిగింది. ఆ పరిసర ప్రాంతాలు నాకు కొత్తగా కనిపించాయి. కాని మరోప్రక్క అక్కడి నా మిత్రుల మాటలు స్పష్టంగా వినబడుచున్నవి. వారు మాత్రం కనబడుటలేదు. క్రొత్త ప్రదేశమును చూస్తున్నాను. అంటే నేను అక్కడనే ఉన్నప్పటికీ నా మానసిక స్థితి మాత్రం భిన్నంగా ఉంది. నేను ఎక్కడికో పోవుచున్నాను. దేవుడిని వెతకడానికి... నాకేమైంది, ఇంతలోనే ఇంత పరివర్తన ఏమిటి? నన్ను ఈ క్రొత్త ప్రదేశమునకు ఆ స్వామివారే తెచ్చారు. నేను ఏ మార్గములో వెళ్ళాలని నిర్ణయించారో తెలియదని నాలో నేను అనుకున్నాను. ఈవిధంగా అనుకుంటూ ముందుకు నడుస్తూ వెళ్ళాను. ఒక దగ్గర ఒక కొలను లేదా గుండము గురించి త్రవ్వి దాని చుట్టు అప్పుడే మట్టితో నిర్మించిన కట్ట కనబడ్డది. దాని ప్రక్క గుండా అలాగే ముందుకు వెళ్ళాను. తరువాత ఒక బావి కనబడ్డది. దాని గడ్డపైకి వెళ్ళాను. ఇలా అడవిలో తిరుగుచున్నాను. ఇంతలో ఎవ్వరో నన్ను ఇంటికి రా... మా ఊరికి రా... అని పిలిచారు. కాని నేను మాత్రం రాను, రాకూడదు, నా బాధ్యత వేరు, నేను అందరికీ బోధ చేయాలి. ఆ శ్రీవేంకటేశ్వరుని సేవ చేయాలి అని అనుచు అదే మార్గములో ముందుకు వెళ్ళాను. కల చెదిరింది.

ఈరోజు ఈ లీలలో తన నామమును, మహాత్మ్యాలను దేశమంతా ప్రచారము చేయవలెననే సంకల్పాన్ని ఇచ్చాడు. ఇది పత్రిక స్థాపించుటకు స్వామివారు చూపిన 3వ లీలగా భావించాను.

నా దిశ : మొదటిసారి రథయాత్రలో అమితమైన ఆనందం లభించింది. సురేఖను అనుగ్రహించాడు. గోవింద రామానుజ దాసు అనే దాస్యనామం లభించింది. భగవంతునికి, భక్తులకు కలిపి సేవ చేసుకునే అవకాశం ఇచ్చారు. స్వామి తత్త్వమును ప్రచారం చేయుటకు ఆజ్ఞ లభించింది.


భాగవత ఆశీర్వాదము : తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**గోవిందదాసు** (పుల్లగూర్ల సాయిరెడ్డి)
ఇ.నెం.1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్.
ఫోన్: 040-27175050. Visit: www.srivenkatesham.org

తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

## 22వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

# శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

**సంకల్పం**

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

**నిబంధనలు:**

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మానుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/– ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/–కి తక్కువ కాకుండా పంపండి). 9348212354 నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వారా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగిన రూ. 5/– స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

**గమనిక:**

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!

**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం**

ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సీగూడ, హైదరాబాద్ – 500007.
ఫోన్: 040- 27175050

ఈ కార్యక్రమం గురించి పూర్తి వివరాలకు సంప్రదించండి:
**93482 12354**



# జగన్మోహినీ కేశవస్వామి

– మందరపు వి.జి.శంకరాచారి

శ్రీమన్నారాయణుడు లోక కళ్యాణార్థం వివిధ అవతారాలు ధరించి ఈ ధరణిని ఉద్ధరిస్తూ తన భక్తులను రక్షిస్తూ ఉన్నాడు. శ్రీహరి ధరించిన అవతారములలో అత్యద్భుతమైనది జగన్మోహినీ అవతారం. ఈ మోహినీ అవతారాన్ని శ్రీమన్నారాయణుడు రెండు సందర్భాలలో ధరించాడు. అందులో మొదటిది క్షీరసాగర మథనం జరిపి అందులోనుండి ఉద్భవించిన అమృతాన్ని దేవతలకు పంచే సందర్భంలోను, రెండవది భస్మాసుర సంహార సమయంలోను.

అయితే క్షీరసాగర మథన సమయంలో ధరించిన జగన్మోహినీ అవతారం అందరినీ మోహపరవశులను చేస్తుంది. రాక్షసులు అతి సుందరమైన మోహినీ రూపాన్ని చూసి పరవశులై అత్యధిక మోహంతో ఆమెను అనుసరిస్తారు. అంతేగానీ అది విష్ణుమాయ యని, తమను తప్పు త్రోవలో నడిపించడానికి స్వయంగా నారాయణుడే ఆ రూపంలో దిగి వచ్చాడని గ్రహించలేకపోతారు. అమృతాన్ని దక్కించుకోవడంలో విఫలులౌతారు.

ఈ జగన్మోహిని సుందరరూపం అందరినీ మోహపరవశులను చేయడంలో వింత ఏమీ లేదు. కానీ సాక్షాత్తూ పరమశివుణ్ణే మోహింప చేసి తన వెనుకగా నడిపింపజేసుకుని భూలోకంలో ఒక ప్రదేశంలో జగన్మోహినీ కేవశస్వామిగా తన యొక్క రూపాన్ని చూపించి మాయను తొలగిస్తాడు. తదనంతర కాలంలో ఆ ప్రదేశంలో 5 అడుగల కేశవస్వామిగా, స్వయంభువుగా ఆవిర్భవించిన అద్భుత క్షేత్రమే ర్యాలి. పురాణంలో ఉటంకించిన ఆ ఇతిహాసం గురించి క్లుప్తంగా.

అమృతాన్ని గ్రోలాలన్న ఉద్దేశ్యంతో దేవతలు, రాక్షసులు కలిసి మందరగిరి పర్వతాన్ని క్షీరసాగరంలో నిలిపి వాసుకి సహాయంతో ఒకవైపు దేవతలు, మరొకవైపు రాక్షసులు కలిసి చిలకడం ప్రారంభిస్తారు.

అప్పుడు క్షీరసాగరం నుండి మొదటగా సురాభాండం (కల్లుకి ఆదిదేవత) పుడుతుంది. తరువాత రంభ, ఊర్వశి, మేనక, ఘృతాచి, తిలోత్తమ, సుకేశి, చిత్రలేఖ, మంజుఘోష పుడతారు. వారి తరువాత కౌస్తుభం (అమూల్యమైన మాణిక్యం) పుడుతుంది. దీని తర్వాత ఉచ్ఛైశ్రవం (ఏడు తలల దేవతాశ్వం, కోర్కెల తీర్చే కల్పవృక్షం, కామధేనువు పుడతాయి.

తదనంతరం ఐరావతం, లక్ష్మీదేవి, పారిజాత వృక్షం ఉద్భవిస్తాయి. వీటన్నింటి తర్వాత హాలాహలం ఉద్భవిస్తుంది. ఈ హాలాహలం లోకాలను భస్మం చేయబోతే దేవతలందరూ

పరమశివుడి దగ్గరకు వెళ్ళి మొరపెట్టుకోగా పరమేశ్వరుడు ఆ గరళాన్ని తన కంఠంలో నిలుపుకుని గరళకంఠుడిగా మారతాడు.

హాలాహలం తర్వాత వెంటనే అమృత భాండంతో ధన్వంతరి బయటకు వస్తాడు. అప్పుడు ఈ అమృతాన్ని దేవతలకు పూర్తిగా ఇచ్చేందుకు గాను, రాక్షసులు అమృతాన్ని గ్రోలకుండా తప్పించేందుకు గాను శ్రీమన్నారాయణుడు జగన్మోహినీ అవతారాన్ని ఎత్తి అందరినీ మోహింపచేస్తాడు.

అయితే అమృతాన్ని పంచడానికి వచ్చిన ఆ జగన్మోహిని అవతారాన్ని చూసిన రాక్షసులు మోహావేశాలకు గురవుతారు. ఆ మోహ పారవశ్యంలో వారు ఆమె చెప్పినట్లే నడుచుకుని అమృతాన్ని పొందడంలో విఫలమవుతారు.

జగన్మోహిని అవతారం చూసి త్రిలోక సంచారి అయిన నారద మహర్షి కూడా మోహానికి గురవుతాడు. అయినా ఇది విష్ణుమాయ యని గ్రహించగలుగుతాడు. క్షీరసాగర మథనంలో గరళాన్ని మింగి శివుడు, అమృతాన్ని దేవతలకు మాత్రమే పంచి నారాయణుడు లోకోద్ధరణ చేశారు. ఈ విషయాన్ని చెప్పాలని నారదుడు కైలాసానికి వెళ్తాడు.


అక్కడ పరమశివుడితో ''మహాదేవా! క్షీరసాగర మథనం జరిగింది. అందులోనుండి ఉద్భవించిన వాటిని ఒక్కరొక్కరుగా తమ కైవసం చేసుకున్నారు. హాలాహలాన్ని మింగి నీవు లోకోద్ధరణ చేయగా, శ్రీమన్నారాయణుడు మోహినీ రూపం దాల్చి అమృతాన్ని దేవతలకు మాత్రమే దక్కేటట్లుగా చేసి లోకోద్ధరణ చేశాడు. అయినా పరమశివా నేను ఒక్క విషయం చెప్పదలచుకున్నాను. శ్రీమన్నారాయణుడు జగన్మోహిని రూపంలో గొప్ప అందంగా ఉన్నాడు. ఆ మోహినీ అవతారాన్ని చూసిన వారెవరైనా ఆకర్షితులు కావలసిందే. ఇందులో సందేహమేమీ లేదు. అంతెందుకు, నన్ను కూడా ఆ రూపం మోహింప చేసింది తెలుసా'' అన్నాడు.

నారదుడు చెప్పిన విషయాన్ని విన్న శంకరుడు ''నారదా! ఆ జగన్మోహిని యొక్క రూపాన్ని చూసి, నీవుగానీ, లోకంలో ఇంకెవరైనా గాని మోహానికి గురవడం పెద్దగా చెప్పుకోదగ్గ విషయం కాదు. నాలాంటివాడు మోహానికి గురైతే అది ఒక విస్మయం, సంభ్రమం. జగత్పితనైన నేను ఆ జగన్మోహిని రూపాన్ని చూసి ఎట్టి పరిస్థితులలోను మోహానికి గురికాను. తెలిసిందా? అయినా సరే ఈసారి నేను విష్ణుమూర్తిని కలిసినప్పుడు ఆ జగన్మోహిని అవతారాన్ని చూపమని కోరుతాను. అప్పుడు నేను మోహానికి గురైతే నీవన్నట్లుగా జగన్మోహిని అవతారం అందరినీ మోహావేశాలకు గురి చేస్తుందని ఒప్పుకుంటాను'' అంటాడు.

తదనంతరం శివుడి దగ్గర సెలవు తీసుకుని నారద మహర్షి వెళ్ళిపోతాడు.

నారదుడు వెళ్ళిపోయిన తర్వాత శివుడి మనసులో త్రిలోక సంచారి నారదుడు చెప్పిన తర్వాత ఆ జగన్మోహిని సుందర రూపం చూడాలనే కోరిక పుడుతుంది.

ఒకనాడు శ్రీమన్నారాయణుడు, శివుడు కలుసుకున్న సందర్భంలో శివుడు నారాయణుడితో ''వైకుంఠవాసా! నీవు అమృతాన్ని దేవతలకివ్వడం కోసం, రాక్షసులను మోహంలో



పడవేసేందుకు గాను జగన్మోహినిగా రూపం దాల్చావట. ఆ రూపాన్ని చూసి అందరూ మోహానికి గురయ్యారని నారదుడు చెప్పాడు. ఏదీ నాకు ఒక్కసారి ఆ జగన్మోహినీ రూపాన్ని చూపించవా'' అని అడుగుతాడు.

వెంటనే అక్కడ విష్ణుస్వరూపం అదృశ్యమై జగన్మోహిని రూపం నిలుస్తుంది. ఆ రూపాన్ని చూడగానే పరమశివుడు తను నారాయణుడితో మాట్లాడానన్న విషయాన్ని మరచిపోతాడు. ఇంత సుందరమైన రూపాన్ని తనెక్కడా చూడలేదు. అటువంటి ఆ జగన్మోహిని తన కోరిక తీర్చడానికి వచ్చిందనుకొని ఆమెను అనుసరిస్తాడు.

జగన్మోహినిని శంకరుడు వెంబడించడం మొదలుపెడతాడు. ఆమెను తన ఆలిగా చేసుకోవాలని తాపత్రయపడుతూ ఈ విషయం ఆమెకు చెప్పాలని వెంట పడతాడు. జగన్మోహిని లోకాలు దాటి వెళ్ళిపోతూ ఉంటే ఆమె వెనుకనే శివుడు ఆత్రుతగా వెళుతూ ఉంటాడు.

చివరకు జగన్మోహిని భూలోకానికి చేరుకుంటుంది. అక్కడ ఒక ప్రదేశంలో ఆమె సిగనుండి ఒక పుష్పము రాలి పడుతుంది. సరిగ్గా అప్పుడే మోహపరవశుడైన శివుడు ఆమెను పట్టుకోవాలని, ఆమె భుజాలపై చేయివేసి తనవైపు తిప్పుకుంటాడు. అప్పుడు అతడికి శ్రీమన్నారాయణుడు శంఖ చక్ర గదాయుధాలతో దర్శనమిస్తాడు. వెనకవైపున అద్భుతమైన శరీర సౌష్ఠవంతో, మరులు గొలిపే సిగముడితో మోహినీరూపంగా కనబడతాడు. అప్పుడు పరమశివుణ్ణి కమ్మిన విష్ణుమాయ తొలగుతుంది. మహాదేవుడు సిగ్గుపడతాడు. నారదుడన్నట్లు ఈ జగన్మోహినీ రూపాన్ని చూసినవారెవరైనా మోహానికి గురవుతారన్నది సత్యమని మనసులో అనుకుంటాడు.

ఇది అనేక మన్వంతరాలకు పూర్వం జరిగిన వాస్తవ సంఘటన. ఇప్పుడు ఈ కలియుగంలో ఈ జగన్మోహినీ కేశవస్వామి యొక్క 5 అడుగుల ఎత్తు, 3 అడుగుల వెడల్పుతో స్వయంభువుగా సాలిగ్రామ విగ్రహం 11వ శతాబ్దంలో ఘంటి చోళ మహారాజుకి లభించిన వైనం.

ఈ ప్రాంతాన్ని ఘంటి చోళ మహారాజు పరిపాలన చేస్తూ ఉండేవాడు. ఒకనాడు ఇతడు వేటకని అడవికి వెళ్ళి అక్కడ ఓ ప్రదేశంలో మధ్యాహ్నపు సమయంలో ఓ చెట్టు క్రింద సేద తీరుతాడు. ఆ సమయంలో మహారాజుకి హరినామ సంకీర్తన అక్కడ జరుగుతున్నట్లుగా వినిపిస్తుంది. కనులు తెరచి చూసేసరికి ఆ ప్రాంతంలో ఎవరూ కానరారు. మరలా కనులు మూసుకునేసరికి మళ్ళీ హరినామ సంకీర్తన వినబడసాగింది. రాజుగారికి ఆ విధంగా వినబడేసరికి సంభ్రమాశ్చర్యాలకు లోనవుతాడు. ఆవిధంగా ఎందుకు తనకు వినిపిస్తోంది అని మనసులో తర్జన భర్జన పడతాడు.

అదే రాత్రి విష్ణుమూర్తి ఘంటి చోళ మహారాజుకి స్వప్నంలో సాక్షాత్కరించి ''చోళరాజా! నీవు మధ్యాహ్నపు వేళ చెట్టుక్రింద విశ్రమించుతున్నప్పుడు హరినామ సంకీర్తన నీ చెవిన బడినట్లుగా చేసింది నేనే. నీవు రేపటిరోజున మరలా నిన్న వెళ్ళిన అటవీప్రాంతం గుండా పయనించు. ఎక్కడ నీ రథం యొక్క శీల రాలిపడుతుందో అక్కడ ఆ స్థలంలో తవ్విన చోట జగన్మోహినీ కేశవరూపంగా 5 అడుగుల ఎత్తును, 3 అడుగుల వెడల్పును కలిగి యుండి స్వయంభువునై సాలిగ్రామ శిలగా లభిస్తాను. ఆ శిలను ప్రతిష్ఠాపన చేసి గుడిని నిర్మించు. తదనంతర కాలంలో ఈ గుడిని దర్శించిన ప్రతి భక్తుడికీ అండగా ఉంటాను. అద్భుతాలకు ఆలవాలమవుతాను'' అని చెబుతాడు.

ఘంటి చోళ మహారాజు స్వప్నంలో శ్రీమన్నారాయణుడు తనకు ఉపదేశించినట్లుగానే వెళ్ళి తన రథం యొక్క శీల ఎక్కడ పడిందో చూసి అక్కడ భూమిని తవ్వితే స్వామివారు జగన్మోహినీ కేశవస్వామి సాలిగ్రామ శిల లభ్యమవుతుంది. ముందుభాగం శంఖ చక్ర గదా సమేతుడై యున్న కేశవస్వామి గాను, వెనుకన సిగముడితో అద్భుత రమణీయంతో మోహినీ రూపంతోనూ ఉన్న సాలిగ్రామ శిలను తీసుకొని ఆగమ శాస్త్రం ప్రకారం ప్రతిష్ఠించి ఘంటి చోళ మహారాజు ఆలయం నిర్మిస్తాడు. అదే నేడు ఆంధ్రప్రదేశ్ లోని తూర్పు గోదావరి జిల్లాలో రాజమండ్రికి 40 కిలోమీటర్ల దూరంలో రావులపాలెంకి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న ''ర్యాలి''.

ఇక్కడ గర్భగుడి లోనికి వెళ్ళి, స్వామివారిని దర్శించుకోవచ్చు. స్వామివారు ముందుభాగం కేశవుడి గాను, వెనుకభాగం జగన్మోహినీ రూపాన్ని కలిగియుండి ఉండడం స్పష్టంగా కనిపిస్తుంది. అంతేకాదు విష్ణుపాదోద్భవం గంగ అన్నట్లు స్వామివారి పాదాల నుండి నిరంతరం గంగ వస్తూనే ఉంటుంది. ఆ గంగనే తీర్థంగా భక్తులకు ఇస్తారు. గర్భగుడి లోనికి వెళ్ళిన తరువాత పూజారి అర్చామూర్తి గురించి పూర్తిగా వివరిస్తాడు.

ఈ జగన్మోహినీ కేశవస్వామి సాలిగ్రామ విగ్రహం ఘంటి చోళ మహారాజు గారి యొక్క రథపు సీల రాలిపడిన చోట లభ్యమైనది కావున ఈ గ్రామమునకు ''ర్యాలీ'' అనే పేరు వచ్చింది. అంతేకాదు, జగన్మోహినీ అవతారంలో ఉన్నప్పుడు మోహ పరవశుడైన శివుడు ఆమెను వెనుకనుండి పట్టుకునే సమయాన జగన్మోహిని సిగ నుండి ఒక పుష్పం రాలి పడడం వలన కూడా ఈ గ్రామమునకు ''ర్యాలి'' అన్న పేరు వచ్చిందని చెబుతారు.

ఈ స్వామిని దర్శించుకుంటే జీవితంలో పురోగతితో పాటు ఎక్కడ తనకు ఆవాస యోగ్యమో అక్కడకు స్వామివారు ఆ భక్తుణ్ణి చేరవేస్తారని చెబుతారు. ఈ స్వామివారి దర్శనంతో జీవితంలో మార్పు జరిగి మరియొక ప్రాంతానికి చేరుకుంటారు. అది ఉద్యోగపరంగా పదోన్నతి కావచ్చు. లేక మరియొకటి కావచ్చు. ఇది నమ్మకం కాదు. జరుగుతున్న సత్యం.

ధారావాహికం



# మహాభారతంలోని మహోపాఖ్యానాలు

– డా॥ పులిగడ్డ విజయలక్ష్మి

గత సంచిక తరువాయి


## సక్తుప్రస్థుడు

సూతమహర్షి శ్రీకృష్ణుని స్తుతిస్తూ వేదిక వద్దకు వచ్చి ఆసనం అధిష్ఠించాడు. వెంటనే శౌనకాది ఋషిసత్తములందరూ లేచి ఆయనకు నమస్కరించి ఆసీనులైనారు. వారినందరినీ ఆశీర్వదించి సూతుడు అందరివైపూ వాత్సల్యపూర్వకంగా చూసి చెప్పటం ప్రారంభించాడు. మునులారా! ధర్మాచరణ అంటే ఎటువంటిది? ఏది అన్నిటికన్న మిన్నగా ఎన్నబడుతుంది? అనే విషయం గురించి ఈరోజు చెప్పుకుందాం. అందరూ శ్రద్ధగా వినండి. ధర్మరాజు అశ్వమేధయాగం చేశాడని మీకు తెలుసు కదా! పాండవాగ్రజుడు చేసిన రాజసూయ యాగం ఎంత గొప్పదో అశ్వమేధయాగం కూడా అంత గొప్పదే. ఆ యజ్ఞాంతంలో ధర్మజుడు వేద వేదాంగ నిపుణులైన బ్రాహ్మణోత్తములకు కోటానుకోట్ల ధనరాశులను దక్షిణగా ఇచ్చి వారినందరినీ సంతృప్తి పరిచాడు. భూమండలంలో ఉన్న ఋత్విక్కులు, పండితాగ్రేసరులు, సకలశాస్త్ర విదులు అయిన విప్రవరులందరూ మహదానంద భరితులు కాగా ఆ అశ్వమేధ యజ్ఞాన్ని, దానిని నిర్వహించిన ధర్మరాజును ప్రశంసిస్తూ, ఆ సార్వభౌముని మీద దేవతలు పుష్పవర్షాన్ని కురిపించారు. మానవులందరూ సంతోష సాగరంలో మునిగి తేలుతున్నారా అని అనిపించింది. ప్రేక్షకులందరికీ అద్భుతాన్ని కలిగిస్తున్న ఆ సమయంలో ఒక బిలం నుంచి ఒక ముంగిస బయటకు వచ్చి ఆ విప్రశ్రేష్ఠుల మధ్య నిలబడింది. వారి మధ్య నిలచిన ఆ ముంగిసను చూసి విప్రులందరూ ఆశ్చర్యపోయారు. శౌనకా! మరొక విశేషమేం జరిగిందంటే – వింటే మీరు విస్మయం చెందుతారు. సూతుని మాటలకు అందరూ నిజంగానే చకితులైనారు. ''విప్రవరులారా! నేనొక మాట చెబుతాను వినండి. సక్తుప్రస్థునలఘు ధర్మంబునేమియుఁ బోలదీ యశ్వమేధ'' మని ముంగిస అనేటప్పటికీ అంత వరకూ ధర్మరాజును, ఆతడొనర్చిన అశ్వమేధ యజ్ఞాన్ని మనస్ఫూర్తిగా, అమితంగా పొగుడుతున్న విప్రులందరూ ఆశ్చర్యపోయారు.

''ముంగిసా! ధర్మమూర్తి అయిన ధర్మరాజు చేసిన ఈ అశ్వమేధ యాగంలో మాకెక్కడా తక్కువతనం కనబడలేదు. మరో విషయం. నీవు మానవ భాషలో మాట్లాడుతున్నావు. నీకు సక్తుప్రస్థుని గురించి ఎలా తెలుసు? మేమాతని పేరైనా వినలేదు.

ఇంతకూ ఆ సక్తుప్రస్థుడెవరు? ఏ ధర్మకార్యం చేశాడు? దేనివల్ల మహిమాన్వితుడైనాడు? అదీ, ధర్మరాజు కన్నా గొప్పవాడా? ఈ యజ్ఞంలో మంత్రాలన్నీ వేదోక్తంగా చెప్పబడ్డాయే గానీ, ఎక్కడా, దేనిలోనూ అపశ్రుతి వినబడలేదే! కర్మకాండ అంతా సమగ్రంగా నిర్వహింపబడింది. ధర్మరాజు చేసిన సమస్త దానాలు దేవమునులందరికీ హర్షం కలిగించాయే కాని, అనుతాపాన్ని కలిగించలేదు. ఇక ఆ చక్రవర్తి యాగనిర్వహణలో కనబడిన ఆతని భక్తి శ్రద్ధలు, వినయం, అనురాగం, ఆసక్తి – సకల లోక వాసుల సంస్తుతులను చూఱగొన్నాయి. అది సరే. నీవు ఏ కారణం చేత ఈ అశ్వమేధ యజ్ఞం – సక్తుప్రస్థుడొనర్చిన ధర్మకార్యానికి సరిపోలదని అన్నావు? స్పష్టంగా చెప్పు. మేము కూడా అంగీకరించాలి కదా! అన్న విప్రవరులనందరినీ సాభిప్రాయంగా చూస్తూ ముంగిస సక్తుప్రస్థుని గురించి చెప్పసాగింది.

''బ్రాహ్మణోత్తములారా! ధర్మక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన కురుక్షేత్రంలో పూర్వం కామ క్రోధాది దుర్గుణ విరహితుడైన ఒక సద్బ్రాహ్మణుడుండేవాడు. పొలాలలో రాలిన గింజలు ఏరుకునే వృత్తితో జీవితాన్ని గడపటమే ఆతని ధ్యేయం. భార్య, కొడుకు, కోడలు అతని కుటుంబ సభ్యులు. తపస్సునే సంపదగా భావించి, నిత్యం దైవధ్యానం తనకు ఏడుగడగా తలపోస్తూ మనుగడ సాగిస్తుండగా కొంతకాలానికి అనావృష్టి ఏర్పడడంతో ముఖ్యమైన వరిపంట, గోధుమ పంట మున్నగునవి మాడి మసి కావటంతో ఆ పేదవాడికి తిండి లభించటం అసాధ్యమైంది. అప్పటికీ అతడూ, భార్యా, కొడుకూ, కొడుకు భార్య నలుగురూ కలిసి పొలాలుండే చోటుకు వెళ్ళి తృణధాన్యాన్ని (గడ్డినుంచి పుట్టేది), నివ్వరి ధాన్యం మొదలైన వాటిని ఏరి తెచ్చుకొనేవారు. ఆ కొంచెంగా మాత్రమే దొరికే ధాన్యంతో ఆ నలుగురికీ ఆకలి తీరేది కాదు. ఆ బ్రాహ్మణుడెవరనుకొన్నారు? ఆతడే సక్తుప్రస్థుడు. భుక్తికి కూడా నోచుకోనిది ఆతని దుస్థితి. అలా రోజులు జరుగుతుండగా ఒకనాడు ఆ నలుగురూ ప్రొద్దుటి నుంచి సాయంత్రం వరకు ఏరి, ఏరి తృణధాన్యాన్ని ఇంటికి తెచ్చారు. ఆ మొత్తం తృణధాన్యాన్ని పిండిగా కొట్టి, నాలుగు మానికల పిండిగా అయినందుకు వాళ్ళెంతగానో సంతోషించారు. ఒక్కొక్కరికి ఒక్కొక్క మానిక పిండి వస్తుంది కదా అన్న తృప్తితో ఆ మొత్తం పిండిని నాలుగు సమభాగాలుగా విభజించారు (మానిక = 2 తవ్వలు. 1 తవ్వ = 2 సోలలు. 4 సోలలు = ఒక మానిక). ఎవరి భాగానికి వచ్చే పిండిని వారు తీసుకొన్నారు. ఆ రోజు చేయవలసిన శాస్త్రోక్త విధులనన్నిటినీ సక్రమంగా నిర్వహించారు. ఇక తినడమే తరువాయి. ఆ బ్రాహ్మణుడికి ఆ పేరు ఎలా వచ్చిందో చెబుతాను వినండి. 'సక్తువు' అంటే పేలపిండి అని అర్థం. ప్రస్థము అంటే నాలుగు మానికల కొలతగల పాత్ర అని అర్థం. నాలుగు మానికల పేల పిండిని తయారు చేసుకొన్నందుకు (ఆతని కుటుంబీకులతో సహా) ఆ పేద విప్రునికి ''సక్తుప్రస్థుడ''నే పేరు స్థిరపడిపోయింది.



మునులారా! ఒక ముఖ్య విషయం. ''వాళ్ళు ఆనాడు కనీసం పేలపిండి నయినా తిని ఆకలి తీర్చుకుందామనుకుంటున్న తరుణంలో – విధి ప్రేరణో, మరేదో కాని, ఆ సమయంలో ఒక పెద్ద అవాంతరం ఏర్పడింది'' అని సూతమహర్షి అనగానే – ఒక ముని లేచి ''అదేమిటి మహాత్మా! అవాంతరం ఏమిటి? ఏ పక్షో, లేక ఏ జంతువో వచ్చి ఆ పిండిని తన్నుకుపోయిందా ఏమిటి? వాళ్ళకు పిండి తినే ప్రాప్తం కూడా లేకపోయిందా? ఏమిటి పాపం?'' అని ప్రశ్నిస్తూ తన బాధను వ్యక్తం చేశాడు. దానికి సూతుడు –

''అదేం కాదు నాయనా! ఇంతలో వారింటికి ఒక అతిథి వచ్చాడు. 'అతిథి దేవో భవ! కదా'' అతిథిని సత్కరించి, ఆతనిని సంతృప్తి పఱచి పంపడం గృహస్థు ధర్మం (విధి). మన ధర్మం ఎటువంటి సమస్యను తెచ్చిందో చూడండి.

**"అతిథి యొక్క ధరామరుం దరుగుఁదెంచె**
**గనిప్రియంబున వారెదుర్కొని సభక్తి**
**కముగ పర్ణశాలాభ్యంతరమున కతని**
**తోడ్కొనిపోయి యాసనస్థునిగఁ జేసి"**

**-222 ప – చతుర్థాశ్వాసము – అశ్వమేధ పర్వము – మహాభారతము**

వారి ఇంటికి మహానుభావుడైన ఒక బ్రాహ్మణోత్తముడు అతిథిగా వచ్చాడు. అతిథిని చూసీ చూడగానే సక్తుప్రస్థుని కుటుంబీకులు నలుగురూ గౌరవంతో, అభిమానంతో ఆతనికి ఎదురువెళ్ళి, నమస్కరించి, భక్తి ఉట్టిపడుతుండగా పర్ణశాల లోపలికి తీసుకొని వెళ్ళి ఆసనం మీద కూర్చుండబెట్టారు. అతిథిని ఏవిధంగా సత్కరించాలో ఆవిధంగా సత్కరించడానికి సిద్ధపడ్డారు. అతిథిగా వచ్చిన ఆ బ్రాహ్మణుని పాదపద్మాలు కడిగి భక్తితో


ఆ జలాన్ని నెత్తిన జల్లుకున్నాడు తపస్వి అయిన సక్తుప్రస్థుడు. నలుగురూ అతనిని కుశల ప్రశ్నలతో సంభావించారు. దానికా వచ్చిన అతిథి సంతోషపడ్డాడు. తరవాత ముని పుంగవుడిగా ప్రసిద్ధి చెందిన సక్తుప్రస్థుడు తన వంతుకు వచ్చిన ఆహారాన్ని అతిథికి చూపి వినయం ఉట్టిపడుతుండగా "మహానుభావా! ఈ పేలపిండి – పాపకార్యం చేసి సంపాదించినది కాదు. ధర్మబద్ధంగా సంపాదించినది. ఏ సంకోచం లేకుండా దీనిని తిని నీ ఆకలిని తీర్చుకో. ఎంతదూరం నుంచి కష్టపడి నడిచి వస్తున్నావో అని, తనకు లేకపోయినా ఏమాత్రం బాధపడకుండా అతనికి సమర్పించాడు. సక్తుప్రస్థుడి వినయానికి, ధర్మవర్తనకు సంతసించిన ఆ అతిథివర్యుడు గృహస్థు భాగానికి చెందిన పేలపిండిని తృప్తిగా భుజించాడు. కాని, అతని ఆకలి పూర్తిగా తీరలేదు. ఆ విషయాన్ని అతని ముఖభంగిమలో గమనించిన సక్తుప్రస్థుడు వేదన పొందాడు. "ఏమిస్తే ఈ మహర్షి తృప్తి చెందుతాడో, తనవద్ద మరి ఇంకే ఆహార పదార్థమూ లేదే. ఇప్పుడు నేనెక్కడ నుండి అతని ఆకలిని తీర్చే పదార్థాన్ని తేగలను?" అని బాధపడుతూ ఆందోళన పాలైన భర్త మనోభావాన్ని గ్రహించిన సక్తుప్రస్థుని ఇల్లాలు –

"నాథా!
"నా పాలి సక్తునిచ్చెద
నీపురుషునిఁ దృప్తి జేయుమీ! వనిన నతం
డా పొలతి దప్పియును సం
దీపిత జఠరాగ్నియై నతెఱఁగును గనుచున్"

**-225 ప – చతుర్థాశ్వాసము – అశ్వమేధ పర్వము – మహాభారతము**

మీకు ఆందోళన వద్దు. ఇప్పుడు ఏం మించిపోయిదని బాధపడుతున్నారు? నా వంతుకు వచ్చిన పేలపిండిని అతిథి దేవునికి సమర్పిస్తాను. దానితో ఆయన సంతృప్తి పడతాడు" అన్న త్యాగమూర్తి అయిన తన భార్యవైపు చూశాడు సక్తుప్రస్థుడు. ఆమె ముఖంలో కనిపిస్తున్న ఆయాసాన్ని, ఆకలిమంటను గమనించాడు. "సతీమణీ! చివరకు పక్షులు, జంతువులు కూడా కష్టపడి తాము సంపాదించిన ఆహార పదార్థాలను తాము తినకుండా తమ భార్యలకు పెడతాయే. అటువంటిది ఆకలితో పది రోజుల నుంచి మలమల మాడుతున్న నీకు, నీ పాలికి దక్కిన ఆ మానెడు పిండిని, నా గౌరవం కోసం ధారపోస్తావా? వద్దు. మరొకమాట! తన భార్య దేనివల్ల సంతోషిస్తుందో దానిని తెలుసుకుని తీర్చలేని అధముడు అప్రతిష్ఠపాలౌతాడు. అతడు ఇహలోకంలోనే కాక పరలోకంలో కూడా నరకబాధలు పడుతూ నానా హింసలకు గురవుతాడు. అందుచేత ఓ సాధ్వీమణీ! నీ వంతుకు వచ్చిన ఆహారాన్ని నాకు సమర్పించడం మంచిది కాదు. నేను స్వీకరించడం కూడా భావ్యం కాదు" అన్న సక్తుప్రస్థుని మాటలను, అతని భార్య మాటలను వింటూ ఏమీ అనకుండా అతిథిగా వచ్చిన బ్రాహ్మణోత్తముడు మౌనం వహించాడు. భర్త మాటలు విన్న భార్య వెంటనే మళ్ళీ తన మనోగతాన్ని వ్యక్తం చేసింది. "స్వామీ! నాదొక్క విన్నపం. ఆలకించండి. భార్యకు – భర్తే చుట్టం, స్నేహితుడు, తల్లీ, తండ్రీ, గురువూ, దైవం – అన్నీ పెనిమిటే గదా! కనుక భర్త యొక్క పని చేయటం భార్యకు ధర్మం. ఇది సనాతన సంప్రదాయమే కదా! అందుచేత అతిథిసేవలో మీతోపాటు పాలుపంచుకోవడం సతిగా నా ధర్మమే అవుతుంది. సద్గుణాల గురించి, సద్ధర్మం గురించి మీకు నేను చెప్పేపాటి దానినా? నీవా మహనీయుడవు. నీవాకలితో ఉంటుండగా, నా తిండి గురించి, నా వంతు గురించి ఆలోచించడం దోషమౌతుంది. నీవు తినకుండా నేను తినడం మహాపాపం. కనుక నిర్మల మనస్కుడైన ఈ ముని శ్రేష్ఠుడికి నా పాలిటి పేలపిండిని కూడా ఇచ్చి, మనిద్దరినీ దోషరహితుల్ని చేయి. నేను ఒక్కదానిని తినలేను నాథా! నా మాటను మన్నించండి" అని సక్తుప్రస్థుని భార్యామణి తనవంతు ఆహారాన్ని తన భర్తకిచ్చింది. భార్య వంతు పిండిని ప్రేమతో స్వీకరించిన సక్తుప్రస్థుడు – అతిథి దేవుని భక్తితో చూస్తూ –

"మహాత్మా! మీ ఆకలి తీరినట్లు లేదు. పేలపిండిని కూడా స్వీకరించి తృప్తి చెందండి. అది మా కోరిక. కాదనకండి" అని ఆతని చేతికిచ్చాడు రెండవ భాగమైన పేలపిండిని. అతిథి సత్తముడు నిరభ్యంతరంగా దానిని తిన్నాడు. అయినా అతడి ఆకలి తీరలేదు. అతని ముఖమంతా కడుపు నిండనట్లు దీనంగానే ఉంది. సక్తుప్రస్థుడికి అతడి వేదన అర్థమయింది. అతని మనసు కూడా బాధతో నిండిపోయింది. ఏం చేయాలో దిక్కు తోచలేదు. తానా నిరుపేద. ఎక్కడనుంచి అతనికి మంచి పదార్థాలను తెచ్చిపెట్టగలడు? అతిథిని సంతృప్తి పఱచకపోయిన గృహస్థు పాపపంకిలంలో కొట్టుకుపోతాడు గదా" అని సక్తుప్రస్థుడు బాధపడసాగాడు. తండ్రి పడుతున్న హృదయావేదనను అర్థం చేసుకున్న సక్తుప్రస్థుని కుమారుడు "తండ్రీ! నా భాగానికి వచ్చిన ఈ పేలపిండిని ఆ మహాత్ముడికిచ్చి, ఆతనిని తృప్తి పఱచు. ఎందుకంటావేమో! తండ్రి మనసులో చేయదలచుకొన్న పనిని పుత్రుడు ఆచరించటం పుత్రధర్మం. కనుక నా భాగం కూడా ఆతనికియ్యవలసిందిగా మిమ్మల్ని మనస్ఫూర్తిగా కోరుతున్నాను" అని అనడంతో సక్తుప్రస్థుడు పితృధర్మం ఏమిటో చెప్పసాగాడు. "కుమారా! పుత్రుడికి ఎంత వయసు వచ్చినా, ఎంత పెద్దవాడైనా తండ్రికి కొడుకు బాలుడే. బాలురకు ఆకలి ఎక్కువగా ఉంటుంది. కాబట్టి నీ భాగాన్ని ఆయనకివ్వటం చేయకూడని పని. అందుచేత పితృభక్తితో నీవిమ్మన్నా, నీ భాగాన్ని అతిథికి సమర్పించలేను" అన్న తండ్రి వాక్కులకు స్పందించిన గృహస్థు కుమారుడు పుత్ర పితృ సంబంధాన్ని వివరిస్తూ తన కోరికను పునరుద్ఘాటించాడు. తండ్రీ! ఆత్మావై పుత్రనామాసి" అన్న వేదవాక్యం చిరస్మరణీయమైనది గదా! నీవే నేనుగా జన్మించినప్పుడు –

నేను నీవే గదా! కాబట్టి నాకు వచ్చిన భాగం నీదనేదే కదా అర్థం. అందుచేత దయార్ద్ర హృదయుడవైన నీవు నా మాట మన్నించి ఈ పేలపిండిని మహాత్ముడైన ఆ అతిథి దేవునకు సమర్పించి నన్ను రక్షించు. ఈ విషయంలో ఇక తర్కం అవసరం లేదనుకొంటాను'' అన్న కుమారుని మాటలకు ప్రీతాత్ముడైన సక్తుప్రస్థుడు కుమారుని భాగమైన పేలపిండిని కూడా అతిథికి సమర్పించి – అతడు సంతోషాంతరంగుడౌతాడని భావించాడు. లభించిన పేలపిండిలోని మూడవ భాగాన్ని కూడా మహానుభావుడైన అతిథి ఆరగించాడు. కాని సంతృప్త్యాత్ముడు కాలేదు. అది గమనించిన సక్తుప్రస్థుడు మళ్ళీ హృదయ తాపానికి గురైనాడు. మామగారి ఆవేదనను అర్థం చేసుకొన్న కోడలు, తన భాగానికి వచ్చిన పేలపిండిని తెచ్చి ఆయన ముందు పెట్టింది. మామగారిని చూస్తూ ''ఈ పిండిని కూడా అతిథి దేవునికి సమర్పించి ఆయనను తృప్తి పఱచండి. మన విధిని మనము నెరవేర్చిన వారిమౌతాము'' అని కోడలు అనగానే సక్తుప్రస్థుడు మరింత బాధకు లోనైనాడు. ''తల్లీ! నీ శరీరమంతా శిథిలమైపోయింది. మనస్సా! వేదనతో కూడి ఉంది. నీవిచ్చిన పేలపిండిని తీసుకొని – నీవు అలసిన దానివై ఆయాసంతో బాధపడుతుంటే – ఎలా అతిథికి పెట్టగలను? దీనస్థితిలో ఉన్న నిన్ను చూసి ఎలా బ్రతకగలను? నా వల్ల కాదు తల్లీ!'' అని గాద్గద్యంతో పలికిన మామగారిని చూసి ఆ కోడలు తన అభిప్రాయాన్ని చెప్పసాగింది. ''మామా! నీవు నా గురువైన భర్తకు గురువువు. మీకు శుశ్రూష చేయటానికే గదా నా దేహంలో ప్రాణాలుండేది. ఈ విధంగా నా భాగాన్ని మీకు ఇవ్వటమే నా శీలానికి అనువైన కార్యము. కరుణతో నన్ను సమాదరించి, నా కోరికను తీర్చవలసిందిగా ప్రార్థిస్తున్నాను'' అన్న కోడలి ధర్మనిరతికి సంతసించి ఆ నాల్గవ భాగమైన పేలపిండిని అతిథికి సమర్పించి నమస్కరించాడు సక్తుప్రస్థుడు.

**"ఇచ్చినఁ బ్రీతిఁ బుచ్చుకొని యింపెసలార భుజించి తృప్తిమై**
**నచ్చుపడంగ, మెచ్చున ముఖాంబురుహం బలరంగ నిట్లనుం**
**బొచ్చెము లేక యయ్యతిథి 'భూరి గుణోత్తర! నిన్ను చూడగా**
**వచ్చితి! నేను ధర్ముఁడ! భవద్వ్రత శీలతఁ జూచి మెచ్చితిన్"**

**-238 ప – చతుర్థాశ్వాసము – అశ్వమేధ పర్వము – మహాభారతము**

''ఎప్పుడైతే సక్తుప్రస్థుడు నిష్కామంగా, క్రోధరహితుడై కుంచెడు (4 మానికల) పేలపిండిని అతిథికి సమర్పించాడో అప్పుడు అతిథిగా వచ్చిన ఆ బ్రాహ్మణోత్తముడు – నాల్గవభాగాన్ని కూడా ప్రీతితో స్వీకరించి, ఇష్టపూర్వకంగా భుజించాడు. అప్పుడాతని ముఖం తృప్తితో కాంతివంతమైంది. ఆతని కళ్ళల్లో మెచ్చుకోలు కనబడింది. ఎటువంటి కొరత అతని వర్తనలో కానరాలేదు. ఆ కుటుంబ సభ్యులందరు ధర్మపద్ధతిలో త్యాగనిరతిని చూపడంతో అతిథి దేవుడు – అంతవరకు ఏమీ మాట్లాడనివాడు – అప్పుడు గృహస్థుని చూసి తన అభిప్రాయాన్ని చెప్పసాగాడు. ''గొప్పవైన సద్గుణాలలో శ్రేష్ఠుడవైన సక్తుప్రస్థా! నీ ధర్మగుణాన్ని విని నిన్ను చూడటానికే వచ్చాను. నేను యమధర్మరాజుని. నీ సదాచార సంపత్తిని, స్వార్థ రాహిత్యాన్ని, త్యాగమహోన్నతిని, అన్నిటినీ మించిన అతిథిదేవుని సత్కరించిన విధానాన్ని చూశాను. నిన్ను మనస్ఫూర్తిగా మెచ్చుకొంటున్నాను. నా మనసులోని మాటను చెబుతాను విను.

**"భక్తియు, వినయము శ్రద్ధా**
**యుక్తియునుం, దార్మితోడి యొప్పును, గరుణా**
**సక్తియు, నతిథుల యెడ నను**
**రక్తియు, నీయంద సుస్థిరత్వముఁ బొందెన్"**

**-239 ప – చతుర్థాశ్వాసము – అశ్వమేధ పర్వము – మహాభారతము**

''నీలో కనిపించే సుగుణాలే నన్నాకర్షించాయి. నీలోని భక్తి, వినయం, శ్రద్ధ, సహనం, కరుణ మహోన్నతమైనవి. అంతేకాదు అతిథుల పట్ల నీకున్న గౌరవం అనిర్వచనీయం. అనురక్తి ప్రశంసనీయం. దానికి నిదర్శనం – నీవు నన్ను దైవంగా ఆరాధించడమే. అతిథిని సేవించడంలో నీవు ఉత్తమోత్తముడివి. ధర్మబద్ధంగా సంపాదించిన కుంచెడు పేలపిండిని

హృదయపూర్వకంగా దానం చేసినందుకు నేటినుండి నీకు 'సక్తుప్రస్థుడ'నే పేరు స్థిరపడిపోతుంది. దుశ్చింతతో ఒరులకు నష్టం కలిగించి ఆర్జించే వస్తువు గాని, ధనం గాని – దానం చేస్తే – ఆ దానం పుణ్యప్రదం కానేరదు. తపస్వీ! దేవతలు, యక్షులు, సిద్ధులు మొదలైనవారంతా నీవు చేసిన దానం చూసి ఆశ్చర్యపడి ఆకాశంలో గుంపులు గుంపులుగా చేరి ఎలా వర్ణిస్తున్నారో చూడు. నీమీద ఎంత ప్రేమ చూపిస్తున్నారో ఒక్కసారి తలెత్తి చూడు'' అని యమధర్మరాజు స్వర్గవాసులను చూపిస్తున్న సమయంలో మేఘుడు సక్తుప్రస్థుని పైన పుష్పవర్షాన్ని కురిపించాడు. దేవదుందుభులు అతి మనోహరంగా మ్రోగాయి. సక్తుప్రస్థా మరొక విశేషం.

**"నినుఁ జూచు వేడ్క యేద్వురు**
**మునుల మనంబుల సమగ్రముగ కదిరెడు; స**
**జ్జన కీర్తనీయ! దివికిం**
**జనుదెమ్ము ప్రియ సుత స్నుషా సహితముగన్"**

**-243 ప – చతుర్థాశ్వాసము – అశ్వమేధ పర్వము – మహాభారతము**

''సజ్జనులచేత కీర్తింపబడుచున్న సక్తుప్రస్థా! సప్తమహర్షుల ('కశ్యపోఽత్రి భరద్వాజ విశ్వామిత్రశ్చ గౌతమః వసిష్ఠో జమదగ్నిశ్చ సప్తైతే ఋషయస్తథా) మనస్సులు నిన్ను చూడాలని తహ తహ లాడుతున్నాయి. వారి వేడుక తీరేటట్లుగా నీ భార్యతో, కుమారుడితో, కోడలితో కలిసి స్వర్గ లోకానికి రావయ్యా! వారంతా నిన్ను చూడాలని అనుకోవటానికి ఒక పెద్ద కారణం ఉంది. ఎవరూ పొందలేని కార్యసిద్ధిని నీవు పొందావు. అదేమంటే – ఆకలి తెలివిని, శుభవర్తనను హరించి వేస్తుంది. ఇక తృష్ణ అంటావా, దయనే కబళించి వేస్తుంది. మానవులు 'నా భార్యా, నా బిడ్డలు' అని తపించిపోతుంటారు. స్వార్థాన్ని వదలి పరహితం చూడనే చూడరు. అటువంటిది, ఆకలిని, తృష్ణను (పేరాశను) జయించిన మహానుభావుడవు నీవు. భార్యాబిడ్డల స్థితిగతుల గురించి పట్టించుకోకుండా – అతిథిని దేవుడుగా భావించి పూజించావు. ఆ పుణ్యం ఊరికేపోతుందా? నిన్ను మహాత్ముణ్ణి చేసింది.

**"తగు ప్రియమున సకుటుంబం**
**బుగ తన సభకీవు రాక బుద్ధింగని బ్ర**
**హ్మ గడున్ వేడ్క విమానం**
**బు, గురువ్రత శీల; శీఘ్రమునఁ బుత్తెంచున్"**

**-245 ప – చతుర్థాశ్వాసము – అశ్వమేధ పర్వము – మహాభారతము**

''సక్తుప్రస్థా! నీకు తెలియని! నీవు కనీసం ఊహించనైనా ఊహించని ఒక విషయం చెబుతాను విను. ఉత్తమ వ్రత నిర్వహణనే శీలంగా కలిగిన నిన్ను చూశాడు బ్రహ్మదేవుడు. కుటుంబ సమేతంగా తన సభకు వస్తున్న నీ రాకను తెలుసుకొన్న బ్రహ్మదేవుడు ఇష్టపూర్వకంగా మణిమయమైన విమానాన్ని నీకోసం త్వరగా పంపిస్తాడు సుమా! నీమీద సృష్టికర్తకు కలిగిన కరుణ అంత గొప్పది. నీపై ఆయనకు ఏర్పడిన ప్రేమ అపారం.

విప్రోత్తమా! నీ భక్తి, త్యాగాలు మహత్తరమైనవి.

**"వినుము ప్రభూతదానములు, విరళత యజ్ఞములున్ సధర్మతా**
**వినుతికి నెక్కజాలవు; వివేకనిధీ! పరిశుద్ధ శోభితా**
**ర్జనమునఁ దెచ్చికొన్నది వరంబగు పాత్రము నర్హకాలముం**
**గని లఘువస్తువేని నొసగం గనుటుజ్జ్వల ధర్మమారయన్"**

**-246 ప – చతుర్థాశ్వాసము – అశ్వమేధ పర్వము – మహాభారతము**

''వివేకనిధియైన సక్తుప్రస్థా! గొప్పవైన దానాలు, ప్రశస్తికెక్కిన యజ్ఞాలు ఉత్తమ ధర్మయుక్తమైనవన్న ప్రఖ్యాతికి సరిపోవు. పవిత్ర వర్తనతో, దుష్టరాహిత్యమైన ధర్మనిరతితో ఆర్జించిన ధనం గాని, ఏ ఇతర వస్తువు గాని, పదార్థం గాని శ్రేష్ఠమైనదిగా పరిగణింపబడుతుంది. సరైన సమయంలో వచ్చినవాడు అర్హుడైన వాడైతే – అతనిలోని పాత్రతను గమనించి తన వద్ద ఉన్న వస్తువు చిన్నదైనా (తక్కువదైనా సరే) దానం చేస్తే – అది వినుతికెక్కే ఉజ్జ్వల ధర్మంగా చెప్పబడుతుంది'' అని ధర్మదేవుడు పలుకుతూ దివ్యమైన తన రూపాన్ని ధరించి సక్తుప్రస్థుని అలరింప చేశాడు. దక్షిణ దిశాధిపతి అయిన యమధర్మరాజును చూడగానే అక్కడి మునులందరూ భక్తిపారవశ్యంతో ఆ దేవతారూపునే చూస్తూ నిలబడిపోయారు. ఇంతలో వారి దృష్టికి మణులతో నిర్మితమైన బంగారు విమానం ఆకాశంలో నుండి వస్తుండటాన్ని ఆకర్షించింది. దేదీప్యమానమైన ఆ విమానము యొక్క కాంతులకు వారందరూ ఆశ్చర్యపడ్డారు. క్షణంలో తేరుకొన్న సక్తుప్రస్థుడు, ఆతని భార్యా, సుతుడు, కోడలు యమధర్మరాజుకు సాష్టాంగ ప్రణామం చేసి వినయం ఉట్టిపడుతుండగా నిలబడ్డాడు. ధర్మప్రవర్తకుడైన సక్తుప్రస్థుని చూస్తూ ధర్మదేవుడైన యమధర్మరాజు 'ధర్మమార్గానుసారీ! భూమి మీదకు దిగిన ఆ విమానం బ్రహ్మదేవుడు నీ రాక కోసం పంపిన బంగారు విమానం. నీవూ, నీ భార్యా, కొడుకూ, కోడలూ – నలుగురూ సంతోషంగా విమానమెక్కి బ్రహ్మదేవుడి సభకు వెళ్ళండి. సృష్టికర్త మీ రాక కోసం ఎదురు చూస్తున్నాడు'' అని చెప్పడంతో ఆ నలుగురూ యమధర్మరాజుకు మరొకసారి నమస్కరించి దివ్య విమానం అధిరోహించారు. యముని అనుమతితో విమానం కదిలి గగనంలోకి దూసుకు వెళ్ళిపోయింది'' అని సక్తుప్రస్థుని ధర్మగుణాన్ని వివరంగా తెలియజెప్పింది ముంగిస. విప్రవరులు, పండితోత్తములు, ఋత్విక్కులు – అందరూ ముంగిస చెప్పిన కథ విని ''నిజం నిజం'' అంటూ తలలూపారు. వారిని చూసి ముంగిస మళ్ళీ చెప్పసాగింది. ''మహాత్ములారా! మరొక ముఖ్య విషయం. బిలంలో నుండి ఇదంతా చూస్తున్న నేను యమధర్మరాజు అంతర్హితుడు కాగానే మెల్లగా బిలంలో నుండి

బయటకు వచ్చాను. అప్పుడేం జరిగిందో తెలుసా! ఆ పేలపిండి సువాసన తగలడంతో, కొద్దిగా జరిగిన నాకు అతిథి దేవుని పాదపద్మాలను కడిగిన నీటితడి నా శరీరానికి అంటుకొన్నది. సక్తుప్రస్థుడు చేసిన ధర్మకార్య మహిమ వలన నా శిరస్సంతా బంగారుమయమైంది. అంతేకాదు నా శరీరంలోని ఒకవైపు మొత్తం బంగారంతో మెరిసిపోయింది. దానితో నాకెంతో ఆశ్చర్యం కలిగింది. సక్తుప్రస్థుడు చేసిన అతిథి పూజ ఇంత మహత్తును వెలయిస్తుందా? అని అనుకొన్నాను. మిగిలిన నా శరీర సగభాగాన్ని కూడా బంగారుమయం చేసుకుందామన్న ఆలోచన అనుక్షణం నన్ను పరుగులు పెట్టించింది. ఆరోజు నుంచి నేను తిరగని, చూడని యాగవైభవం లేదనుకోండి. దానాలిస్తున్నారన్న పవిత్ర స్థలాలకు, పుణ్యప్రదేశాలయిన ఆశ్రమ భూములకు, వివిధ యజ్ఞాలకు స్థానమైన అనేకానేక ధర్మనిలయాలకు – ఒక్కటి కూడా విడువకుండా వెళ్ళేదానిని. రెండోవైపు కూడా బంగారుమయం కావాలన్న కోరికతో ఎన్ని చోట్లకు పోయినా, యజ్ఞదాన స్థలాలలో ఎన్నిసార్లు పొర్లాడినా, ఆయా పవిత్ర జలాల వల్ల నా కోరిక తీరలేదు. సగం శరీరం పూర్వం లాగే ఉండిపోయింది. లోకోత్తర చరిత్రుడు, అజాత శత్రుడు అయిన ధర్మరాజు – అశ్వమేధ యాగం చేస్తున్నాడని విని కొండంత ఆశతో ఇక్కడికొచ్చాను. కాని ధర్మజుని దానజలాల స్పర్శలో ఏ మహిమా కానరాలేదు. నాకు బంగారమూ అంటలేదు. అందుచేత – పొలాలలో రాలిపడిన గింజలను, గడ్డినుండి వచ్చిపడే గింజలను ధర్మబద్ధంగా ఏరుకొని, వాటిని పక్వం చేసి తినడమే వృత్తిగా కలిగిన ఆ బ్రాహ్మణుని ధర్మ కార్య నిరతికి – ఈ యజ్ఞం సాటిరాదు' అని అన్నాను'' అని చెప్పిన ముంగిస మాటలకు 'దోషమున్నద'ని అనలేక విప్రవరులు, ఋత్విక్కులు, మహర్షులు ముంగిసనీ – ఇంకా ఏం చెబుతుందో అని చూస్తుండగా ఎటో వెళ్ళిపోయింది క్షణంలో. ముంగిస ఎక్కడికి వెళ్ళిందో ఎవరికీ తెలియరాలేదు'' అని చెప్పి సూతమహర్షి కొద్దిసేపు ఆగాడు. ఆ తరువాత శౌనకముని లేచి –

''మహాత్మా! అయితే ఆ ముంగిస చెప్పినది సత్యమే అంటారా! అజాత శత్రువు అయిన ధర్మరాజు చేసిన యజ్ఞం ప్రశంసకు తగదంటారా? ఈ సందర్భంలో తపోసంపన్నుడయిన వ్యాస శిష్యుడైన వైశంపాయనుడు ఏవిధంగా ధర్మనిర్ణయం చేసి చెప్పాడో మాకు తెలియజెప్పండి'' అని అడిగిన శౌనకుని ప్రశ్నలకు సంతోషాన్ని వెలిబుచ్చుతూ సూతమహర్షి చెప్పసాగాడు.

''మునులారా! ఒకప్పుడు దేవేంద్రుడు యజ్ఞం చేయటానికి పూనుకొన్నాడు. దానికి దేవతలు, దేవమునులు అందరూ కలిసి యజ్ఞానికి కావలసిన సకల సామగ్రీ సమకూర్చారు. ఇక తీసుకురావలసిన వాటిలో మిగిలింది ఒక్కటే. యజ్ఞంలో హోమం చేయటానికి జంతువు కావాలి. కొందరు వెళ్ళి జంతువులను తెచ్చారు. ఆ జంతువులకు విషయం అర్థమైంది. కళ్ళ వెంబడి అశ్రువులు జాలువారాయి వాటికి. అది చూసిన ఋషులకు ఎంతో జాలి కలిగింది. దేవేంద్రుడితో ''దేవరాజా! హింస ధర్మం కాదు. ఇప్పుడు నడుస్తున్నది కృతయుగం. ఎన్నో విత్తనాలు నిలువ ఉన్నవి సిద్ధంగా ఉన్నాయి. కనుక మూడు సంవత్సరాల నుంచి నిలువ ఉన్న విత్తనాలను యజ్ఞద్రవ్యాలుగా ఉపయోగించి హోమం చేయి. అలాచేస్తే పశుహింస ఉండదు గదా! నీ కరుణా ప్రవృత్తి వెల్లడవుతుంది'' అని రకరకాలుగా చెప్పిన ఋషుల మాటలు ఇంద్రుడి చెవికెక్కలేదు. ఇంద్రుడూ, ఋషులూ ఉపరిచర వసువును తీర్పు చెప్పమని కోరారు. ఆ మహారాజు 'ఇంద్రుడిదే కర్తవ్యం. ఋషులు చెప్పింది కాదు. యజ్ఞంలో జంతుహింస చేయదగినదే అని అనిన క్షణంలో ఉపరిచర వసువు స్వర్గం నుంచి అధఃపతనం చెంది, భూలోకంలో పడిపోయాడు. అందుచేత హింసారహితమైన యజ్ఞం పూజింపదగినది. అగస్త్య మహర్షి కూడా విత్తనాలతో యజ్ఞం చేసి ఇంద్రాది దేవతల మన్ననలు పొందారు. ఆ కారణం చేతనే ముంగిస ''హింసాత్మకంబైన పశుయజ్ఞంబు కంటె నహింసా మహితంబైన తపోయజ్ఞంబధికంబ''ని చెప్పింది.

ధర్మరాజు చేసింది – అశ్వమేధ యాగం (పశుహింసతో కూడినది)

సక్తుప్రస్థుడిది తపోయజ్ఞం (ఆతడు కేవలం ధాన్యాలనే ఆహారానికి ఉపయోగిస్తూ, ఏ జంతుహింసా చేయకుండా తపోనిష్ఠలో మునిగినవాడు). అదీగాక సక్తుప్రస్థుడిచ్చిన దానజలాల వల్ల ముంగిస – శిరస్సు, అర్ధ శరీరం బంగారుమయం కావటం; ధర్మజుని దాన జలాల వల్ల తక్కిన శరీరం సువర్ణమయం కాకపోవటం వల్ల ముంగిస మాటలను త్రోసి పుచ్చకూడదు.

**"ఉంఛవృత్తియైన యుర్వీసురోత్తముం**
**డట్లు ప్రాణ రక్షకై ఘటించి**
**స్వజనములును దాను భుజియింపనుండి, యా**
**సక్తు నతిథికిచ్చెఁ జనదె పొగడ"**

**-259 ప – చతుర్థాశ్వాసము – అశ్వమేధ పర్వము – మహాభారతము**

''ఉంఛవృత్తిని (పొలాలలో క్రింద రాలిన గింజలను ఏరుకొని తినటమనే వృత్తి) వృత్తిగా కలిగిన సక్తుప్రస్థుడు, తానూ, తనవారూ భుజించడానికి సిద్ధంగా పెట్టుకొన్న పేలపిండిని, తామెవరూ తినకుండా, అతిథికి సమర్పించడం ఉత్తమోత్తమ ధర్మం కదా! అందుకే ముంగిస అతనిని అంతగా పొగిడింది. నిజంగా సక్తుప్రస్థుడు పొగడ్తకు అర్హుడే. అందుకే బ్రహ్మలోక వాసి అయినాడు'' అని సూతమహర్షి వైశంపాయనుని వాక్కులను తెలియజెప్పాడు. శ్రద్ధాళువులైన మునులందరూ సక్తుప్రస్థుని పొగుడుతూ హర్షధ్వానాలు చేశారు. సూతమహర్షి వేదిక దిగగానే మునులు ఆయన వెంట నడుస్తూ ఆశ్రమాలకు చేరుకొన్నారు.

**(సశేషం)**

# గంజాయివనంలో తులసిమొక్క త్రిజట

- గోనుగుంట మురళీకృష్ణ



ప్రతిఫలాపేక్ష లేకుండా సత్కార్యాలు చేసేవారు ఏ జాతిలో జన్మించినా గౌరవనీయులుగానే పరిగణింపబడతారు. రాక్షసజాతిలో జన్మించినా నిర్మల హృదయం ఉన్న స్త్రీ త్రిజట. ఈమె రామాయణంలో రెండు సందర్భాలలో కనిపిస్తుంది. రామాయణం తెలుగు అనువాదాలలో 'సీతకు కాపలాగా ఉంచిన రాక్షస స్త్రీలలో ఒక వృద్ధరాక్షసి త్రిజట' అని రాశారు. కానీ వాల్మీకి రామాయణం, సుందరకాండ, 27 వ సర్గ 4 వ శ్లోకంలో త్రిజట విభీషణుడి కుమార్తె అని వాల్మీకి మహర్షి స్పష్టంగా చెప్పాడు. ఆమె జ్ఞాన వృద్ధురాలు అని చెబుతాడు గానీ, వయసులో వృద్ధురాలు అని చెప్పలేదు. విభీషణుడి కుమార్తె కాబట్టి ఆమెకి కూడా తండ్రిలాగే నిర్మలమైన హృదయం, సద్గుణాలు అలవడ్డాయి. ఆమె గురించి ఇప్పుడు ఒకసారి గుర్తు చేసుకుందాం.

రావణుడు అశోకవనంలో ఉన్న సీత దగ్గరకు వచ్చి తనను అంగీకరించమని రకరకాలుగా చెప్పి ఆమె అంగీకరించనందున చివరికి "సీతా! నీకు పన్నెండు మాసాల గడువు ఇచ్చాను. అందులో పది మాసాలు గడచిపోయాయి. ఇంకొక రెండు మాసాలు మాత్రమే ఉన్నాయి. ఈ లోపు నన్ను భర్తగా అంగీకరించకపోతే నా ప్రాతఃకాల భోజనంగా నిన్ను ముక్కలు ముక్కలుగా చేస్తారు. ఆలోచించుకో!" అని కావలి ఉన్న రాక్షసస్త్రీల వంక చూసి "మీరందరూ మంచి మాటలతో గానీ, భయపెట్టి గానీ, సామదాన దండోపాయాలతో ఈమె నాకు వశమయ్యేటట్లు చూడండి" అని ఆజ్ఞాపించి వెళ్ళిపోయాడు.

ఆ రాక్షస స్త్రీలలో ఒకే కన్ను, ఒకే చెవి గలది, తలచుట్టూ చెవులు గలది, ఏనుగు చెవులు గలది, ఆవు పాదాల వంటి పాదాలు గలది, వేలాడే పెద్దపొట్ట గలది, ముక్కు లేనిది, పంది ముఖము కలది ఇలా రకరకాల భయంకరమైన ఆకారాలు కలవారు ఉన్నారు.

రావణుడు వెళ్ళగానే వికట అనే పేరుగల రాక్షసి "రావణుడు, మహావీరుడు, మహాబలశాలి. అటువంటి వాడిని నువ్వు తిరస్కరిస్తున్నావు. నువ్వు చూడబోతే బుద్ధిహీనురాలిలాగా ఉన్నావే!" అన్నది.

ప్రఘన అనే రాక్షసి "రావణుడు నిన్ను మండోదరి కన్నా మిన్నగా చూసుకుంటానని చెబుతున్నాడు. ఈ అపూర్వమైన అవకాశాన్ని ఎవరైనా వదులుకుంటారా!" అన్నది.

"రావణుడు దేవతలను, గంధర్వులను, నాగులను ఎన్నోసార్లు ఓడించాడు. అటువంటి వాడు నీకోసం ఉబలాటపడుతున్నాడు. అతడి భార్యగా ఉండకపోవటానికి నీకు అభ్యంతరం ఏమిటి?" అన్నది ఏకజట.

"నువ్వు రాముడి కోసం ఎదురు చూస్తున్నావేమో! రాముడు మానవుడు, రాజ్యం కోల్పోయినవాడు, అతడి కన్నా రావణుడే గొప్పవాడు. రావణుడికి భార్యవై సుఖంగా ఉండు. నీ మేలు కోరి చెబుతున్నాం" అన్నది ఇంకో రాక్షసి.

ఆ మాటలు విని సీత "అమ్మలారా! రాముడు మానవుడే కావచ్చు. రాజ్యం లేకపోవచ్చు. నేను బ్రతికినంతకాలం రామపత్నిగానే ఉంటాను. అరుంధతి వసిష్ఠుని, లోపాముద్ర అగస్త్యుని అనుసరించినట్లు నేను రాముడినే అనుసరిస్తాను" అన్నది.

"ఈ సీత మన మంచిమాటలు వినటం లేదు. దీన్ని చంపి తినివేద్దాం రండే!" అంటూ అందరూ ఆయుధాలు చూపిస్తూ, నాలుకతో పెదవులను నాక్కుంటూ సీత చుట్టూ నాట్యం చేస్తూ గుండ్రంగా తిరగసాగారు. వీళ్ళందరి గడబిడలకు అప్పటివరకు నిద్రపోతున్న త్రిజట అనే రాక్షస స్త్రీ కళ్ళు తెరిచి చూసింది. వెంటనే

లేచి "ఆగండి... ఆగండి" అని చెబుతూ గభాలున వచ్చి చేతులతో వాళ్ళని అటూ ఇటూ నెట్టి వేసింది.


"నాకొక కల వచ్చింది. అతి భయంకరమైనది, శ్రీరాముడి జయాన్ని, రాక్షసులందరి వినాశానాన్ని సూచించేది" అన్నది.

ఆ రాక్షస స్త్రీ లందరూ భయపడి పోయి, సీత చుట్టూ నృత్యం చేయటం ఆపి, "త్రిజటా! నీకు వచ్చిన కల ఏమిటో వివరంగా చెప్పు" అన్నారు.

"వెయ్యి హంసలు పూన్చిన ఒక దివ్యమైన పల్లకీ ఆకాశంలో ఎగురుతూ ఉండటం చూశాను. అందులో రామలక్ష్మణులు తెల్లటి వస్త్రాలు ధరించి కూర్చుని ఉన్నారు. తర్వాత తెల్లటి పూలమాలలు, తెల్లటి వస్త్రాలు ధరించి వారిద్దరూ ఒక మహాగజం పైన ఎక్కి సీతను తీసుకువెళ్ళటానికి వచ్చారట. పెద్దపర్వతం పైన నిలబడి ఉన్న జానకి ఆ ఏనుగు ఎక్కి రాముడి పక్కన ఆశీనురాలైఉంది. వారందరూ ఎక్కిన ఏనుగు లంకానగరం పైభాగాన నిలిచింది.

మళ్ళీ అంతలోనే పుష్పక విమానంలో సీతారాములు, లక్ష్మణుడు కలసి ఉత్తర దిశగా వెళ్ళినట్లు చూశాను. సీత జనకరాజ పుత్రి. దశరథుని కోడలు. పాపాత్ముడికి మోక్షంలాగా ఈమె రావణుడికి ఎన్నడూ లభించదు. ఆమెను బాధ పెట్టకండి.

రావణుడు ఒంటి నిండా నూనె పూసుకుని, మెడలో గన్నేరుదండలు వేసుకుని నేలమీద పడి ఉన్నట్లు కలలో చూశాను. అతడు పుష్పక విమానం నుంచీ కిందకు పడిపోయాడట. అతడు



నూనె తాగుతూ, నవ్వుతూ పిచ్చివాడిలా నాట్యం చేస్తూ ఉన్నాడు. నల్లటి శరీరం గల ఒక స్త్రీ శరీరం నిండా బురద పూసుకుని రావణుడి మెడకు తాడుకట్టి దక్షిణ దిక్కుకు లాగుకుని పోతూ ఉంది. కుంభకర్ణుడు కూడా ఇలాగే నోటికి వచ్చినట్లు పేలుతూ దిగంబరుడై, దుర్గంధ భూయిష్టమైన కూపంలో పడి ఉన్నాడు. రావణుడు పంది మీద, ఇంద్రజిత్తు మొసలి మీద, కుంభకర్ణుడు ఒంటె మీద దక్షిణం వైపుగా వెళ్ళుతున్నట్లు కలలో కనిపించింది.

విభీషణుడు మాత్రం స్వచ్ఛమైన గంధం, పైపూతలతో తెల్లటి మాలలు ధరించినట్లు చూశాను. నాలుగు దంతాలు గల దివ్యగజం ఎక్కి నలుగురు మంత్రులతో ఆకాశం మీద ఉన్నాడు. శంఖ ధ్వనులతో, దేవతలు చేసే నృత్యాలతో, గీతాలతో ఆనందిస్తూ ఉన్నాడు విభీషణుడు.

రాక్షసులందరూ మద్యపానం చేస్తున్నారు. లంకలో గోపురాలు, భవనాలు ఛిన్నాభిన్నం అయిఉన్నాయి. అవన్నీ సముద్రంలో పడిపోతున్నాయి. ఏ స్త్రీ అయినా దుఃఖంతో ఉన్నప్పుడు ఇలాంటి కల వస్తే ఆమెకి దుఃఖం అంతరించి తన భర్తను చేరగలదు అని పండితులు చెబుతారు. శ్రీరాముడికి సీత ప్రాణంతో సమానం. ఆమెని తిట్టినవారిని, బాధ పెట్టినవారిని అతడు సహించడు. తప్పకుండా వారిని చంపివేస్తాడు.

కాబట్టి సీతను క్రూర వచనాలతో బాధ పెట్టటం ఆపండి. రాముడి కోపాగ్నికి గురి కాకుండా జీవించి ఉండాలంటే ఈమెను శరణువేడండి. మంచి మాటలతో ప్రసన్నురాలిని చేసుకోండి. ఈమె ఉత్తమురాలు, దయామయి. మృత్యుపాశాల వంటి శ్రీరాముడి బాణాలకు ఆహుతి కాకుండా ఈమె ఒక్కతే మిమ్మల్ని రక్షించగలదు." అన్నది త్రిజట.

"అంతేకాదు, అటు చూడండి. సీతాదేవి పద్మం వంటి విశాలమైన ఎడమ కన్ను అదురుతూ ఉంది. ఎడమభుజం స్వల్పంగా కంపిస్తూఉంది. ఒక పక్షి చెట్టు కొమ్మమీద కూర్చుని మధురంగా కూస్తూ ఉన్నది. ఇవి అన్నీ శుభసూచకాలు. దీనిని బట్టి త్వరలోనే సీత శ్రీరాముడి సన్నిధికి చేరుకుంటుంది అని నాకు అనిపిస్తూ ఉంది" అని చెప్పింది.

త్రిజట చెప్పిన మాటలు అన్నీ విన్న రాక్షసస్త్రీలు భయంతో వణికి పోయారు. ఆయుధాలు కింద పడేసి, చేతులు మోడ్చి, సీతవంక భయంభయంగా చూశారు.

ఇవన్నీ వింటున్న సీత "త్రిజట చెప్పిన స్వప్న వృత్తాంతం అంతా నిజమైతే నేను మీకు అభయం ఇస్తున్నాను" అన్నది.

స్వప్నంలో ప్రేక్షకురాలు మాత్రమే అయిన త్రిజట, చెప్పే సమయంలో ఎంత నేర్పుగా విశ్లేషించిందో చూడండి. ఇది ఆమె విశాల హృదయాన్ని సూచిస్తుంది. జట అంటే వేదాన్ని వల్లె వేసే ఒకానొక పద్ధతి. మూడు దృశ్యాలుగా వచ్చిన కలని (రాముడు, రావణుడు, విభీషణుడు కనబడిన తీరు) ఒకే జటలాగా అల్లింది కనుక ఆమెకి త్రిజట అనే పేరు సార్థకమైంది. త్రిజట ఇంకో

సందర్భంలో కూడా సీతకు ఓదార్పునిస్తుంది. అదేమిటంటే ---

ఇంద్రజిత్తు మాయావి. కంటికి కనబడకుండా కపటయుద్ధం చేయటంలోనేర్పరి. యుద్ధభూమిలోతన ఉనికిని తెలుసుకోవాలని ప్రయత్నిస్తున్న వానరుల కన్నుగప్పి మేఘాల చాటుకు వెళ్ళాడు. వారికంటే వేగంగా పోగల అనేక బాణాలను వానరుల మీద ప్రయోగించాడు. మేఘాలతో కప్పబడిన సూర్యుడిలాగ ఇంద్రజిత్తు జాడ ఎవరూ కనిపెట్టలేకపోయారు. శత్రువుల శరీరాలను ఛేదించగల బాణాలను అనేకం రామలక్ష్మణుల మీద ప్రయోగించాడు.

"రామలక్ష్మణులారా! అదృశ్యరూపంలో ఉన్న నన్ను దేవేంద్రుడు కూడా చూడలేడు. మానవులైన మీరెంత? మిమ్మల్ని ఇప్పుడే యమసదనానికి పంపిస్తాను చూడండి" అంటూ నాగపాశాలు అనే బాణాలు వేసి రామలక్ష్మణులు కదలకుండా చేశాడు. తర్వాత గండ్రగొడ్డళ్ళ వంటివి, సింహం కోరలు వంటివి, కత్తుల మొనల వంటివి అనేక బాణాలను వారిపై ప్రయోగించారు. అవి వారి శరీరాలపై గుచ్చుకుని రక్తం వెల్లువలై పారింది. ఇద్దరూ మూర్ఛపోయారు. వానరులారా! ఆ ఇద్దరు సోదరులను నేను హతమార్చాను. నేను వేసిన నాగాస్త్రాల చేత బంధించబడిన వీరిని దేవతలు కూడా రక్షించలేరు" అని వికటాట్టహాసం చేస్తూ వెళ్ళిపోయాడు.

తండ్రి దగ్గరకి వెళ్లి మన శత్రువులు హతులయ్యారు అని చెప్పాడు ఇంద్రజిత్తు. రావణుడు వెంటనే లేచి కొడుకుని ఆనందంగా కౌగలించుకున్నాడు. సీతకు కావలి ఉన్న రాక్షస స్త్రీలు త్రిజట, ఏకజట మొదలైన వారిని పిలిపించి "రామలక్ష్మణులు యుద్ధంలో మరణించారు అని సీతకు చెప్పండి. పుష్పక విమానంలో తీసుకువెళ్ళి చూపించండి" అని చెప్పాడు.

సీతాదేవి త్రిజటతో కలిసి పుష్పక విమానంమీద వెళ్లి నాగపాశబద్ధులై పడి ఉన్న రామలక్ష్మణులను చూసింది. ఒంటినిండా బాణాలు గుచ్చుకుని రామలక్ష్మణులు రక్తం కారుతూ దుమ్ములో పడిఉన్నారు. కవచాలు బద్దలై ఉన్నాయి. వానరులంతా వారిద్దరి చుట్టూ కూర్చుని ఉన్నారు. రాక్షసులు సంతోషంతో పొంగిపోతున్నారు. ఆ దృశ్యం చూడగానే సీతకు దుఃఖం పొంగుకు వచ్చింది. కన్నీరుమున్నీరుగా ఏడ్చింది.

"బాల్యంలో నా చేతిలో రేఖలు చూసి హస్త సాముద్రికులు ఈమె దీర్ఘ సుమంగళి అవుతుంది. సంతానవతిగా వర్ధిల్లుతుంది. భర్తతో కలిసి యజ్ఞ యాగాలు చేస్తుంది అని జ్యోస్యం చెప్పారు. అవన్నీ కల్లలు అయిపోయాయి కదా! వైధవ్యం పొందే స్త్రీలు ఎలాంటి లక్షణాలు కలిగి ఉంటారో అవేమీ నాలో లేవే! ఆ శుభలక్షణాలు అన్నీ నేడు నిష్ప్రయోజనమని తేలిపోయింది. అయ్యో! రాముడికి దూరమైన నాకు ఇంకెందుకీ బ్రతుకు?" అంటూ దుఃఖించింది.

అది చూసి త్రిజట "సీతా! ఊరడిల్లు. నీ భర్త మరణించలేదు.



అటుచూడు, రామలక్ష్మణులు అలా పడిపోయి ఉన్నప్పటికీ వారి ముఖాల్లో కాంతులు ఏ మాత్రం మాసిపోలేదు. మరణించిన వారి ముఖాల్లో ఉండే వికారాలు ఏవీ కనిపించటం లేదు. వానరుల ముఖాల్లో కోపోద్రేకం, ప్రసన్నత కనబడుతున్నాయి గానీ దుఃఖం కనబడటం లేదు. వారు రామలక్ష్మణుల రక్షణలో నిమగ్నమై ఉన్నారు. కాబట్టి నీ భర్త సజీవుడై ఉన్నాడు. నువ్వు నిశ్చింతగా ఉండు.

సీతా! ఇంకొక విషయం కూడా చెబుతాను విను. ఈ పుష్పకం అపూర్వమైన మహిమ గలది. విశ్వకర్మ చేత నిర్మించబడింది. ఈ దివ్య విమానం సుమంగళులను మాత్రమే తీసుకుపోతుంది. భర్త చనిపోయిన స్త్రీలకు చోటు ఇవ్వదు. నిన్ను తీసుకుని వచ్చింది కనుక నీ భర్త జీవించియున్నాడు అనేది యధార్థం. నా మాట నమ్ము. నేనింత వరకు అబద్ధమాడి ఎరుగను. నిష్కల్మషమైన నీ మనసు, నీ పాతివ్రత్య ప్రభావం నన్ను ఆకట్టుకున్నాయి. రాముడు మరణించటం అసంభవం. కాబట్టి నువ్వు మానసికంగా బాధ పడవద్దు. రోహిణి చంద్రుని చేరినట్లు నువ్వు త్వరలోనే నీ భర్తను చేరుకుంటావు" అన్నది.

త్రిజట మాటలు విన్న సీత మనసులో దుఃఖం అంతరించి మనసు మబ్బులు తొలగిన ఆకాశంలా అయింది. "త్రిజటా! నీ మాటలు నిజమగు గాక!" అంటూ కృతజ్ఞతతో నమస్కరించింది.

నిర్మలమైన మనసు, మంచికి ఆకర్షింపబడే గుణం, దుఃఖంలో ఓదార్చే స్వభావం ఉన్న త్రిజట గంజాయివనం లాంటి రాక్షస జాతిలో తులసిమొక్క లాంటిది. సీతాసాధ్వి అంతటి దాని చేత నమస్కారం అందుకున్న ఆమె సీతకే కాదు, మనకు కూడా వందనీయురాలు.

**(సశేషం)**

# తొండరడిప్పొడి ఆళ్వార్

– చిల్లర సీతారామారావు


ఆళ్వారులు విష్ణుభక్తిలో పారవశ్యము చెందినవారు. భగవత్తత్త్వాన్ని లోతుగా దర్శించుకొన్నవారు. ఆళ్వారులు విష్ణువు గురించి సంస్కృతములోను, తమిళములోను స్తోత్రములను రచించారు. తమిళములో రచించిన స్తోత్రములను పాశురములు అని అంటారు. పాశురముల సంకలనాన్ని ద్రావిడ వేదము అన్నారు. ఆళ్వారులు పన్నెండుమంది. వీరిలో ఒకరు తొండరడిప్పొడి ఆళ్వార్.

తే.గీ భక్తులకు దొండరంఘ్రి శబ్దమున కడియు
రేణునకు బొడియనియు నీ రీతి ద్రవిడ
భాష బరగుట చేసి తద్భాష జనము
లతని దొండరడిప్పొడి యండ్రు భువిని"

తొండరడిప్పొడి యను పదమునందు ''తొండ'' యను దానికి భక్తుని యొక్క యని, 'రడి' యను దానికి పాదము యొక్క యని, 'పొడి' యను దానికి రజము, దుమ్ము అని అర్థము. ఇది తమిళ సమాసము. సంస్కృత సమాసము భక్తాంఘ్రిరేణు. తెనుగునాట విప్రనారాయణుడు అను పేరున వీరు ప్రసిద్ధులు. పూలు, తులసీదళాలతో అందముగా కట్టబడిన ఎన్నడూ వాడనటువంటి వైజయంతి అను వనమాల అంశమున జన్మించిన మహనీయులు విప్రనారాయణులు. వీరి గ్రామము తిరుమందన్ గుడి. వీరు వేదములను సమగ్రముగా అధ్యయనము చేసినవారు. అయిననూ కించిత్తు గర్వము లేకుండా విష్ణుభక్తులు కన్పించగానే ఎదురేగి మీ పాద రేణువును అంటూ వారిని సేవించేవాడు. వీరికి బాల్యమునుండి విష్ణుభక్తి అధికము.

కం. "వనమాలికాంశమున సం
జననమగుట వాసనల వశమున నతనికిన్
వనమాలికలంబుజులో
చనునకు నర్పించుబుద్ధి జనియించుటయున్"

వనమాల అంశమున జన్మించినందువలన, పూర్వవాసనల ప్రభావము చేత ఆయనకు శ్రీరంగనాథునకు నిత్యము వనమాల సమర్పించాలన్న సంకల్పము జనించింది. శ్రీరంగనాథుని పూలమాలకు అవసరమైన పూలు, తులసీదళాల నిమిత్తము కావేరీనది పరిసర ప్రాంతమున కొంత భూమిని కొని దాని చుట్టూ కంచెను నిర్మించాడు. ఆ భూమిలో తులసి, పూలమొక్కలను నాటాడు. అవి కొలది కాలములోనే ఏపుగా పెరిగాయి. నిత్యము పూలు, తులసీదళాలతో మాలను కట్టి శ్రీరంగనాథుడికి సమర్పించసాగాడు. ఆ తోటలోనే ఒక పర్ణశాలను నిర్మించుకున్నాడు. వేకువజాముననే లేచి తోటపని పూర్తి చేసుకొని స్నానాదికములు పూర్తి చేసుకొని ఒక తులసి మొక్క



దగ్గర పద్మాసనుడై శ్రీమదష్టాక్షరీ మంత్రమును జపించుకొనుట ఆయన నిత్యము సాగించే కార్యక్రమము.

భగవంతుడి లీలలు చిత్రాతి చిత్రముగా ఉంటాయి. కొంతమంది భక్తుల మీద అంతులేని అనురాగం. మరికొంతమంది భక్తులకు కఠిన పరీక్షలు. ఇంకొంతమందిని మాయలో పడవేసి, తిరిగి మాయనుండి బయట పడవేస్తాడు. మాయలో పడి తిరిగి మాయలో నుండి బయట పడిన భక్తులలో విప్రనారాయణుడు ఒకరు. విప్రనారాయణుడు నివసిస్తున్న నగరములోనే రంగసాని అని ఒక వేశ్యమాత ఉంది. ఆమెకు ముగ్గురు కూతుళ్ళు. వారిపేర్లు మధురవాణి, దేవదేవి, సరస.

దేవదేవి మిక్కిలి రూపవతి. సంగీత సాహిత్యములందు దిట్ట. రాజుగారి దృష్టి పడాలని మధురవాణి, దేవదేవి ఇద్దరినీ రాజుగారి ఆస్థానమునకు పంపిస్తుంది రంగసాని. ఆస్థానమునందు దేవదేవి నాట్యము చేసి అందరి ప్రశంసలు పొందుతుంది. తిరిగి గృహమునకు వెళుతున్న సమయంలో దేవదేవి ఒక తోటను చూస్తుంది. తోట సౌందర్యానికి ముగ్ధురాలై ఆ తోట ఎవ్వరిదియని మధురవాణిని అడుగుతుంది. ఆ తోట శ్రీరంగనాథుడి భక్తుడు అయిన విప్రనారాయణుడిది అని చెబుతుంది మధురవాణి. ఆయన దర్శనము చేసుకోవాలని తోటలోనికి ప్రవేశిస్తారు దేవదేవి, మధురవాణి. వారు విప్రనారాయణుడు కనిపించగానే నమస్కారము చేస్తారు. భగవన్నామములో నిమగ్నుడైన విప్రనారాయణ వారిని గమనించకుండా ముందుకు సాగిపోతాడు. విప్రనారాయణుడు తమను పట్టించుకోకుండా అలా వెళ్ళిపోవడం దేవదేవికి ఆగ్రహం కలిగించింది. అత్యంత సౌందర్యరాశినైన నన్ను కన్నెత్తియైన చూడకుండా వెళ్ళిపోతాడా? ఎంత గర్వం? అని మనసులో అనుకొని సోదరితో ఎంత గర్వమో గమనించావా? నమస్కారం పెడుతుంటే చూడకుండా వెళ్ళిపోతాడా? అని అంది. జ్యేష్ఠురాలు ఇలా జవాబిచ్చింది. సౌందర్యమునకే కోశాగారము వంటి శ్రీరంగనాథుడి నిరంతర సేవలో తత్పరుడైన మహాభాగవతోత్తముడు విప్ర నారాయణుడు. ఆయన గమనిస్తే ఏమిటి? గమనించకపోతే ఏమిటి? కోవెలలలో భగవంతుడికి నమస్కరిస్తాము. దేవుడు చూస్తాడా? పలకరిస్తాడా? విప్రనారాయణుడు కూడా దేవుడితో సమానము. పూజ్యులకు, భక్తులకు నమస్కరించడం వలన పుణ్యరాశి అధికమవుతుంది అన్నది. సోదరి పల్కులు దేవదేవికి నచ్చలేదు. నా సౌందర్యమునకు అందరూ దాసోహమనెడివారే. ఇక ఈ బ్రాహ్మణుడు ఎంత? ఒక సౌందర్యవతి నమస్కరించిందన్న భావన లేకుండా, దీవించకుండా ముందుకు సాగిపోతాడా? అని సోదరితో అక్కసుగా పలికింది. మధురవాణి సమాధానమిస్తూ – ఇంత అహంకారం పనికిరాదు. నీవు ఎంతటి సౌందర్యవతివైన విప్రనారాయణుడు లాంటి భక్తులు పట్టించుకోరు. వారి సర్వస్వము భగవంతుడే అని పలికింది. సోదరీ స్త్రీ సౌందర్యమునకు దాసోహము అనెడివారే కోకొల్లలు. ఈ బ్రాహ్మణుడు ఎంత? విశ్వామిత్రుడు లాంటి మహామునులే ఎందరో స్త్రీ సౌందర్యమునకు దాసులయ్యారు. ఈయన ఏమైనా హనుమంతుడా? భీష్ముడా? వినాయకుడా? నా సౌందర్యముతో ఈ బ్రాహ్మణుడి బ్రహ్మచర్యమును భ్రష్టు పట్టించకపోతే నేను దేవదేవినే కాను అని పలికింది. అందుకు మధురవాణి సోదరీ! విప్రనారాయణుడు అందరిలాంటివాడు కాదు. శ్రీరంగనాథుడి భక్తుడు. నిష్ఠాగరిష్ఠుడు. అవనసరంగా ఆయన జోలికి వెళ్ళవద్దు అన్న మధురవాణి పలుకులకు దేవదేవి "సోదరీ! ఈ బ్రాహ్మణుడి మీద నీకు అచంచలమైన విశ్వాసమున్నది గదా! నా ప్రయత్నమును నన్ను చేయనీ. మనమిద్దరం ఒక పందెం వేసుకుందాం. పందెం ఏమిటో నీవే చెప్పు అని పలికింది. మధురవాణి పందెమును తెలియజేసింది. ఓడిన వారు గెలిచిన వారికి సేవకులుగా పరిచర్యలు చేయాలి. ఆ పందెమును విని దేవదేవి పరిహాసము చేస్తూ ఒకరికొకరు సేవలందించుకోవడం తప్పు లేదు. కనుక వేరొక పందెమును చెప్పు అని పలికింది. మధురవాణి పందెమును ఇలా వివరించింది.

కం. "నీవీ వైష్ణవు విటునిం
గావించిన లంజెతనపు గడన విడిచెదన్
గావింపలేకయుండిన
నీమన్విడిచెదవె యనిన నెలతుక యొప్పెన్"

నీవు ఈ వైష్ణవుడిని విటుడిగా మారిస్తే వేశ్యరికము ద్వారా ఆర్జించిన ధనమును వదులుకుంటాను. మార్చలేకపోతే నీవు సంపాదించిన ధనమును విడిచెదవా? అన్న ఆ పందెమునకు దేవదేవి అంగీకరించింది. కొంతకాలము గడిచిపోయింది.

దేవదేవి విప్రనారాయణుడిని విటుడిగా మార్చడానికి ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఒకనాడు తన వేషధారణను మార్చివేసింది. నుదుట సన్నని రేఖ, కాషాయరంగు చీర, చెవులకు చవక దుద్దులు, జుట్టును ముడివేసిన కొప్పు, కంఠమున తులసి, తామరగింజల పూసల పేరులు ధరించి ఒక దాసరి సానిలాగా విప్రనారాయణుడి తోటలోనికి ప్రవేశించింది. విప్రనారాయణుడు పద్మాసనము వేసుకొని భగవన్నామ జపము గావిస్తూ కనిపించాడు. వెంటనే ఆయన పాదములకు శిరస్సు వంచి నమస్కరించింది. విప్రనారాయణుడు ఆమెను చూచి – ఎవ్వరు నీవు? నీ పేరేమిటి? నీ కులమేమిటి? నీ నివాసమెక్కడ? ఇక్కడికి ఎందుకు వచ్చావు? అని ప్రశ్నల వర్షము కురిపించాడు. దేవదేవి వినయంగా ఇలా సమాధానమిచ్చింది. స్వామీ! నేను ఒక వారకాంతను. బాల్యమున సంగీతము, నృత్యము నేర్చుకున్నాను. యుక్తవయస్కురాలైన తరువాత వేశ్యావృత్తి నవలంబించి బాగానే ఆర్జించాను. వేశ్యావృత్తి నాకు ఇష్టమైన వృత్తి కాదు. తల్లి బలవంతము చేత ఈ వృత్తిని కొనసాగించవలసి వచ్చింది. తృప్తి లేని నా తల్లిని వదలి దాసరిసానిగా మారి శ్రీరంగనాథుడిని సేవించుకుంటూ మధుకర వృత్తి ద్వారా జీవితమును గడుపుతున్నాను. మీరు శ్రీరంగనాథుడి భక్తులని, బ్రాహ్మణోత్తములని విని మీ దర్శనము కొరకు వచ్చాను. బ్రాహ్మణుల యందు త్రిలోకపావనులు హరిభక్తులు. హరిభక్తులయందు వైష్ణవులు గొప్పవారు. శ్రీరంగనాథుడి సేవలకే మీ జీవితమును అంకితము గావించుకొన్న ఘనులు మీరు. మీలాంటివారికి సేవలు చేసి తరిద్దామని ఇక్కడకు వచ్చాను. దయచేసి శిష్యురాలిగా స్వీకరించి నా సేవలు అందుకోండి అని ప్రార్థించింది. దేవదేవి మాటలు విని విప్రనారాయణుడు ఈ ఆశ్రమము చాలా పవిత్రమైనది. స్త్రీలకు ఈ ఆశ్రమమున

ప్రవేశము లేదు. నీకు తెలియకుండా ఇక్కడికి వచ్చావు. వెంటనే వెళ్ళిపో. నీవు వారాంగనవు. కరుణించి నీకు ఆశ్రయం కల్పించితే లోకుల నోళ్ళకు పని కల్పించినట్లవుతుంది. విప్రనారాయణుడి మాటలకు దేవదేవి "స్వామీ! నేను వారకాంతనే. వారకాంతలు ధనములకు ఆశపడతారు. కాని నేను ఆ వృత్తిని రోసి బయటకు వచ్చాను. నాకు భోగేచ్ఛ ఉంటే ఇలా జీవించాల్సిన అవసరమేమున్నది? పాలు విరిగితే పెరుగవుతుందా? మనస్సు విరిగిన దానను తిరిగి ఆ వృత్తిని అవలంబిస్తానా? మీరే ఆలోచించండి. నాకు ఆశ్రయము ఇచ్చినంత మాత్రమున మీకు ఎటువంటి అప్రతిష్ఠ రాదు. మనస్సు గట్టిదయితే వేశ్య మందిరము నైననూ కాపురముండవచ్చునన్న సామెత మీకు తెలియనిది కాదు అని దాసురాలిగా జేసుకొమ్మని పరిపరి విధాలుగా ప్రార్థించింది. దేవదేవి పలుకులను ఆలకించిన విప్రనారాయణుడు ఆలోచనలో పడిపోయాడు. ఈమె చాలా అందగత్తె. వయసులో ఉంది. వారకాంతగా ఎంతైనా సంపాదించుకొనే అవకాశమున్నది. కాని వృత్తి మీద రోసి మధుకరమున జీవిస్తూ శ్రీరంగనాథుడిని ఆరాధించుకుంటున్నది. విరక్తురాలైన ఈమెను దాసురాలిగా జేసుకుంటే నాకు తోటపనికి సహాయపడుతుంది. ఇరువురము కలిసి నిర్విఘ్న ముగా శ్రీరంగనాథుడిని సేవించుకొనవచ్చును అని ఆలోచించిన పిమ్మట విప్రనారాయణుడు ఆమెతో నీది సుకుమారమైన శరీరము. తోటపనికి సహకరించగలదా? నాతోపాటు మధుకరము తిని ఉండగలవా? అని అడిగాడు. అందుకు దేవదేవి ఈ దాసురాలికి జాత్యభిమానము, దేహాభిమానము అనునవి కొంచెము కూడా లేవు. మధుకరము ద్వారా జీవించుట నాకు అలవాటే. మీవంటి ఘనులు చెప్పు పనులు చేయడం కంటె గొప్ప అదృష్టమున్నదా? తోటపని చేయగలను. అందముగా మాలలు కట్టగలను. మీరు ఏ పనిని చేయమన్నా చేయగల దానను. దాసురాలిగా మీకు ఎటువంటి అపఖ్యాతిని రానివ్వను. ఆచార్యుల సేవను మించిన సేవ మరొకటి లేదు.

కం. "తిరుకట్టె సేవ జేసెద
దిరుమాళి హనలికి పూసి తీర్చెద ముగ్గుల్
తిరువంజనంబు దీర్చెద
దిరువు పుట్టములుతికి వేగ దెచ్చెద దినమున్"

వాకిలి ఊడ్చి శుభ్రము చేస్తాను. కలాపి చల్లుతాను. ముగ్గులు పెడతాను. మీ వస్త్రములను ఉతికి శుభ్రము చేస్తాను అన్న దేవదేవి పల్కులకు విప్రనారాయణుడు సంతోషించాడు. ఇరువురము కలిసి శ్రీరంగనాథుడిని సేవించుకుందాము అని పలికాడు. దేవదేవి దాసురాలుగా నన్ను స్వీకరించినందుకు నా జన్మ చరితార్థమయ్యింది అని పలికి విప్రనారాయణుడి పాదములకు నమస్కరించింది.

దేవదేవికి తోటపని, ఇంటిపని మున్నగు కార్యక్రమములో రోజులు గడిచిపోతున్నాయి. ఒకనాడు తోటపని చేస్తుండగా అకస్మాత్తుగా ఉరుము మెరుపులతో జడివాన కురిసింది. ఆ వర్షములో దేవదేవి పూర్తిగా తడిసిపోయింది. గబగబా ఆశ్రమ వాకిలి వద్దకు వచ్చి నిలిచింది. విప్రనారాయణుడు ఆమెను లోపలకు వచ్చి బట్టలు మార్చుకొమ్మని చెప్పి తన అంగవస్త్రమును ఆమె మీదికి విసిరాడు. ఆమె అంగవస్త్రము ధరించింది. ఆమె అర్ధనగ్న శరీరము చూశాడు. అంతే మాయ ఆయనను ఆవహించింది. మోహానికి దాసుడయ్యాడు. ఆయన తపము, జపము, శాస్త్రజ్ఞానము, వైరాగ్యము మున్నగునవి వారాంగన మోహపు నదిలో కొట్టుకొని పోయాయి. నిగ్రహించుకోలేని పరిస్థితిలో ఆమె దరికి చేరి నన్ను పరిణయమాడమని అభ్యర్థించాడు. ఆ పల్కులకు దేవదేవి ఆనందించింది. పైకి ఇలా అన్నది.

కం. "పరకాంత దోషమటుపై
బరికించిన శూద్రజాతి బడపుసతిన్నే
వర దాసి నీవు మోంజీ
ధరుడవు వైష్ణవుడవంట దగునే మహాత్మా"

పరకాంతను కోరుట దోషము. పైగా నేను శూద్రజాతి పడతిని. మీ దాసిని. మీరు బ్రాహ్మణోత్తములు. వైష్ణవులు. ఇలా కోరడం మీకు తగునా? అన్న ఆమె పల్కులకు విప్రనారాయణుడు మహా మహా మునీశ్వరులే స్త్రీలకు వశులయ్యారు. నేనెంత? పడతీ! నా కోరికను మన్నించుము అని పలికాడు. దేవదేవి ఆయనకు సహకరించింది. కొన్ని రోజులు గడిచిపోయాయి. ఒకనాడు దేవదేవి తను వచ్చిన పని అయిపోయినదని భావించి స్వామీ! మా అమ్మ నాకు గుర్తుకు వస్తున్నది. ఒక పరి ఆమెను చూచి వస్తానని పలికి తల్లి ఇంటికి వెళ్ళిపోయింది. దేవదేవి విరహమును భరించలేని విప్రనారాయణుడు దేవదేవి కొరకు రంగసాని ఇంటికి వెళ్ళాడు. ధనహీనుడు అని గ్రహించిన రంగసాని విప్రనారాయణుడిని గృహము లోనికి రానివ్వలేదు. మితిమీరిన మోహావేశమున దుఃఖితుడై అక్కడే ఉన్న ఒక చెట్టు క్రింద పరుండిపోయాడు. భక్తుడి మనోవేదనను చూడలేక శ్రీరంగనాథుడు ఒక సేవకుడిలాగా రంగసాని ఇంటికి వెళ్ళి తలుపు తట్టాడు. తలుపు తీసిన రంగసానికి ఒక బంగారు పళ్ళెరమును ఇచ్చి ఇది విప్రనారాయణుడు మీకు ఇమ్మని చెప్పాడు అని పలికెను. రంగసాని ఆ బంగారు పళ్ళెరమును గాంచి అది చాలా విలువైనదని గ్రహించి విప్రనారాయణుడిని గృహములోనికి ఆహ్వానించింది. విప్రనారాయణుడు తన సేవకుడి ద్వారా బంగారు పళ్ళెరమును రంగసానికి ఇచ్చాడు అన్న వదంతి వ్యాపించింది.

ఒకరోజు శ్రీరంగనాథ స్వామి మందరకిపు తలుపులు తీసి చూడగా ఒక బంగారు పళ్ళెరము కనిపించలేదు. పూజారులు దేవాలయ అధికారులకు తెలియజేశారు. అధికారులు ఎలా పోయిందని అన్వేషించసాగారు. ఆ తరుణంలోనే వారికి ఒక విషయం తెలిసింది. విప్రనారాయణుడు బంగారు పళ్ళెరమును

రంగసానికి ఇచ్చాడని ప్రజలు అనుకుంటున్నారని తెలిసింది. అధికారులు రంగసాని ఇంటికి వెళ్ళి ఆ పళ్ళెరమును చూచారు. అది దేవాలయమునకు సంబంధించిన పళ్ళెరమే. వెంటనే రాజు దగ్గరకు వెళ్ళి విప్రనారాయణుడి మీద అభియోగం మోపారు. రాజుగారు విప్రనారాయణుడిని పిలిపించారు. పళ్ళెరమును గురించి అడిగారు. అందుకు విప్రనారాయణుడు "రాజా! నేనొక వైష్ణవుడను. శ్రీరంగనాథుడి భక్తుడను. పేదవాడిని. నాకు సేవకులు ఎవ్వరూ లేరు. ఆ పళ్ళెరము గురించి నాకు తెలియదు. ఇదంతా శ్రీరంగనాథుడి మాయ అన్నాడు. విప్రనారాయణుడి సమాధానము వినిన రాజు ఆలోచనలో పడిపోయాడు. ఇతడు పేదవాడు. శ్రీరంగనాథుడి భక్తుడు. నిరంతరం భగవంతుని సేవలో కాలం గడిపే ఇతనికి బంగారు పళ్ళెరముతో పని ఏమి? రంగసానికి బంగారు పళ్ళెరము ఇచ్చిన సేవకుడెవరు? అని ఆలోచిస్తూ ఎటూ నిర్ణయించుకోలేక విప్రనారాయణుడిని భటులకు అప్పగించి తన మందిరమునకు వెళ్ళాడు. ఆ రాత్రి కలలో కనిపించి రాజుతో శ్రీరంగనాథుడు ఇదంతా నేను కల్పించిన మాయ. ఇందులో విప్రనారాయణుడి దోషమేమియు లేదు. విప్రనారాయణుడు దుఃఖితుడైనప్పుడు నేను అతడి దుఃఖమును దూరము చేయడానికి సేవకుడిలాగా మారి పళ్ళెరమును రంగసానికి ఇచ్చాను అన్నాడు. శ్రీరంగనాథుడి పల్కుల ద్వారా నిజము తెలుసుకున్న రాజు విప్రనారాయణుడిని విముక్తుడిని గావిస్తాడు. బంగారు పళ్ళెరమును దేవాలయానికి పంపిస్తాడు. ఈ సంఘటన విప్రనారాయణుడి కళ్ళు తెరిపించింది. అతనిని ఆవహించిన మాయ తొలగిపోయింది. పశ్చాత్తాపంతో శ్రీరంగనాథుడిని ప్రార్థించడం మొదలుపెట్టాడు. స్వామి నన్ను కరుణించు. మోహావేశంలో పడిపోయి సదాచారమును నాశనము చేశాను. మీ నామస్మరణను విస్మరించాను. మీరు దయామయులు. నన్ను రక్షించండి. నిరంతరం మీ సేవ జేయు భాగ్యమును కల్పించండి అన్నాడు. ఆ రోజునుండి విప్రనారాయణుడు శ్రీరంగనాథుడి సేవలోనే కాలం గడపసాగాడు. శ్రీరంగనాథుడిని స్తుతిస్తూ రెండు గ్రంథములను రచించాడు. తిరుమాలై నలుబది అయిదు పాశురములు గలిగిన గ్రంథము. తిరువళ్ళి మెళుచ్చి భగవంతుడిని మేలుకొలుపు సుప్రభాత శ్లోకములు. దేవదేవి కూడా తన తప్పిదమునకు పశ్చాత్తాప పడి పాత జీవితమునకు స్వస్తి చెప్పి విప్రనారాయణుడితో పాటు శ్రీరంగనాథుడిని సేవించుకుంటూ తన జీవితానికి సార్థకతను చేకూర్చుకుంది. ఈ విధముగా శ్రీరంగనాథుడు విప్రనారాయణుడిని మాయలో పడవేసి, తిరిగి తానే ఆ మాయ నుండి విప్రనారాయణుడిని బయట పడేస్తాడు.

★★★


# రచనలకు శ్రీ వేంకటేశం ఆహ్వానం



'శ్రీ వేంకటేశం' మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం.


రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం.

ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్) వీక్షించుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి.

మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిసే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.

**గమనిక: మీ రచనలను ఆన్‌లైన్‌లో పంపాలనుకునేవారు srivenkatesham@gmail.com మెయిల్ చేయండి.**

రచనలు పంపవలసిన చిరునామా



**శ్రీ వేంకటేశం** ఆధ్యాత్మిక మాసపత్రిక,
(శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్-07.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

సేకరణ : కె.వి.రాఘవాచార్యులు

## 300.శ్రీశాయ నమః

లక్ష్మీదేవి అవతారమైన రుక్మిణీదేవికి భర్త – కృష్ణుడు. తుల్య శీల వయో వృత్తములు గల్గిన లక్ష్మీదేవికి అన్నివిధముల తగినవాడైన స్వయముగా వరింపబడిన భర్త కనుక విష్ణువు శ్రీశుడు (శ్రీపతి) అనబడుచున్నాడు. పాలసముద్రము నుండి జన్మించిన లక్ష్మి దేవతలు ఋషులు అందరు చూచుచుండగా స్వయముగా వచ్చి దేవతల మధ్య నున్న విష్ణుదేవుని కంఠమున స్వయంవర మాలను వేసింది. నాటినుండి విష్ణువు శ్రీశుడుగా ప్రసిద్ధుడైనాడు.

## 301.బృందారణ్య నివాసకాయ నమః

యమునా నదికి పడమటి తీరమున మధురా నగరము వద్ద ఉన్న వనము బృందావనము. దీనికి ఎదురుగా అనగా యమున యొక్క తూర్పు గట్టున గోకులము ఉంది.

**"బృందావనము సంప్రవిశ్య సర్వకాల సుఖావహమ్"**

బృందావనము సర్వకాలములందు హాయిని కలిగించెడి చక్కని ప్రదేశము. కనుక నందాది గోపాలురు గోకులము వీడి బృందావనమునకు వెళ్ళి అక్కడ నివసించినారు.

బృందావన నివాసి అయిన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 302.వత్సాంతకాయ నమః

కంసుని భటుడగు వత్సాసురుని సంహరించిన వాడు కృష్ణుడు.

వత్సాంతకుడైన కృష్ణుని అవతారమే అయిన వేంకటేశునకు నమస్కారము.

## 303.బక ద్వేషిణే నమః

కొంగ రూపియగు బకాసురుని ద్వేషించినవాడు – సంహరించిన వాడు కృష్ణుడు.

కృష్ణుడు బృందావనములో ఉన్నపుడు కంసుని ఆదేశముచే రాక్షసుడు ఒకడు బక రూపధారియై కృష్ణుని చంపుటకు వచ్చినాడు. ఒకనాడు బలరామకృష్ణులు గోపబాలురు అందరు తమ తమ దూడలకు నీరు త్రాగించి, పిదప వారు నీరు త్రాగి దప్పిక తీర్చుకున్నారు. వారందరు అక్కడ బలిష్ఠమైన కొంగను చూచారు. బకాసురుడు వారి దగ్గరికి వచ్చి క్షణములో తన ముక్కుతో కృష్ణుని ఒడిసి పట్టుకున్నాడు. వాడు కృష్ణుని నోట కరచుకొనునంతనే కృష్ణుని మహిమచే కొంగ దవడల మూల భాగమున (అంగిటి యందు) మంటలు చెలరేగినాయి. ఆ తాపమును తట్టుకొనలేక ఆ రాక్షసుడు కృష్ణుని వెడల గ్రక్కినాడు. పిమ్మట బకాసురుడు తన ముక్కు కొనతో కృష్ణుని చంపుటకు ప్రయత్నించినాడు. కృష్ణుడు బకాసురుని ముక్కును పట్టుకుని గడ్డిపోచ వలె రెండు ముక్కలుగా చీల్చి వానిని సంహరించినాడు. బలరామ గోపబాలురందరు కృష్ణుని సామర్థ్యమును చూచి సంతోషించినారు. ఈ సన్నివేశమును

**కం॥ క్రక్కి మహా ఘోషముతో**
**జక్కగ దను బొడవరాగ జంచులు రెండున్**
**స్రుక్కగ బట్టి తృణము క్రియ**
**గ్రక్కున హరి చీరె బకుని గలహోత్సుకునిన్ ॥ – భాగవతము – 10 – పూర్వ – 448**

బకాసురుడు నోట మ్రింగిన కృష్ణుని వెడల గ్రక్కి, పెద్దగా కోపముతో అరచుచు తనను పొడుచుటకు రాగా కృష్ణుడు ఆ కొంగ ముక్కును పట్టుకొని గడ్డిపోచవలె రెండుగా చీల్చివేసినాడు అని పోతన స్వభావ రమణీయముగా వర్ణించినాడు. బకాసురుని సంహరించిన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.


## 304. దైత్యాంబుద మహానిలయాయ నమః

రాక్షసులనెడి మేఘములకు పెనుగాలి వంటివాడు కృష్ణుడు.

దితి యొక్క పుత్రులు దైత్యులు – రాక్షసులు.

ఒకనాడు విధివశమున దితి మన్మథ శరపీడితయై సంధ్యాకాలమున తన భర్త యగు కశ్యప మహర్షి దగ్గరకు వెళ్ళి సంగమము కోరింది. ఇది తగిన సమయము కాదని కశ్యపుడు ఎంత చెప్పినా వినక దితి అకాలమున సంగమమునే

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**





అన్ని నామాలూ నీవే అయిన
ఓ వేంకటేశా! నీకు నమస్కారము



కోరింది. విధి లేక కశ్యపుడు అంగీకరించాడు. భర్తతో బలవంతముగా సంధ్యాకాలమున రమింప, అపుడు ధరించిన గర్భమున హిరణ్యాక్ష హిరణ్యకశిపులు జన్మించారు. వారు సంధ్యాకాల దోషముచే అతి క్రూరులయి రాక్షసులయినారు. విష్ణుదేవుడు హిరణ్యాక్షుని వరాహావతారమున సంహరించినాడు. నరసింహావతారమున హిరణ్యకశిపుని సంహరించినాడు. రామావతారమున తాటకను, మారీచ సుబాహులను, ఖర దూషణాది 14 వేల మంది రాక్షసులను, లంకలో రామరావణ యుద్ధములో రావణ కుంభకర్ణులను, అనేకమంది రాక్షసులను రాముడు సంహరించినాడు. కృష్ణావతారమున పూతన, వత్సాసుర, బకాసురులను, ధేనుకాసురుని, వృషభాసురుని, కేశి, వ్యోమాసురులను, కంసుని సంహరించినాడు.

దైత్య మేఘములకు మహా ప్రభంజనమైన కృష్ణునిగ జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తియగు వేంకటేశునకు నమస్కారము.

## 305. మహాజగర చండాగ్నయే నమః

పెద్ద కొండచిలువకు ప్రచండాగ్నియైనవాడు కృష్ణుడు.

ఒకనాటి శివరాత్రి పర్వదినమున నందాది గోపాలురందరు గౌరీశంకరులను పూజించుటకై ఎడ్ల బండ్లపై ప్రయాణము చేసి అంబికా వనమునకు వెళ్ళినారు. ఆ వన సమీపమున నున్న సరస్వతీ నదిలో స్నానము చేసినారు. పిమ్మట గౌరీ శంకరులను భక్తితో పూజించి, యథాశక్తి బ్రాహ్మణులకు పాడి యావులను, వస్త్రములను, మధుర పదార్థములను సాదరముగ సమర్పించినారు.

పిమ్మట నందాది పెద్దలు బ్రహ్మచర్యమును పాటించి కేవలము నీటిని మాత్రమే స్వీకరించి ఉపవాస దీక్షతో సరస్వతీ నదీ తీరమున ఆ రాత్రి పరుండి యున్నారు. అంబికా వనములో నివసించి యున్న ఒక మహాసర్పము (అజగరము) ఆకలితో నందాదులు పరుండి యున్న చోటికి వచ్చింది. పరుండి యున్న నందుని నోట గరచుకొన్నది. అంతట సర్పగ్రస్తుడైన నందుడు కృష్ణా! కృష్ణా! ఈ అజగరము నన్ను మ్రింగివేయుచున్నది. నాయనా నాకు నీవే దిక్కు. వెంటనే వచ్చి నన్ను కాపాడు అని మొరపెట్టుకున్నాడు. నందుని ఆర్తనాదములను వినినంతనే నిద్రలో ఉన్న గోపాలురు అందరూ ఉలికి పడుచు లేచినారు. పిమ్మట వారు మహాసర్పము నోట చిక్కియున్న నందుని చూచి వ్యాకుల చిత్తులై కొరవి కట్టెలతో ఆ సర్పమును కొట్టుచున్నప్పటికీ ఆ అజగరము నందుని వదిలిపెట్టలేదు. పిమ్మట కృష్ణుడు దాని దగ్గరకు వచ్చి తన పాదములతో దానిని తన్నినాడు. కృష్ణుని పాద స్పర్శచే అజగరము యొక్క పాపములన్నియు నశించగా క్షణములో అజగరము విద్యాధరుని రూపమును పొంది కృష్ణుని పాదముల నాశ్రయించెను. అంతట కృష్ణుడు ఎవరు నీవు? నీ దేహము దివ్య తేజస్సుతో వెలుగుచున్నది. ఈ సర్పజన్మ నీకు ప్రాప్తించుటకు కారణమేమి? అని అడిగినాడు.

అజగరమై యుండిన విద్యాధరుడు ఇట్లు తన వృత్తాంతమును కృష్ణునికి చెప్పినాడు. నేను ఒక విద్యాధరుడను. నాపేరు సుదర్శనుడు. భగవదనుగ్రహముతో నాకు ఈ దివ్యరూపము, సంపదలు లభించినవి. ఒకనాడు నేను ఆకాశమున విమానమున సంచరించుచుంటిని. అప్పుడు సౌందర్య గర్వితుడనైన నేను కురూపులైన అంగిరస ఋషులను చూచి హేళనగా నవ్వాను. అవహేళనకు గురియైన ఆ మునులు నా అపరాధమునకు కోపించి ఓరీ పాపాత్మా! సౌందర్య గర్వముచే విర్రవీగుచు నీవు మమ్ములను పరిహసించినావు. కావున నీవు సర్పరూపమును పొందుము అని శపించినారు. నేను పశ్చాతప్తుడనై వారిని ప్రార్థింపగా వారు దయ తలచి – యదువంశమున భక్తుల భయమును పోగొట్టునట్టి జనార్దనుడు (విష్ణువు) జన్మించును. అతడు ఒక దినమున ఈ అడవికి రాగలడు. అతని పాదములతో తన్నబడినప్పుడు నీ సర్పరూపము పోయి మొదటి విద్యాధర రూపము పొందుదువు. మూఢుడా పొమ్ము అని వారు శాప విమోచనము తెల్పినారు. ఆ మహాత్ముల శాపము నా పాలిట అనుగ్రహముగా మారినది. ఏలయన జగద్గురువైన నీ యొక్క పాదస్పర్శచే నా పాపములన్నియు నశించినవి. ఇది నా అదృష్టము. దేవా! నీ పాదస్పర్శచే నేను శాప విముక్తుడయినాను. నా లోకమునకు వెళ్ళుటకు అనుమతించుము అని ప్రార్థించి కృష్ణుని ప్రదక్షిణము చేసి నమస్కరించి ఆ విద్యాధరుడు సుదర్శనుడు స్వస్థానమునకు వెళ్ళినాడు. నందుడు ఆ సర్ప ప్రమాదము నుండి విముక్తుడయినాడు. పిమ్మట గోపాలురందరు కృష్ణుని మహిమను స్వయముగా చూచి ఆశ్చర్యపడి కృష్ణుని కీర్తించినారు. అనంతరము గోపాలురు దేవతా మహోత్సవము సమాప్తి నొందించి మరల వ్రజ భూమికి వెళ్ళినారు.

మహా అజగరమునకు శాప విముక్తిని అనుగ్రహించిన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

ధారావాహికం



# రామాయణ రత్నాకరం

– రాళ్ళబండి శ్రీనివాసన్

**గత సంచిక తరువాయి**

“నీలో నిద్రాణమై ఉంది పరాక్రమం. దాన్ని మేల్కొలుపు. వర్షాకాలంలో సింహం గుహలో ఉంటుంది. తర్వాత బయటికి వస్తుంది. తన పరాక్రమం చూపుతుంది. ఈ నాలుగు నెలలు ఓర్చుకో. తర్వాత శత్రు వధకి ఉద్యమించు”.

విన్నాడు రాముడు. లక్ష్మణుడు తగినవిధంగా పలికాడు. అవి ఎంతో ప్రియ వచనాలు. అనురాగ వచనాలు. హితవచనాలు. పరాక్రమ శోభితాలు. సౌమిత్రీ! నీ మాటలు చాలు. నన్ను ఉత్తేజపరిచాయి. శరత్కాలం దాకా నిరీక్షిస్తాను.

**ఉపకారేణ వీరస్తు ప్రతికారేణ యుచ్యతే ।**
**అకృతజ్ఞో ప్రతికృతో హంతి సత్వవతాం మనః ॥**

ఉపకారం పొందినవాడు తప్పక ప్రత్యుపకారం చేస్తాడు. అది వీర ధర్మం. కృతఘ్నుడై ప్రత్యుపకారం చేయలేదో సత్పురుషుల మనసులు బాధపడతాయి. సుగ్రీవుడు తప్పక మేలు చేస్తాడు. కాకపోతే లోకులు నిందిస్తారని భయం.

## మారుతి మాట

వర్ణనలో సిద్ధహస్తుడు వాల్మీకి. వర్షాకాలం రానే వచ్చింది. అది వర్ష ఋతువు. అద్భుతంగా వర్ణించాడు. అరవై శ్లోకాలు అవి. తర్వాత శరత్కాలం మొదలైంది. అది గుర్తించాడు హనుమంతుడు. ఆకాశంలో మెరుపుల్లేవు. మేఘాల్లేవు. నిర్మలంగా ఉంది. పిండి ఆరబోసినట్లుంది వెన్నెల. ఇక సీతాన్వేషణకు సమయం. వెంటనే సుగ్రీవుని కడకు వెళ్ళాడు.

చూశాడు వానర రాజుని. భోగలాలసుడైనాడు. కామపరవశుడైనాడు. రుమతో, తారతో విహరిస్తున్నాడు. రాజ్యపాలన పట్టించుకోలేదు. దాన్ని మంత్రులకి అప్పగించాడు. నిరంతర కామకేళిలో మునిగి వున్నాడు. గమనించాడు మారుతి. కాలోచిత కర్తవ్యం తెలిసినవాడు. ధర్మవిశేషం ఎరిగినవాడు. అర్థస్వభావం ఎరిగినవాడు. రాజుకి యథార్థం చెప్పాలనుకున్నాడు. అది నీతి యుక్తమని తలచాడు. మాటకారి



కదా. సుగ్రీవుణ్ణి ప్రసన్నుణ్ణి చేసుకున్నాడు. అంటున్నాడు.

"సుగ్రీవా! నీకు రాజ్యం వచ్చింది. కీర్తి వచ్చింది. సంపదలు వచ్చాయి. సుఖభోగాలు వచ్చాయి. మిగిలింది మిత్రకార్యం. చేసిన ప్రతిజ్ఞ గుర్తు తెచ్చుకో. రాముడు మనకు పరమ మిత్రుడు. అతని కార్యం నెరవేర్చాలి. ఎవడు మిత్రకార్యం చేయడో విస్మరిస్తాడో వాడికి కష్టాలు తప్పవు. సమయం మించిపోయాక ఎన్ని మహాత్కార్యాలు చేసినా వ్యర్థమే.

నీవు వీరుడవు. వైదేహిని వెదికించు. ఇప్పటికే కాలాతీతమైంది. సర్వమూ తెలిసినవాడు రాముడు. ఇది చేసిపెట్టు అని అడగడు. అతడు అడిగేవరకు ఉంటే దోషి అవుతావు. త్వరగా సీతాన్వేషణకు పూనుకో. సమస్త వానర భల్లూకాలకు రాజువి. రామకార్యం సాధించు. ఆ సామర్థ్యం నీకు వుంది. ఎవరు ఏ పని చేయాలో ఎలా చేయాలో ఆజ్ఞాపించు. నీవు అలా చేయక – జాగు చేస్తే – రాముడు కోదండం ధరిస్తాడు. అమిత శక్తిమంతుడు. నీకు ఉపకారం చేశాడు. ప్రత్యుపకారం నీ విధి. వెంటనే వానర భల్లూక వీరుల్ని పిలిపించు. ఆజ్ఞాపించు".

విన్నాడు సుగ్రీవుడు. రామకార్యం గురించి ఆలోచించాడు. నీలుణ్ణి పిలిపించాడు. "సేనాపతీ! సర్వదిక్కుల్లో వానరులున్నారు. భల్లూకాలు ఉన్నారు. అందరినీ రమ్మని చెప్పు. రామకార్యం సాధించాలి. అంగదుని సాయం తీసుకో. 15 రాత్రులు గడువు. అందరూ రావాలి. లేదా మరణ దండన విధించు. ఇది నా నిర్ణయం. నా ఆజ్ఞ.

## రాముని విరహం

అది శరత్కాలం. సుగ్రీవుడు కామ పరతంత్రుడైనాడు. సీతాన్వేషణ ఏమైందో తెలియదు. రాముడు సీతా విరహంతో కృంగిపోయాడు. ఆతని మనసంతా సీతమ్మే. దుఃఖాన్ని నిగ్రహించుకోలేకపోతున్నాడు. ఏడుస్తున్నాడు. ఇపుడామె ఎక్కడుందో – ఎలా వుందో – అదే చింత. బెంగ. సుఖం లేదు. సంతోషం లేదు. నిద్ర లేదు.

పండ్ల కోసం వెళ్ళాడు లక్ష్మణుడు. ఎక్కడెక్కడో తిరిగాడు. తియ్యని పండ్లు తెచ్చాడు. చూశాడు రాముణ్ణి. బాధ కల్గింది. అంటున్నాడు "పూజ్యుడా! కామవశుడవయ్యావు. ధైర్యం కోల్పోయావు. మనస్సు పాడు చేసుకుంటున్నావు. నిబ్బరం తెచ్చుకో. కాలాన్ని గమనించు. సుగ్రీవుని బలగాన్ని సాయాన్ని సామర్థ్యాన్ని ఆలోచించు. మైథిలి ఒక అగ్నిజ్వాల. చేత్తో పట్టుకోలేరు. పట్టుకుంటే తగలబడిపోతారు" – అలా రాజనీతియుక్తంగా ధర్మయుక్తంగా చెప్పాడు సౌమిత్రి.

విన్నాడు రాముడు. "లక్ష్మణా! నీవు చెప్పింది నిజమే. ఉత్సాహం పెంచుకోవాలి. పౌరుషం తెచ్చుకోవాలి. కాని సీతని పొందడం చాలా దుర్లభం. నాలుగు నెలలు నాలుగు యుగాలుగా ఉన్నాయి నాకు" అలా విరహతాపాన్ని వివరించాడు. ఆ విరహాన్ని



ప్రకృతిలో మేళవించాడు వాల్మీకి. అది ఆదికవి రచనా చాతుర్యం. అవి 48 శ్లోకాలు.

## రాముని కోపం

"తమ్ముడా! రాజులు దండయాత్రలకి సిద్ధపడుతున్నారు. కాని సుగ్రీవుడు తన మాట తప్పాడు. అతడొక దుర్మతి. బుద్ధిహీనుడు. నన్ను అవమానిస్తున్నాడు. నీవు కిష్కింధకి వెళ్ళు. నా మాటగా చెప్పు సుగ్రీవునికి.

ఉపకారం పొందావు. నాకోసం ప్రతిజ్ఞ చేశావు. ఇపుడు తప్పుకున్నావు. నీవు పురుషాధముడవు. నీలా మరొకరు ఉండరు. పుణ్యానికి కాని పాపానికి కాని కట్టుబడాలి. వాడే వీరుడు. వాడే పురుషోత్తముడు. ప్రత్యుపకారం చేయనివాడు కృతఘ్నుడు. అలాంటివాడు చస్తే నక్కలు కూడా ఆ శవాన్ని చూడవు. నా ధనుష్టంకారం వినాలని ఉందా? నా బాణం దెబ్బ రుచి చూస్తావా? నాతో ఎందుకు స్నేహం చేశావో, ఎందుకు వాలిని చంపించావో, ఎందుకు సీతకోసం మాటిచ్చావో – అవన్నీ విస్మరించావు. స్త్రీలతో కులుకుతున్నావు. తాగి తందనాలాడుతున్నావు. ఇక్కడ నేను దుఃఖంలో ఉన్నాను. దైన్యంలో ఉన్నాను". తమ్ముడా సౌమిత్రీ నా కోపం సుగ్రీవునికి తెలుసు. ఇంకా ఇలా చెప్పు.

**నచ సంకుచితః పంథా యేన వాలీ హతో గతః ।**
**సమయే తిష్ఠ సుగ్రీవ మా వాలి పథమన్వగాః ॥**

"చచ్చిన వాలి పోయిన దారి ఇంకా మూతపడలేదు. ప్రతిజ్ఞ నిలబెట్టుకో. సుగ్రీవా! వాలి అనుసరించిన దారిలో పోవద్దు. ఆడిన మాట తప్పితే నిన్ను ఒక్కణ్ణే కాదు సబాంధవంగా సంహరిస్తాను".

"తమ్ముడా! ఇది మన స్థితి. ఎలా మాట్లాడితే మేలు జరుగుతుందో – అలా మాట్లాడు. కాలం అతిక్రమించి పోతోంది. ఆలస్యం చేయకు. త్వరగా పో".

## కిష్కింధకు లక్ష్మణుడు

రాముడు విరహంతో దీనుడైనాడు. ఖిన్నుడైనాడు. మాట మరిచాడు మిత్రుడు. కుపితుడైనాడు సౌమిత్రి. ఆలోచించాడు. అంటున్నాడు రామునితో "అన్నా! సుగ్రీవుడు స్నేహఫలం



అనుభవిస్తున్నాడు. ఇక వాడికి సుఖం ఉండదు. భోగాలుండవు. రాజ్యలక్ష్మి ఉండదు. నీవు ఎందుకు? వాణ్ణి వాలి దగ్గరకి నేనే పంపేస్తాను. సీతాన్వేషణకు అంగదుడు వెడతాడు'' – కోపావేశం ఆపుకోలేకపోయాడు. రణావేశపరుడైనాడు. ధనుర్బాణాలు చేతపట్టాడు. ఒక్క ఉదుటన లేచాడు. చూశాడు రాముడు.

''లక్ష్మణా! నాయనా నీవు బుద్ధిమంతుడవు. సత్ప్రవర్తన కలవాడవు. తొందరపడకు. మిత్ర వధ పాపకృత్యం. ఆ పాపాన్ని తలకెత్తుకోవద్దు. కోపాన్ని ఆవేశాన్ని వివేకంతో అణచుకో. అపుడే వాడు వీరుడవుతాడు. సుగ్రీవునితో పరుషంగా మాట్లాడకు. అతని మనసు నొప్పించకు. సౌమ్యంగా మాట్లాడు''.

తలూపాడు సౌమిత్రి. నడిచాడు. కిష్కింధవైపు వెళ్ళాడు. అతని మనసు నిండా శోకం. క్రోధం. రెండూ ఒక్కసారి మిళితమైనాయి. క్రోధాగ్ని ప్రజ్వరిల్లింది. సుగ్రీవుని మీద అసంతృప్తి. దారిలో మద్దిచెట్లు చూశాడు. విరిచాడు. తాటిచెట్లు చూశాడు. నడతోశాడు. పెద్ద పెద్ద అంగలు వేస్తున్నాడు. వేగంగా నడుస్తున్నాడు. గజరాజు వెడుతుంటే పాదాల కింద పడిన బండరాళ్ళు ముక్కలైనట్లు – కోపోద్రేకంతో వెడుతున్నాడు.

అది రాజభవనం. చుట్టూ దట్టమైన కొండలు. మధ్య నగరం. వానర వీరులు కనిపించారు. వాళ్ళు నగర రక్షకులు. సౌమిత్రి పెదవులు వణుకుతున్నాయి. చూశారు వాళ్ళు. ఎవరో శత్రువు అనుకున్నారు. బండరాళ్ళు చేతపట్టారు. చెట్లు పెళ్ళగించారు. చేతబట్టారు. చూశాడు లక్ష్మణుడు. అతని కోపం రెండింతలైంది. భగభగ మండే అగ్నిజ్వాలలా ఉన్నాడు. భయపడ్డారు వానర వీరులు. గజగజ వణికారు. నలుదిక్కులా పారిపోయారు. కొందరు సుగ్రీవుని దగ్గరికి వెళ్ళారు. లక్ష్మణుని రాక చెప్పారు. కామ పారవశ్యంలో ఉన్నాడు కపిరాజు. ఆ మాటలు వినిపించుకోలేదు.

వానర సచివులు వచ్చారు. వాళ్ళు బలశాలురు. చేతుల్లో చెట్లున్నాయి. చూశాడు సౌమిత్రి. సుగ్రీవుని ప్రమత్తత రాముని దుఃఖం మనసులో మెదిలాయి. రోషం వచ్చింది. నిట్టూర్చాడు. కనులు అగ్నిజ్యోతులైనాయి. పొగ చేరిన అగ్నిలా ఉన్నాడు.

## మేలుకొలుపు

వచ్చాడు అంగదుడు. చూశాడు లక్ష్మణస్వామిని. భయపడ్డాడు. వణికిపోయాడు. అంగదుణ్ణి చూశాడు. పిలిచాడు. ''నాయనా! సుగ్రీవుని దగ్గరికి పో. నా రాక చెప్పు. రాముని తమ్ముడు వచ్చాడను. అన్నగారి కోసం పరితపిస్తున్నాడు. వాకిట నిలుచున్నాడు అని చెప్పు. చెప్పింది తలకెక్కిందా లేదా గమనించు. తిరిగిరా. (నేను లోపలికి రావాలా అతడే బయటికి వస్తాడా తెలుసుకొనిరా)

విన్నాడు అంగదుడు. కలత చెందాడు. ముఖం వాడిపోయింది. వెనక్కి తిరిగాడు. దిగులుగా నడిచాడు. అంతలో భయం వేసింది. పరుగు పరుగున వెళ్ళాడు. సుగ్రీవుని చేరాడు. అతని పాదాలపై పడ్డాడు. తారకు రుమకు నమస్కరించాడు.

వానర రాజు చూడలేదు. తాగిన కైపు దిగలేదు. నిద్ర మత్తు వీడలేదు. తేరుకోలేదు. ద్వారం వద్ద సౌమిత్రిని చూశారు వానరులు. ఉగ్రరూపం చూశారు. భయపడ్డారు. దిక్కు తోచలేదు. సింహనాదాలు చేశారు. అవి పిడుగుపాటులా ఉన్నాయి. భయంకరంగా ఉన్నాయి. ఆ ధ్వని సుగ్రీవుని చెవులకి సోకింది. కనులు తెరిచాడు. తెలివిలోకి వచ్చాడు. చింతనిప్పుల్లా ఉన్నాయి కన్నులు. మెడలో హారాలు చెదరి ఉన్నాయి. అంగదునితో వచ్చారు ఇద్దరు. వారు వానర ప్రముఖులు. సుగ్రీవునికి ముఖ్యులు. ప్లక్షుడు, ప్రభావుడు వారి పేర్లు. వానర రాజు దగ్గరికి వెళ్ళారు. మాటలతో ప్రసన్నుణ్ణి చేసుకున్నారు. అంగదుని మేలుకొలుపు విఫలమైంది. వానర ముఖ్యులు సఫలీకృతులైనారు. లేచాడు సుగ్రీవుడు. నడిచాడు. అడుగులు తడబడ్డాయి. ఆసనం మీద కూర్చున్నాడు.

''రాజా! రామలక్ష్మణులు సత్పురుషులు. సత్యసంధులు. మనకు ఆప్త మిత్రులు. రాజకుమారులు. నీకు రాజ్యం ఇప్పించారు. రాముని తమ్ముడు లక్ష్మణుడు వచ్చాడు. ధనుర్ధారియై ఉన్నాడు. వాకిట నిల్చున్నాడు. మన వానరులు గజగజ వణుకుతున్నారు. రాముడు ఏదో సందేశం పంపాడు. సౌమిత్రి అంగదుని పంపాడు. నీవు లేచి వెళ్ళు. లక్ష్మణునికి శిరసా ప్రణమిల్లు. అతని రోషం చల్లార్చు. రాముడు ఏం చెప్పాడో అదే చెయ్. సత్యవాది అనిపించుకో. ప్రతిజ్ఞ నిలుపుకో.

## హనుమ హితవు

వానర ప్రముఖులు చెప్పారు. విన్నాడు సుగ్రీవుడు. ఆందోళన చెందాడు. కర్తవ్యం ఆలోచించాడు, మంత్రులన్ని పిలిపించాడు. 'రామ లక్ష్మణులు నాకు ఆప్తులు. చెడుగా ఒక్క మాట అనలేదు. కించిత్ అవకాశం చేయలేదు. ఇపుడు నామీద కోపమెందుకు? దుర్మాత్ములెవరో శత్రువులెవరో ఉన్నారు. లేనిపోనివి కల్పించారు. లక్ష్మణునికి చెప్పి ఉంటారు. మీరు కుశాగ్ర బుద్ధులు. లక్ష్మణుని ఆంతర్యం తెలుసుకోండి. కోప కారణం తెల్సుకోండి. రాముడంటే నాకు భయం లేదు. లక్ష్మణుడంటే నాకు భయం లేదు.



అన్నదమ్ముల అకారణ కోపమే – నాలో భయాన్ని కలిగిస్తోంది. ఆందోళన కల్గిస్తోంది''.

**"సర్వధా సుకరం మిత్రం దుష్కరం పరిపాలనం ।**
**అనిత్య త్వాచ్చ చిత్తానాం ప్రీతిరల్పేపి భిద్యతే ॥**

స్నేహం చేయడం సులభం. స్నేహాన్ని కాపాడుకోవటం కష్టం. చిత్తవృత్తులు అతి చంచలాలు. ఏ కొంచెం తేడా వచ్చినా స్నేహం చెడిపోతుంది. రాముడు మహాత్ముడు. నాకు చేసిన ఉపకారం గొప్పది. తగిన ప్రత్యుపకారం చేయలేకపోతున్నాను. అదే నా భయం''.

అలా అన్నాడు సుగ్రీవుడు. వానర మంత్రుల్లో హనుమంతుడు లేచాడు. అంటున్నాడు "వానరేశ్వరా! శుభకరుడు ఉపకారీ రాముడు. పరాక్రమవంతుడు. దేవేంద్ర సమానుడు. వాలిని చంపాడు రాముడు. ఆ మిత్రుణ్ణి నీవు మరువలేవు. కాని స్నేహం వల్లనే కోపించాడు రాముడు. లక్ష్మణుడు లక్ష్మీవర్ధనుడు. అందుకే నీకోసం పంపాడతణ్ణి. వర్షాకాలం ఎపుడో పోయింది. శరత్కాలం వచ్చేసింది. నీవు సుఖలోలుడవైనావు. కాలాన్ని గుర్తించలేదు. సీతాన్వేషణకి సమయం ఆసన్నమైంది. ఆ విషయం విస్మరించావు. అందుకే లక్ష్మణుడు వచ్చాడు. రామునికి భార్య లేదు. ఆర్తితో ఉన్నాడు. ఇపుడు సౌమిత్రి పరుషంగా మాట్లాడవచ్చు. ఓర్చుకోవాలి నీవు. కారణం తప్పు చేశావు. అపరాధివి నీవు. వెంటనే వెళ్ళు. లక్ష్మణున్ని చూడు. అంజలి ఘటించు. ప్రసన్నుణ్ణి చేసుకో. ఇంతకన్నా మరో దారి లేదు''.

"మేం మంత్రులం. రాజుల హితం కోరేవాళ్ళం. నేను నిర్భయంగా చెప్పాను. సత్యం చెప్పాను. నా నిశ్చితాభిప్రాయం చెప్పాను. అది కఠినంగా వుండొచ్చు. నీవు వినాలి తప్పదు. రామునికి కోపం వస్తే – కోదండం పిడికిట పట్టితే దేవతలు అసురులు సైతం జగత్తు అంతా అతడి వశమవుతుంది. ఉపకారం పొందినవాడు కోపం తెప్పించరాదు. రాజా! నీ పుత్రుడు అంగదునితో బంధువులతో మిత్రులతో వెళ్ళు. రామునికి శిరసా ప్రణమిల్లు. చేసిన ప్రతిజ్ఞ చెల్లించుకో. రామలక్ష్మణులు ఆజ్ఞాపిస్తారు. వాటిని మనసులో కూడా ఉల్లంఘించవద్దు. వారి మానుష బలం నీకు తెలియనిది కాదు''.

హనుమంతుని ఆలోచనా విధానం, మాట్లాడిన తరువాత ఆలోచిస్తే – దాన్ని అజ్ఞానమంటారు. ఆలోచన చేసిన తర్వాత మాట్లాడితే అది జ్ఞానం. మాట అనేది చనిపోయేవాళ్ళని బతికించేలా ఉండాలి. బతికినవాళ్ళని చంపేలా ఉండరాదు. ఒక్కోసారి కోపించిన వాళ్ళని శాంతపరిచేలా ఉండాలి మాట. ఆ కోపాన్ని ద్విగుణీకృతం చేసేలా ఉండరాదు. ఏ పనైనా అలా చేయాలో ఇలా చేయాలో అని ఆలోచించరాదు. ప్రతి పని భగవదారాధనగా చేయాలి. ఆశించకపోయినా అది సత్ఫలితాన్ని ఇస్తుంది. ప్రత్యుపకారం చేయకపోతే చట్టం శిక్షించదు. ధర్మం శిక్షిస్తుంది. అది ఇపుడే శిక్షించవచ్చు. కాలాంతరంలో శిక్షించవచ్చు.

## ధనుష్టంకారం

లక్ష్మణుని ఆహ్వానించాడు అంగదుడు. కిష్కింధలోకి సౌమిత్రి అడుగుపెట్టాడు. ద్వారపాలకులు మహాకాయులు. బలశాలురు. చూశారు సౌమిత్రిని. భయపడ్డారు. దూరం జరిగారు. అంజలి ఘటించారు. రాజవీధిలో నడుస్తున్నాడు లక్ష్మణుడు. నగరమంతా రత్నమయం. ఆకర్షణీయం. అందమైన వీధులు. అంగళ్ళు, ఫలపుష్ప వృక్షాలు. వానరులు అందరూ కామరూపులు. దివ్యాలంకార భూషితులు. అంగద జాంబవంతాది కపి ప్రముఖుల భవనాలు. చూశాడు సౌమిత్రి. నగర వర్ణన అద్భుతంగా వర్ణించాడు వాల్మీకి. అవి 20 శ్లోకాలు. సుగ్రీవుని భవనం ముందు ఆగాడు. వానర స్త్రీలు చక్కని చుక్కలు. ఎవరి పనుల్లో వారున్నారు. అటు ఇటు తిరుగుతున్నారు. కాని అందెల సవ్వడులు విన్నాడు. వడ్డాణాల గలగలలు విన్నాడు. సిగ్గుపడ్డాడు. భవనంలోకి వెళ్ళలేకపోయాడు. సంకోచించాడు. ఆడవాళ్ళ సొమ్ముల చప్పుళ్ళు – కోపం తెప్పించాయి. దూరంగా పోయాడు. ఏకాంత స్థలంలో నిలిచాడు. ఉగ్రుడైనాడు. ధనుష్టంకారం గావించాడు. ఆ శబ్దానికి దిక్కులు అదిరాయి. సుగ్రీవుడు విన్నాడు. ఉలిక్కిపడ్డాడు. లేచాడు. లక్ష్మణుడు వచ్చాడు అనుకున్నాడు. ముఖం వెల వెల పోయింది. గొంతు తడారిపోయింది. కలవర పడ్డాడు. ఏం చేయాలో తోచలేదు. కాసేపు తర్కించుకున్నాడు. ఎదురుగా తార కనబడింది. పిలిచాడు. అంటున్నాడు.

"సుందరీ! రాముని తమ్ముడు లక్ష్మణుడు వచ్చాడు. అతడు మృదుస్వభావుడు. ఇపుడు కోపంతో ఉన్నాడు. సాధారణంగా కోపిష్ఠి కాదు. కోప కారణం తెలియదు. మనం ఏమైనా తప్పు చేశామా? ఆలోచించు. లేదా నువ్వు వెళ్ళు. అతనితో మాట్లాడు. చల్లని మాటలు చెప్పు, శాంతపరచు. ఆ పని నువ్వే చేయగలవు. నిన్ను చూస్తాడు. ప్రసన్నుడవుతాడు.

**నహి స్త్రీ షు మహాత్మానం క్వచిత్ కుర్వంతి దారుణమ్**

మహాత్ములు స్త్రీ పట్ల దారుణంగా ప్రవర్తించరు. సౌమిత్రి శాంతించాక – నేను వస్తాను. శత్రు సంహార దక్షుడు. కమల పత్రాక్షుడు అయిన లక్ష్మణున్ని దర్శిస్తాను''. **(సశేషం)**

ధారావాహికం



శ్రీ పద్మపురాణాంతర్గత

# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా|| విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

## బ్రహ్మ పురాణాంతర్గతము

సూతమహర్షి శౌనకాది మునులతో ఇలా అన్నాడు– పూర్వం దూర్వాసమహర్షి దిలీప మహారాజు గృహానికి వేంచేశాడు. ఆయనకు శ్రీరంగ మాహాత్మ్యము, శ్రీముష్ణక్షేత్ర వైభవాన్ని చెప్పాడు. అది విని దిలీపుడు ఆదరంతో శ్రీవేంకటాచల మాహాత్మ్యాన్ని చెప్పుమని ఇలా అడిగాడు– మహర్షీ ! దయాసముద్రా! భారత దేశంలో భగవానుడు స్వయంగా వెలసిన ఎనిమిది దివ్య క్షేత్రములలో శ్రీరంగము, శ్రీముష్ణ క్షేత్ర వైభవాన్ని తెలియజేశారు. ఇప్పుడు మిక్కిలి శ్రేష్ఠమైనది, శ్రీహరి వేంకటేశ్వరునిగా సాన్నిధ్యము చెందినది అయిన వేంకటాచలమనే క్షేత్ర మాహాత్మ్యాన్ని, వైభవాన్ని, భగవదవతార కారణాన్ని, దానిలోని తీర్థముల వివరములను, దాని ప్రసిద్ధిని గూర్చి నాకు దయతో వివరించండి.

దిలీపుడు ఈ విధంగా అడుగగా దుర్వాసమహర్షి రాజా ! వేంకటాచల వైభవాన్ని, ఆ పర్వతం ఆవిర్భావం మహాత్ముడైన దేవదేవుని వైభవాన్ని గురించి చెబుతాను శ్రద్ధగా విను.

మేరోః పుత్రో మహాశైలో జాంబూనద నదీతటే ।
యోజనత్రయ విస్తీర్ణః త్రింశద్యోజన మాయతః ॥
వేంకటేతి కృతం నామ పిత్రా తస్య మహాత్మనః ।
అమృతస్యేం దిరాయాశ్చ యతో విస్తార కారకః ।
జీవానాం భారతే వర్షే తతో–యం గుణనామకః ।

–బ్రహ్మపురాణం. అధ్యాయం. 1– శ్లో. 6–8.

సువర్ణముఖరీ నదీ తీరంలో మూడు యోజనాల విస్తీర్ణము (24మైళ్ళు) ముప్పది యోజనాల పొడవు (240 మైళ్ళు) గల మేరు పుత్రుడైన గొప్ప పర్వతం ఉన్నది. ఆ పర్వతానికి తండ్రి 'వేంకటు'దని నామకరణం చేశాడు. 'వేం' అనగా అమృతమని, 'కట'మనగా ఐశ్వర్యమని అర్థం. భారతదేశంలోని ప్రజలందరకు ఇహపరసుఖముల నిచ్చునదగుటచే దానికాపేరు సార్థకమైనది. దోషరహితుడైన నారాయణునికి నివాస స్థానమగుటవలన దీనిని 'నారాయణాద్రి' అంటారు. దీనిని సేవించేవారికి ధర్మబుద్ధిని కలిగించుట వలన, ధర్మమును భరించుట వలన, పోషించుట వలన దీనిని 'వృషాద్రి', అని, వృషభాద్రి అని వ్యవహరిస్తారు. (వృష, వృషభ శబ్దాలకు ధర్మమని అర్థం ప్రసిద్ధం) అంజనాదేవి ఈ పర్వతంపై హనుమంతుని ప్రసవించుట వలన దీనిని శేషాద్రి' అంటారు. శేషునితోపాటు రావడం వలన కూడ శేషాద్రి అయింది. అని దూర్వాస మహర్షి చెప్పగా దిలీపుడు ఓ మహాప్రాజ్ఞా! ముని శ్రేష్ఠా ! ఈ పర్వతము ఆదిశేషునితో పాటు వచ్చిందన్నారు. అలా ఎందుకు జరిగింది ? నాకు దానిని వినాలని కుతూహలంగా ఉన్నది కాబట్టి ఆ విషయాన్ని వివరంగా తెలియజేయండి అని అడిగాడు. అప్పుడు దూర్వాసమహర్షి దిలీపునకు శేషాచల వృత్తాంతాన్ని ఇలా చెప్ప నారంభించాడు.

**వాయు, శేషుల కలహము :**

పూర్వం ఒకానొకప్పుడు శేషశాయి అయిన

శ్రీమన్నారాయణుడు క్షీరసాగరంలోని బ్రహ్మానందవనంలోగల అంతఃపురంలో లక్ష్మీదేవితో సరససల్లాపాలాడుతూ, ఏకాంతంలో క్రీడిస్తూ, జరుగబోయే విషయాన్ని గురించి ఆలోచిస్తూ, శేషుని అంతఃపుర ద్వారం వద్ద ఉండమని ఆదేశించాడు. భూభారాన్ని వహించగల సమర్థుడైన ఆదిశేషుడు భగవదాజ్ఞానుసారం అంతఃపుర ద్వారంలో నిలబడి తనను భగవానుడు నియమించుట వలన తాను అందరికంటే గొప్పవాడనని, మహాబలవంతుడనని గర్వంతో ప్రకటించు కొన్నాడు.

ఇంతలో వాయు దేవుడు క్షీరసాగర శయనుని దర్శించడానికి అక్కడకు వచ్చాడు. శేషుడు బలానికధిదేవతయైన వాయుదేవుని అడ్డగించాడు. "ఓ వాయుదేవా ! శ్రీహరి అంతఃపురంలోకి వెళ్ళడానికిది సమయంకాదు. నీ స్థాయి నీకు తెలియదు. ఇంతకు ముందు నీ వెక్కడ ఉన్నావు? మూడు ప్రాకారాలు దాటి అంతఃపురంలోకి ఎలా వచ్చావు?" అని శేషుడు ప్రశ్నించగా వాయుదేవుడు "ఆది శేషా! నీకే నీ అర్హత తెలియడం లేదు. నీవు విచక్షణ లేకుండా మాట్లాడుతున్నావు" అన్నాడు.

అప్పుడాదిశేషుడు "నేను సర్వవ్యాపకుడైన భగవంతునికి అత్యంత సన్నిహితుడను. నేనెప్పుడను. ఆయన సన్నిధానంలోనే ఉంటాను. నేనా యనకు ఆంతరంగిక భక్తుడను. నీవు యజ్ఞారాధ్యుడైన శ్రీమహావిష్ణువుకు సేవకుడవు. కేవలం భృత్యుడవు. నావలె ఆత్మయుడవు కావు. నీవు నాతో సమానుడవు కావు. కావున నీవు ద్వారంలోనే ఉండు!" అన్నాడు. అదివిని వాయుదేవుడు వాయుభక్షకుడైన శేషునితో నవ్వుతూ ఇలా అన్నాడు.

"ఆదిశేషా ! ప్రభువు యొక్క దాస దాసీ జనులు, పరిచారకులు మొదలైన వారిని మిత్రులన్నంతమాత్రాన వారంతా స్వామికి సన్నిహితులు కారు. పిల్లి ఇంట్లో ఉన్నప్పటికీ అది బయట ఉండే ఏనుగుతో సమానం కాదు గదా ! నేనెవరినో, ఎంతటి వాడనో నీకు తెలియదు. సకల జీవులకు ప్రాణాన్ని నేనే. అందరినీ బ్రతికించేది నేనే. నా వల్లనే సర్వప్రాణులు జీవిస్తున్నాయి. కాబట్టి నేనే అందరికీ ప్రభువును, ఈశ్వరుడను. బలంలోకాని, జ్ఞానంలో కాని, వైరాగ్యంలో కాని, విష్ణుభక్తిలోకాని నాతో సమానమైన వారెవరూ లేరు. నేను ఎల్లప్పుడు సాక్షాత్తుగ శ్రీమహావిష్ణువు అనుగ్రహానికి పాత్రుడను. కాబట్టి నీవు మర్యాదగ ప్రవర్తించు. అధిక ప్రసంగం చేయకు".

వాయుదేవుడు ఇలా అనగానే కోపోద్రిక్తుడైన ఆదిశేషుడు "వాయుదేవా! గొప్పలు చెప్పుకోవడమెందుకు? మన ఇద్దరిలో ఎవరు బలవంతులో పరీక్షించి చూద్దాము. అప్పుడు మన బలాబలాలు బయటపడతాయి" అని శేషుడు చెప్పగా వాయుదేవుడు "మనిద్దరి సామర్థ్యాన్ని ఎలా పరీక్షిస్తావు? మన బలాబలాలను ఎవరు నిర్ణయిస్తారు ? దానికి మార్గమేమిటో చెప్పు" అన్నాడు.

**బలపరీక్ష** : వాయు శేషులీ విధంగా వాదించుకొంటుండగా ఇంతలో అక్కడకు శ్రీహరి విచ్చేసి "ఏమిటిది?" అని అడిగాడు. అప్పుడు శేషుడు జరిగినదంతా వివరంగా చెప్పాడు. అంతట భగవానుడు జరుగబోవు కార్యాన్ని మనసులో సంకల్పించుకొని శేషునితో ఇలా అన్నాడు.

"ఆదిశేషా! ప్రాణి కోటికి అంతరాత్మ, అంతర్యామి, బలానికి అధిదేవత అయిన వాయుదేవుడు నాకుకూడ ఆంతరంగికుడే. కాబట్టి వాయుదేవుడే గొప్పవాడని నా అభిప్రాయం. నీవు లోకాలను భరిస్తున్నానని చాలా గర్వపడుతున్నావు. కాని నిన్ను కూడ ఆదికూర్మం మోస్తున్న విషయం మరచినావు" అని భగవానుడు మందలించగా ఆదిశేషుడు భగవానుని అభిప్రాయమును తెలుసుకొని ఇలా విన్నవించుకున్నాడు.

"ప్రభూ! మా ఇరువురి బలాబలాలను పరీక్షించండి. మీరే స్వయంగా చూసి ఎవరు బలవంతులో నిర్ణయించండి ఈ కనపడే పర్వతం నాచే పాలించబడుతున్నది. మిక్కిలి బరువు కలది. ఈ పర్వతము మేరువుపుత్రుడు. మహా పుణ్యాత్ముడు. సువర్ణముఖరీ నదీతీరంలో మూడు యోజనాల వెడల్పు, ముప్పది యోజనాల పొడవున విస్తరించి ఉన్నాడు. నేను దానిని నా శరీరంతో గట్టిగా చుట్టి బంధించి త్రాటితో కట్టి వేసినట్లు గట్టిగా పట్టుకుంటాను, అప్పుడా పర్వతాన్ని వాయువు కదలించినచో అతడు నాకంటె బల వంతుడని నేను అంగీకరిస్తాను. ఇది సత్యం. ప్రమాణంగా చెబుతున్నాను. సందేహంలేదు" అని శేషుడు మిక్కిలి గర్వంతో ప్రతిజ్ఞ చేయగా భగవానుడు వాయుదేవుని వంక చూశాడు. భగవానుని మనోగతాభిప్రాయాన్ని తెలుసుకొన్న వాయువు భగవంతునిచే ప్రేరేపించబడి శేషునితో సరే అలాగే కానిమ్ము అన్నాడు.

అప్పుడు శేషుడు భూలోకానికి వచ్చి శుభప్రదమైనది, మేలిమిబంగారు ఛాయగలది, రత్నసానువులు కలది, మనోహరమైనది, మేరు పర్వతానికి దక్షిణదిక్కున స్వర్ణ నదీతీరంలో మేరు పుత్రుడు, మహాపుణ్యప్రదము అయిన వేంకటాచలాన్ని దర్శించాడు.

ఆ తరువాత మేరు పర్వతాన్ని, వేంకటాద్రిని రెండింటిని కలిపి చుట్టచుట్టి మహాక్రోధంతో బుసకొడుతూ, తన అవయవాలన్నింటితో గట్టిగా బంధించి వాయువుతో "నీకు శక్తి ఉంటే ఇప్పుడే పర్వతాన్ని లేవనెత్తు" అన్నాడు. అప్పుడు వాయువు బల గర్వంతో, నిర్లక్ష్యంగా తన కాలి బొటన వ్రేలితో వేంకట పర్వతాన్ని కదలించాలని చూశాడు. శేషుడు బిగబట్టిన పర్వతాన్ని అంత సులభంగా కదలించలేనని భావించిన వాయువు తన చేతులతో దానిని ఎత్తటానికి ప్రయత్నించాడు. కాని రెండు చేతులతో కూడ దానిని గట్టిగా పట్టినా దానిని కొంచెం కూడ కదల్చ లేకపోవడంతో అతనికి గర్వభంగమైంది. తనకు పరాజయం వలన అపకీర్తి వస్తుందని భయపడ్డాడు వాయువు.

బ్రహ్మాండాన్నంతా పూరించే వాయువు కదలించుటలోను,

ఆర్పివేయుట లోను తనకుగల శక్తినంతా వినియోగిస్తూ స్థావర జంగమాత్మకమైన చరాచరజగత్తును కదలించివేశాడు. కాని ఆ పర్వతం మాత్రం కదల లేదు. అప్పుడు బ్రహ్మాది దేవతలంతా బ్రతిమాలినా వాయువు తన పంతాన్ని వీడలేదు. అంతట వారు శేషుని తన పట్టు సడలించమని అనునయంగా చెప్పారు. వెంటనే శేషుడు కొంచెం తగ్గి తన పడగల బిగువును కొంత సడలించాడు.

అదే అవకాశంగా వాయుదేవుడు విజృంభించి మహావేగంతో ఆ సందులలో దూరి క్షణంలో ఆ పర్వతాన్ని దూది పింజనువలె ఆకాశంలో ఎగురవేయగా అది లక్షన్నర యోజనాలకీ దూరందాటి దక్షిణసముద్రానికి ఉత్తరంగా ముప్పై రెండు యోజనాలదూరంలో, తూర్పు సముద్రానికి పశ్చిమాన, పవిత్రమైన సువర్ణ ముఖరీ తీరంలో వాయు వేగంతో చుట్ట చుట్టుకొన్న ఆది శేషునితో పాటు పడిపోయింది. మహా బలవంతుడైన వాయుబలానికి ఆ పర్వతం వెయ్యి ప్రక్కలైంది. అది చూసిన మేరువు తన పుత్రుని మేలుకోరి వాయుదేవుని ఇలా ప్రార్థించింది– "జగదాధారా! రక్షించు. రక్షించు. నాకు పుత్ర భిక్షపెట్టు. నాబిడ్డ నిరపరాధి. నీకు అపచారం చేసింది శేషుడేకాని నా బిడ్డ కాదు. కావున వానిని శిక్షించవద్దని" ప్రార్థించగా వాయువు "సరే నీ పుత్రుని రక్షిస్తా"నన్నాడు. తానుకూడా ఆ పర్వతంలో ప్రవేశించి దానిలో కూడ క్రిందపడ్డాడు. వాయువు ఆవేశించుటవలన దీనిని 'అంజనాద్రి' అంటారు. శేషుడు కూడ శిథిల దేహుడై ఆ పర్వతంతో పాటు క్రింద పడ్డాడు.

## వేంకటాద్రిలో శేషుని తపస్సు :

దిలీపుడు దూర్వాసునితో "ఓమహర్షీ! దేవదేవుడైన శ్రీమన్నారాయణుడు వైకుంఠమును వీడి వేంకటాద్రిపై నివసించుటకు కారణమేమిటి ? చెప్పండి. నాకు తెలుసుకోవాలని కుతూహలంగా ఉంది. అని అడిగాడు అప్పుడు దూర్వాస మహర్షి ఈ విధంగా చెప్పసాగాడు – "మహారాజా! ఆ తరువాత శేషుడు గర్వము భంగము కాగా పశ్చాత్తాపంతో ఆ పర్వతంపైన స్వామిపుష్కరిణికి వాయవ్య దిక్కున మనోహరమైన నాగతీర్థంలో, అనేక చరియలతో కూడినది. పలురకాల వృక్షాలతో అలంకరించబడిన పవిత్రమైన ఉత్తర శిఖరంలో జగత్ప్రభువైన భగవంతుని సాన్నిధ్యమును కోరి వెయ్యి దివ్యసంవత్సరాలు ఘోరమైన తపస్సు చేశాడు. అతని తపస్సుకు మెచ్చి భగవంతుడు ప్రత్యక్షమై వరం కోరుకోమన్నాడు. అప్పుడు శేషుడు భగవంతునితో ఇలా విన్నవించుకున్నాడు, నీవ నుగ్రహించినచో నాకీ విధంగా వరం ప్రసాదించు దేవా!"

"యథాశేతే మదఙ్కేత్వం వైకుంఠే భువనోత్తమే!
శైలాకారేచ మద్దే హా నిత్యమత్ర వస ప్రభో! ॥

బ్రహ్మ. పు. అ. 2. శ్లో. 6, 7.

"శ్రీవైకుంఠంలో నీవు నా శరీరమును శయ్యగా చేసుకొని పవళించినట్లే, పర్వతరూపంలో ఉండే నా ఈ శిలామయమైన శరీరంపై ఎల్లప్పుడు నివసించు" అని శేషుడు ప్రార్థించగా భగవానుడిలా వరమిచ్చాడు.

"ఆదిశేషా! పూర్వం నేను భూలోకంలో నివసించాలని సంకల్పించి అందుకు తగిన స్థానం కొరకు విచారిస్తుండుగా అంతలో నారదమహర్షి వచ్చాడు. నేనతనిని చూచి నీవెక్కడనుంచి వస్తున్నావని అడిగాను అప్పుడతను "నేను భూగోళమంతా చూచి వస్తున్నా"నన్నాడు. వెంటనే నేను భూలోకంలో నివసించుటకు తగిన స్థానమేది?" అని అడిగాను అప్పుడు నారదమహర్షి ఇలా చెప్పాడు.

అస్తి కర్ని ర్గిరివరో వేంకటాభ్యో మనోహరః ।
త్రింశద్యోజన మాయామి యోజనత్రయ విస్తృతః ।
అష్టోత్తర సహస్రేణ తీర్థ వర్యైశ్చ శోభితః ॥

–బ్రహ్మ. పు. అ. 2. శ్లో. 11,12.

"ప్రభూ! మేరు పర్వతానికి దక్షిణంవైపున, సువర్ణ ముఖరీ నదీ తీరంలో 'వేంకటమనే మహా పర్వత మొకటి ఉన్నది. అది చాల మనోహరమైనది. అది మూడు యోజనాల పొడవు, ముప్పది యోజనాల వెడల్పు కలిగి ఉంది. ఆ దివ్య పర్వతం వెయ్యి ఎనిమిది దివ్యతీర్థాలతో విరాజిల్లుతున్నది. ఆ ప్రదేశము వైకుంఠం కంటే కొంచెం చిన్నది. అయినప్పటికీ సుందరాతి సుందరమైన ఆ రమ్య ప్రదేశం మీరు లక్ష్మీదేవితో విహరించుటకు చాల అనుకూలంగా ఉంటుంది. మీకు అదే నివసించుటకు యోగ్యమైన స్థానము! కావున ఓ లక్ష్మీనాథా! మీరక్కడ నివసించండి" అన్నాడు.

"అప్పటినుండి నాకు ఆ వేంకటాద్రికి వెళ్ళాలని కుతూహలంగా ఉంది. ఇంతలో మీ ఇరువురికి వివాదం రావడం వలన ఆ పవిత్రమైన పర్వతమే ఇక్కడకు వచ్చింది. నీవు కూడా తపస్సుచేసి నన్ను ఇక్కడ నివసించమని ప్రార్థించావు పూర్వం నేను సంకల్పించినట్లే నీవు వరం కోరావు. 'తథాస్తు! అట్లే అగుగాక!" అని భగవానుడు శేషునికి వరం ప్రసాదించాడు. ఆ కారణంగా శ్రీ మహా విష్ణువు వైకుంఠమును వదలి భూలోకానికి వచ్చి వేంకటాద్రిపై స్వామి పుష్కరిణీ తీరంలో లక్ష్మీదేవితో క్రీడిస్తూ ఆనందంగా ఉన్నాడు" అని దూర్వాస మహర్షి చెప్పాడు.

అప్పుడు దిలీపుడు "మహర్షీ! అనేకవృక్ష సమూహాలతో కూడిన ఆ దివ్య పర్వతంలో మొదట్లోను, మధ్యలోను, పైభాగంలోను అనేక పుణ్య తీర్థాలున్నాయి కదా! మనోహరాలైన పవిత్ర ప్రదేశాలు, అనేక చరియలున్నాయికదా! భగవానుడు వాటన్నిటిని వదలి స్వామి పుష్కరిణీ తీరాన్నే నివసించుటకు కారణమేమిటో నాకు వివరించండి" అని దూర్వాస మహర్షిని అడిగాడు. అప్పుడు దూర్వాస మహర్షి ఇలా చెప్ప నారంభించాడు.

"పూర్వం సరస్వతీదేవి తాను తీర్థాలన్నింటిలో గొప్పదానను కావాలనే కోరికతో బ్రహ్మావర్తంలో సరస్వతీనదిగా విలసిల్లింది. దాని తీరంలో తపస్సు చేయడానికి పులస్త్య మహాముని వచ్చాడు.

పుత్రుడనే భావంతో సరస్వతీదేవి అతనిని గౌరవించలేదు. అందులకతడు కోపించి "సరస్వతీ! నీకు నదీ రూపంతో నీ కోరిక సిద్ధించకుండుగాక!" అని శపించాడు. అంతేకాక "గుణ సాదృశ్యం ఉన్నప్పటికీ గంగానది విష్ణు పాదముల నుండి ఉద్భవించినది కావున ఆ నదే అన్ని నదులలో శ్రేష్ఠమైనదని ప్రసిద్ధి పొందుతుంది" అన్నాడు. పులస్త్యుడు ఈ విధంగా శపించగా సరస్వతి ఆ మహర్షికిలా ప్రతిశాప మిచ్చింది.

"నీ వంశము రాక్షస వంశమగుగాక! వారు విష్ణువుకు అపకారం చేయుదురుగాక పులస్త్యుడు ఆ శాపానికి భయపడి వేడుకోగా ఆమె శాంతించి శాపవిమోచనం చెప్పింది. మీ వంశంలో చివరిలో విభీషణుడనే విష్ణు భక్తుడు పుడతాడు అతను చిరంజీవియై కల్పాంతం వరకు ఉంటాడు మీ వంశాన్ని తరింప జేస్తాడు" అని చెప్పింది. ఆమె మరల తపస్సు చేసి, దేవ దేవుని మెప్పించగా ఆయన ప్రత్యక్షమయ్యాడు.

అంతట సరస్వతీదేవి భగవంతునిలా ప్రార్థించింది– "స్వామి! నేను లోగడ చేసిన తపస్సు పులస్త్యబ్రహ్మ శాపంవల్ల నిష్ఫలమై పోయింది. కావున ఓ పురుషోత్తమా, భూలోకంలోని తీర్థాలన్నింటిలో శ్రేష్ఠమైన దానిగా నాకు వరం అనుగ్రహించు" అనగా అప్పుడు భగవానుడు "సరస్వతీ! భయపడవద్దు. పులస్త్య బ్రహ్మ శాపం నదీ రూపానికే గాని పుష్కరిణి రూపానికి కాదుగదా! కావున నీవు శేషాద్రికి వెళ్ళు. నేను కూడ అక్కడే నివసించడానికి వస్తాను. నీవు ఆ పర్వతానికి దక్షిణంవైపున శిఖరంపై సుఖంగా ఉండు. స్వామి పుష్కరిణి అనే పేరుతో ప్రసిద్ధమౌతావు నీకు దక్షిణం వైపున నేను నివసిస్తాను. అప్పుడు ముల్లోకాలలోని మూడున్నర కోట్ల పుణ్య తీర్థాలు తమ పాప ప్రక్షాళనకై నన్ను ప్రార్థిస్తాయి. వాటికి నీయందు స్నానం చేయడం వలన పాపవిమోచనాన్ని ప్రసాదిస్తాను. ధనుర్మాసంలో, శుక్ల పక్షంలో ద్వాదశి నాడు సూర్యోదయానికి ముందు అరుణోదయ సమయంలో ఇక్కడకు స్నానం చేయుటకై వచ్చిన పుణ్య తీర్థాలన్నీ నీకు దాసురాండ్రై తీర్థాధిరాజ్యమునందు నిన్ను అభిషేకించగలవు" అని భగవంతుడు వరమిచ్చి ఆ పుష్కరణీ తీరంలోనే నివాసమేర్పరచుకున్నాడు.

ఆ తరువాత వకుళమాళిక అనే ఆమె, స్వామికి పాక కైంకర్యం చేసి, పరిచర్యలు చేయగా లక్ష్మీదేవి ప్రేరణచే భగవానుడు అనుగ్రహించి, తీర్థ భూములకాధిపత్యాన్ని ప్రసాదించాడు. అంతట వకుళమాలిక స్వామిని అక్కడే నివసించమని ప్రార్థించింది. ఈ విధంగా సరస్వతీ దేవి తీర్థరూపంలో వకుళమాలిక భూమి రూపంలోను ఉన్నారు.

**దేవస్య పాచికా కాచిత్ నామ్నా వకుళ మాలికా ।**
**వాణీ దేవీ తీర్థరూపా భూమిరూపా చ పాచికా ॥**

బ్రహ్మ. పు. అ. 2. శ్లో. 33,35.

ఇలా సముద్రుని భోగపత్నియైన కృష్ణవేణీ నదితో సమానంగా సరస్వతీ నది విరాజిల్లుతున్నది. శ్రీనివాసుడు శేషాద్రిపై, స్వామి పుష్కరిణి తీరంలో నివసించడానికి ఇదీ కారణమని దూర్వాస మహర్షి దిలీప మహారాజుకు చెప్పాడు.

## వాయుదేవునికి వరప్రదానం :

దిలీపుడు దూర్వాస మహర్షితో "ఓ మహర్షీ ! దేవతలలోను, ఋషులలోను, మనుష్యులలోను ఎవరెవరివలన ఎప్పుడెపుడు ఈ పర్వతానికి ప్రసిద్ధి కలిగిందో దానిని వివరంగా నాకు తెలియజేయండి! అని అడిగాడు. అపుడు దూర్వాసుడు ఇలా చెప్పనారంభించాడు. పూర్వం ఒకప్పుడు మహాతేజశ్శాలియైన వాయు దేవుడు సర్వప్రాణులకు ప్రధానాంగముగా కావలెననే కోరికతో వేంకటాద్రిపై తపస్సు చేశాడు. వెయ్యి దివ్య సంవత్సరాలు ఆ విధంగా తపస్సు చేయగా భగవానుడు సహస్ర భుజములతో సహస్ర శిరస్సులతో నీల మేఘశ్యాముడై సాక్షాత్కరించి "సకల ప్రాణులకు నీవు ప్రధానాంగంగా ఉంటావు" అని ఆ పురుషోత్తముడు వరమిచ్చాడు. ఇంకను ఇలా అన్నాడు – "నేను కూడా ఈ పర్వతం పైనే నివసిస్తాను. నీవు కూడా నాతోపాటే నివసించు. కుమారస్వామి తారకాసుర సంహారం వలన వచ్చిన దోషాన్ని పోగొట్టుకోవడానికి ఈ పర్వతంలోని కుమారధారాతీర్థంలో తపస్సు చేస్తాడు" అని చెప్పి భగవంతుడు అంతర్ధానమయ్యాడు.

పరమ శివుడు మొదలగు దేవతలకు నాయకుడైన చతుర్ముఖ బ్రహ్మ కూడా మహా తేజశ్శాలియైన వాయుదేవుని తపస్సుకు మెచ్చి వరాలిచ్చుటకై లక్ష్మీపతి వేంకటాచలానికి విచ్చేశాడని తెలుసుకొన్నాడు. వాయువు తపోబలం వలన శ్రీపతి ఈ పర్వతంలో సదా నివసిస్తాడని తెలుసుకొన్న బ్రహ్మ కూడా ఆ వేంకటాద్రిలో తపస్సు చేయనారంభించాడు. అలాగే ఆయన ఉపదేశం మేరకు చాలా మంది అక్కడ తపస్సు చేశారు. రుద్రాది దేవతలు సనకాది యోగులు, అగస్త్యాది మహర్షులు, శంఖుడు మొదలగు రాజులు ఆ వేంకటాద్రిలో దివ్య విమానంతో పాటు శ్రీనివాసుని దర్శించారు. ఈ విధంగా వాయువు మొదలైన దేవతలు, బ్రహ్మరుద్రాదులు, సిద్ధిని పొందగోరేవారంతా అక్కడ తపస్సు చేసి సిద్ధి పొందారు.

ఈ విధంగా ఈ పర్వతం దేవతలలో వాయువు తపస్సు వల్ల ప్రసిద్ధి చెందింది. అని దూర్వాసమహర్షి చెప్పగా దిలీపుడు "మహాత్మా! సరే మహర్షులలో దీనికి ఎలా ప్రఖ్యాతి కలిగింది?" అని అడిగాడు అంతట దుర్వాసుడు యిలా చెప్పాడు.

పూర్వం ఒకానొకప్పుడు అగస్త్య మహర్షి మలయాచలంలో దేవ దేవుని దర్శించుటకై తపస్సు చేస్తూ ఉండగా చతుర్ముఖ బ్రహ్మ అక్కడకు వెళ్ళి "మునీంద్రా! నీవు వేంకటాచలానికి వెళ్ళి అక్కడ తపస్సు చెయ్యి. నీ తపస్సు అక్కడ సిద్ధిస్తుంది" అని చెప్పి అదృశ్యుడయ్యాడు అగస్త్యమహర్షి "అలాగే"నని వేంకటాచలానికి

వెళ్ళి వేయి సంవత్సరాలు ఘోరతపస్సు చేశాడు.

**అశరీరవాణి పలుకుట :**

అంతట ఒకనాడు అశరీరవాణి అగస్త్య మహర్షిని ఉద్దేశించి యిలా పలికింది– ''మహర్షీ? ఈ పర్వతంలో 1008 తీర్థాలున్నాయి. నీవు వాటన్నిటిలో స్నానమాచరించి వాటి మాహాత్మ్యాన్ని లోకానికి తెలియజేయి.

**''నాన్యత్తపో ద్విజాతీనాం ఋతే శాస్త్రోపదేశతః**
**కిం కాయక్లేశ ధర్మేణ కా సిద్ధిర్భవితా ద్విజా !**
**ఉక్తం మాధ్యందినే మంత్రే మాహాత్మ్యం భూధరస్యచ |**
**వదంస్త్వమన్తే వాసిభ్యో గిరేః కురు ప్రదక్షిణమ్ ||**

–బ్రహ్మపురాణం. అ. 3. శ్లో. 17,18.

బ్రాహ్మణులకు శాస్త్రోపదేశాన్ని మించిన తపస్సు మరొకటి లేదు. నీవు కేవలం శరీరాన్ని శుష్కింప చేయుట వలన నీకేం ప్రయోజనం సిద్ధిస్తుంది? మాధ్యందిన శాఖకు చెందిన వేద మంత్రంలో ఈ పర్వతం యొక్క మాహాత్మ్యం చెప్పబడింది.

నీవు నీ శిష్యులకు ఆ మంత్రాన్ని ఉపదేశించి, అధ్యయనం చేయిస్తూ ఈ పర్వతానికి ప్రదక్షిణం చెయ్యి. ఈ విధంగా నీవు ఆరవసారి ప్రదక్షిణం చేస్తూండగా మధ్యలో బ్రహ్మరుద్రాదుల దర్శనమవుతుంది. ఈశాన్యదిక్కున దేవతల దర్శనము అవుతుంది. తూర్పున దేవేంద్రుడు, ఆగ్నేయంలో అగ్ని, దక్షిణదిక్కులో ఋషి సంఘాలు, రుద్రాదులు దర్శనమిస్తారు. నైఋతి దిక్కులో యక్షరక్షః పిశాచాలు కనపడతాయి. పడమట దిక్కులో విష్వక్సేనుడు, వాయవ్యంలో వాయుదేవుడు, ఉత్తరంలో యోగి గణములు దర్శనమిస్తారు. ఈ విధంగా ఈ పర్వత మాహాత్మ్యాన్ని తెలుసుకొని స్వామి పుష్కరిణి తీరంలో ధ్యాన యోగాన్నవలంబించి భగవంతుని స్వరూపాన్ని తెలుసుకుంటావు.''

అశరీరవాణి ఈ విధంగా చెప్పి విరమించింది. వెంటనే అగస్త్య మహర్షి ఆ పర్వత మాహాత్మ్యాన్ని తన శిష్యులకు ఉపదేశిస్తూ, వివరిస్తూ ఆ గిరికి ప్రదక్షిణం చేసి ధ్యాన యోగంతో ఆ పరాత్పరుని దర్శించి పరమోత్కృష్టమైన మోక్షాన్ని పొందాడు. కావున అగస్త్య మహర్షి వలన మునులలో ఈ పర్వతం ప్రసిద్ధి చెందింది.

దూర్వాసుడు ఈ విధంగా చెప్పగా మరల దిలీపుడు ''మహర్షీ! మానవులలో ఈ పర్వతం ఎవరి వలన ప్రసిద్ధి చెందిందీ తెలియ జేయండి'' అని అడిగాడు. అప్పుడు దుర్వాసుడు యిలా చెప్పాడు.

**(సశేషం)**


Statement about ownership and other particulars about **SRI VENKATESAM (Monthly)**

## FORM IV

See Rule 8

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | H.No.1-1-53, Street No.1, Habsiguda, Hyderabad - 500 007 |
| 2. Periodicity of it's Publication | : | Monthly |
| 3. Editor | : | **PULLAGURLA SAI REDDY** |
| 4. Printer's Name | : | **PULLAGURLA SAI REDDY** |
| Whether Citizen of India | : | Yes |
| Address | : | H.No.1-2-63/10/1, (Plot no.9/3, M-block) Kakatiya Nagar, Habsiguda, Hyderabad - 500 007. |
| 5. Editor's and Publisher's Name | : | **PULLAGURLASAI REDDY** |
| Whether Citizen of India | : | Yes |
| Address | : | H.No.1-2-63/10/1, (Plot no.9/3, M-block) Kakatiya Nagar, Habsiguda, Hyderabad - 500 007. |
| 6. Name and Address of Owner | : | **PULLAGURLASAI REDDY** H.No.1-2-63/10/1, Kakatiya Nagar,Habsiguda, Hyderabad - 500 007. |

I P.Sai Reddy, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

HYDERABAD **(Sd.) P. SAIREDDY**

Date : 1-04-2024 Signature of the Publisher

# హిందువుల తొలి పండుగ ఉగాది

– కొత్తా నిర్మల

హిందువులు జరుపుకునే పండుగలలో తొలి పండుగ ఉగాది. తెలుగు మాసాల ప్రకారంగా, తొలి మాసమైన చైత్రంలో ఉగాది పండుగ వస్తుంది. వసంత ఋతువు, చైత్రమాసంలో మొదటి తిథి అయిన పాడ్యమి రోజున ఉగాది పండుగను జరుపుకుంటారు. తెలుగువారి తొలి పండుగ ఉగాది. దీనిని యుగాది అని కూడా అంటారు. చైత్ర శుక్ల పాడ్యమి రోజున బ్రహ్మదేవుడు సృష్టికార్యాన్ని ఆరంభించిన కారణంగా యుగాది అని చెబుతారు. విష్ణుమూర్తి మత్స్యావతారాన్ని ధరించి, వేదాలను అపహరించిన సోమకుని వధించి, ఆ వేదాలను తెచ్చి బ్రహ్మకు అప్పగించిన శుభప్రదమయిన రోజు ఉగాది. చరిత్ర ప్రకారంగా చూస్తే, శాలివాహన చక్రవర్తి చైత్రశుక్ల పాడ్యమినాడు సింహాసనాన్ని అధిష్ఠించి, రాజ్యపాలన చేసి, శాలివాహన యుగకర్తగా పేరు పొందాడని, ఆ శుభదినాన్ని శాలివాహన స్మృత్యర్థంగా ఉగాది పండుగను ప్రజలు జరుపుకున్నారని ప్రతీతి.



ఉగాది రోజునుంచే తెలుగు సంవత్సరం ఆరంభమవుతుంది. తెలుగు సంవత్సరాలు అరవై ఉంటాయి. భారతీయ గణితశాస్త్ర పండితుడయిన భాస్కరాచార్య తెలుగువారికి ఉగాది నుంచి కొత్త సంవత్సరం ఆరంభమవుతుందని తెలియజేశాడు. ఉగాది పండుగను సంవత్సరాది అని కూడా అంటారు. తెలుగు సంవత్సరం ఆరంభానికి చైత్రమాసం మొదటిరోజు ఆరంభం అన్నమాట. చాంద్రమానాన్ని అనుసరించి ఉగాది పండుగను జరుపుతారు. తెలుగువారు ఈ పండుగను ఎంతో ఉత్సాహంగా, ఆనందంగా జరుపుకుంటారు. ఉగాది రోజున షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని తయారుచేసి భగవంతుడికి ఆ పచ్చడిని నైవేద్యం పెట్టి , ఆ తర్వాత కుటుంబం లోని వారంతా ఆ పచ్చడిని తింటారు. ఆరోజు ఇంటిల్లిపాదీ తలంటు పోసుకుని నూతన వస్త్రాలను ధరిస్తారు. పిండి వంటలతో విందు భోజనం చేస్తారు.

ఉగాది పచ్చడి విశిష్టత – ఉగాది పచ్చడి అన్నది ఆరు రుచుల కలయిక. ఈ పచ్చడిలో వాడే పదార్థాలు ఆరు విభిన్న గుణాలు, రుచులు కలిగి ఉంటాయి. ఈ పచ్చడిని వేపపువ్వు, బెల్లం, సన్నగా తరిగిన మామిడి ముక్కలు, చింతపండురసం, ఉప్పు, కారం లేదా మిరియాల పొడితో తయారు చేస్తారు. ఒక్కొక్క పదార్థం ఒక్కొక్క భావానికి సంకేతమని చెబుతారు. బెల్లం ద్వారా లభించే తీపి ఆనందానికి చిహ్నం. వేపపువ్వులోని చేదు కష్టాలకు, బాధలకు ప్రతీక. ఉప్పు ఉత్సాహాన్ని ప్రేరేపించే పదార్థం. చింతపండు లోని పులుపు శరీరాన్ని ఉత్తేజపరుస్తుంది. వగరు కోసం లేతమామిడి ముక్కలను పచ్చడిలో కలుపుతారు. కారాన్ని కానీ, మిరియాల పొడిని కానీ ఈ పచ్చడిలో కలుపుతారు. ఆ కారపు రుచి సహనాన్ని కోల్పోకుండా ప్రవర్తించాలన్న సందేశాన్ని అందిస్తుంది. లేతమామిడి వగరు ముక్కలు జీవితంలోని సవాళ్ళను, సమస్యలను ఎదుర్కోవాలని బోధిస్తాయి. చిక్కటి చింతపండు రసంలో ఈ పదార్థాలన్నీ చేర్చి ఉగాది పచ్చడిని తయారు చేస్తారు. జీవితంలో ప్రతివారూ అనుభవించే సుఖ దుఃఖాలకు సంకేతంగా ఉగాది పచ్చడిని భావిస్తారు.

ఉగాదిరోజునతప్పనిసరిగాపంచాంగశ్రవణాన్నిఆలయాల్లో, టెలివిజన్ ఛానల్లో చదువుతారు. పంచాంగం అంటే తిథి, వార, నక్షత్ర, యోగం, కరణంతో కూడుకుని ఉంటుంది. ప్రతివారూ పంచాంగ శ్రవణాన్ని ఆ రోజు తప్పక వినాలి. పంచాంగంలోని తిథులు శ్రేయస్సుకు, వారాలు ఆయుస్సు పెంపొందటానికి, నక్షత్రాలు పాప పరిహారానికి, దోషనివారణకు, యోగాలు అనారోగ్యం తొలగి ఆరోగ్యం వృద్ధి చెందటానికి, కరణాలు కార్య సాఫల్యం జరగటానికి తోడ్పడుతాయి.

పంచాంగ శ్రవణంలో ఆ సంవత్సరంలో జరిగే విశేషాలు, దేశ, వాతావరణ అనుకూల, ప్రతికూలతలు, భవిష్యత్తు ఎలా ఉంటుందో అన్న విషయాలను వేదపండితులు వినిపిస్తారు. వాతావరణ స్థితిగతులు, గ్రహగమనాలు, ఆ సంవత్సరంలో రాబోయే గ్రహణాలు తెలియజేస్తారు. నక్షత్రాలు, రాశుల పరిగణన ప్రకారంగా ఆ సంవత్సరంలోని వారి ఆదాయ వ్యయాలు, గౌరవం, అవమానం, కందాయ ఫలాలను తెలియజేస్తారు. ఉగాది వసంత రుతువులో వస్తుంది. ప్రకృతి ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. ఉగాది రోజున కవి సమ్మేళనం జరుపుతారు. పంచాంగాన్ని శ్రద్ధగా ఆలకించడం వల్ల శత్రుబాధలు ఏర్పడవు. దుస్వప్నాలు రావు. సంతానం కలుగుతుంది. పంచాంగం వినిపించిన బ్రాహ్మణుని దక్షిణ తాంబూలాలతో సత్కరించాలి. ఆ సద్బ్రాహ్మణునికి నమస్కరించి ఆశీర్వాదం పొందాలి. ఉగాది నుంచి ఆలయాల్లో దేవీ వసంత నవరాత్రులు జరుపబడతాయి. కొంతమంది నూతన సంవత్సరమైన ఉగాది రోజున కొన్ని నిర్ణయాలను తీసుకుంటారు. తమను తాము సంస్కరించుకోవాలనే ఉద్దేశ్యంతో, ఆ నిర్ణయాలకు ఆ సంవత్సరమంతా తాము కట్టుబడి ఉంటామని శపథం చేసుకుంటారు.



# శ్రీరామ నవమి

– డా॥ దేవులపల్లి పద్మజ

**ఆపదామపహర్తారం ధాతారం సర్వసంపదాం!**
**లోకాభిరామం శ్రీరామం భూయో భూయో నమామ్యహం!!**

విష్ణుమూర్తికి గల అనేక రూపాలో వేంకటేశ్వరునిగా, నృసింహస్వామిగా, సత్యనారాయణ స్వామిగా వివాహమహోత్సవం జరుగుతూ ఉంటుంది. కాని శ్రీ సీతారాముల వివాహానికి వచ్చిన ప్రాముఖ్యత మరే ఇతర వైష్ణవ కళ్యాణానికి రాలేదు అని చెప్పటం ఏమాత్రం అతిశయోక్తి కాదు. ఈ వివాహ మహోత్సవాన్ని ప్రతీ ఒక్కరూ తమ ఇంట్లో జరిగే శుభ కార్యక్రమముగా భావిస్తారు. ఈ వేడుక నిర్వహించటానికి ఎన్నో నెలల ముందునుండి సమాయత్తమౌతుంటారు. వాల్మీకి రామాయణంలో ఈ వివాహమహోత్సవాన్ని ఎంతో సుందరంగా వర్ణించటం జరిగింది. కన్యాదాన మహోత్సవ సమయమున దేవతలు, ఋషులు "బాగు, బాగు" అని ప్రశంసించిరి. దేవదుంధుబులు మ్రోగెను. అద్భుతముగా పూలవాన కురిసి, చూచువారికి కనువిందు గావించెను. అప్సరసలు నృత్యము గావించిరి. గంధర్వులు కమ్మగా గానము చేసిరి. ఈ సుమంగళ దృశ్యాన్ని ఎంత వర్ణించినా తక్కువగానే కాన్పట్టును.

చైత్రశుద్ధ నవమినాడు పున్వరసు నక్షత్రములో కర్కాటక లగ్నంలో మధ్యాహ్నం పన్నెండు గంటలకు అభిజిన్ముహూర్తంలో శ్రీరామచంద్రమూర్తి దశరథుని కూమారునిగా జన్మించినట్లు వాల్మీకి రామాయణం మనకు తెలుపుతున్నది. అందువలన ఈ పుణ్యదినమే మనం అనాదిగా 'శ్రీరామనవమి' పండుగగా జరుపుకుంటున్నాము.

**"ఇయం సీతా మమ సుతా సహధర్మచారిణీ తవ!**
**ప్రతీచ్ఛ చైనాం భద్రం తే పాణిం గృహ్ణీష్వ పాణినా!!**

శ్రీసీతారాముల కళ్యాణము జరిగినదీ ఈరోజే మరియు శ్రీరామ చంద్రమూర్తి రావణుని వధించి అయోధ్యకు తిరిగి వచ్చినది కూడా ఈరోజే. సౌందర్యవతి, సౌకుమార్యనిధి, లావణ్యవతి అయిన ఈ కన్యకామణియే సీత. ఈమె అయోనిజ, మహాతపస్సంపన్నులైన రాజర్షులకు ఆలవాలము, కీర్తిప్రతిష్ఠలకు నిలయమైన మా వంశమునకు ప్రతీక. నా పుత్రికయైన ఈ సీతామహాలక్ష్మి నేటి నుండి నీకు సహధర్మచారిణి, ధర్మార్థకామముల ఆచరణానుభవములలోను, కష్టసుఖములలోను సర్వదా నీకు తోడుగా నుండును.

విధ్యుక్తముగా ఈమెను పాణిగ్రహణమొనర్చి, అనురాగముతో స్వీకరింపుము నీకు శుభము కలుగునని రామునికి సీతనిచ్చి, జనకమహారాజు సీతారాముల వివాహమహోత్సమును సకల దేవతల సమక్షంలో వైభవముగా జరిపించెను.

అందువలన ఈ రోజు ప్రతి హిందువుకు ఎనలేని సంతోషదాయకమైన దినం. ఆయన సరస, సౌమ్య, కరుణ భరిత నిర్మలాత్ముడు. సత్యవాక్పరిపాలనా దురంధరుడు. శ్రీరాముని శాసనం భూమండలం అంతటా వ్యాపించి ఉన్నందున ఆయనను మనం సార్వభౌమునిగా అభిషేకిస్తాము, ఆరాధిస్తాము. ఆయన సలక చరాచర జగత్తును పాలిస్తూ సర్వదా ఇల నివసించిన అద్వితీయుడు.

నవమి తిథి సూర్యోదయం దాటి ఉన్నరోజున శ్రీరామనవమిగా జరుపుకుంటూ ఆయనకు సార్వభౌమ పట్టాభిషేకం చేయాలి. ఈ రోజన ప్రతీ హిందువు తప్పనిసరిగా శక్తికొలది సకల పరివార సమేతుడైన శ్రీరామచంద్రమూర్తి పటాన్ని గాన్ని, విగ్రహాన్ని గాని ఉంచి పూజించాలి. శ్రీ హనుమంతుని పటం ఉంచటం మరచిపోకూడదు. అందంగా పసుపు, కుంకుమలతోనూ, అష్టదళ పాద పద్మాలతోను అంకరించిన పీటపై కొత్త బట్టపై బియ్యము అరంగుళము మందంగా చదరముగా పోసి చదునుగా ఏర్పాటు చేయాలి. పూజామందిరాన్ని శక్తి కొలది అంకరించి శ్రీరామ పూజ వైభవంగా కలనుకింపుగా చేసుకోవటానికి సర్వం సిద్ధం చేసుకోవాలి. పూజామందిర మధ్యలో కలశమునూ, కొబ్బరికాయను అమర్చి, ఎర్రని పట్టుబట్టను కిరీటంలా అమర్చాలి. ఈ కలశం వెండిదైనా, రాగిదైనా, కంచుదైనా వాడవచ్చును. పంచపల్లవములుగాని, చక్కని మామిడాకులుగాని కలశంలోవేయాలి. విష్వక్సేనఆరాధనగాని, విఘ్నేశ్వరపూజగాని చేసి, కలశపూజ, మండప ఆరాధన చేయాలి. పురుషసూక్త విధానంతోగాని, పౌరాణికంగా గాని పూజ చేయవచ్చును. శ్రీరామ అష్టోత్తరం కానీ సహస్రం, శ్రీసీతా అష్టోత్తరం ఆంజనేయ అష్టోత్తరంతో పూజ భక్తి శ్రద్ధలతో చేయాలి. తులసీ దళములతో శ్రీరాముని, మారేడు దళములతో శ్రీసీతాదేవిని, తమపాకులతో శ్రీఆంజనేయుని అర్చిస్తే కలిగే ఫలితాలు అనంతాలు, అనన్య సామాన్యాలు. రంగురంగు పూమాలలతో అలంకరించాలి. శ్రీస్వామివారికి షోడషోపచారాలతో పూజను సుసంపన్నం చేయాలి. రుచికరమైన పానకం, వడపప్పు, చక్కెర పొంగలి, మధుర ఫలాలు నైవేద్యమివ్వాలి. ఆనంద కర్పూర నీరాజనాన్ని కడు రమ్యంగా సమర్పించాలి. ఈ రోజు చేసే విష్ణు సహస్రనామ పారాయణ ఫలితాన్ని గుణించటం ఎవ్వరి వల్లా కాదు. శక్తి కొలది బంధుమిత్రులతోకూడి శ్రీరామ నామ జపంగాని, రామాయణ పారాయణగాని చేయటం సర్వోత్తమం.

**జానక్యాః కమలాంజలి పుటేయాః పద్మరాగాయితాః**
**న్యస్తాః రాఘవ మస్తకేచ విసత్కుంద ప్రసూనాయితాః**
**స్రస్తా శ్యామ కాయకాంతి కలితా యా ఇంద్రనీలాయితాః**
**ముక్తాస్తాః శృభదా భవంతు భవతాం శ్రీరామ వైవాహికాః**

జానకి రాముల దాంపత్యం మానవాళికి ఆదర్శం. అందుకే మనం మన ఇంట జరిగే శుభకార్యాలకు శుభలేఖ లో ఈ పై శ్లోకం వేసుకుంటే ఆ రామాశీర్వాదం వెంట ఉంటుందనే నమ్మకం.

సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు మనుష్య రూపంలో జన్మించి సకల జగత్తుకు మార్గదర్శకుడైనాడు. అన్ని జీవరాసులలోను ఉత్తమమైనది మనుష్య జన్మ. ఆ జన్మ సార్థకం కావాలంటే అత్యుత్తమమైన జీవన విధానాలు కావాలి. విధాన రూపకల్పనే కాకుండా అవి అనుసరించినప్పుడే సరియైనభావనలు సంతరించుకుంటాయి. మానవ జీవనం ఏవిధంగా ఉండాలో, చేయకూడని కార్యక్రమాలు ఏమిటో విశదపరచిన శ్రీరాముడు లోకారాధ్యుడు. సకల భువనాలకు అధిపతి అయిన శ్రీరాముడు, మనుష్య జీవన విలువలకు కట్టుబడిన ఆదర్శమూర్తి. శ్రీరాముడు పలికిన పలుకులకు తిరుగులేదు, శ్రీరాముని బాణానికి ఎదురులేదు. శ్రీరాముని వాక్కు అసత్యం కాదు, శ్రీరాముని బాణం వెనుతిరగదు. శ్రీరాముడు తన అవతార కాలంలో ఎటువంటి మాయలు ప్రదర్శించలేదు. కాని ఆయన నామము ఎన్నో అద్భుతాలు సృష్టించినది. ప్రాణభయంనుండి కాపాడబడిన సుగ్రీవుడు, సంపాతి మనకు రామాయణంలో కనిపిస్తారు. శ్రీరామ నామ పారాయణంలో జీవితం గడపిన శబరి, శ్రీరామ దర్శనంతో జీవనదియైన శబరిగా మారిపోయింది. ప్రాణ త్యాగం చేసుకోబోయిన సీతామాతకు హనుమ నోటివెంట పలికిన శ్రీరామ నామము జీవాన్ని, జీవనాన్ని ఇచ్చింది. రామనామమే ఊపిరిగా భావించిన శ్రీహనుమ చేసిన అనన్య సామాన్య సాహస కార్యాలు మరచుట ఎవ్వరికీ సాధ్యం కాదు. రామ నామ పారాయణకే తమ జీవితాలు అంకితం చేసిన భక్తరామదాసు, త్యాగయ్య, పోతన, తులసీదాసు వంటి మహానుభావులు ఎందరో ఉన్నారు. శ్రీరామ నామములోని మాధుర్యం మరే నామ సంకీర్తనలోనూ మనకు కనబడదు. తన భార్యను అపహరించి తప్పుచేసిన రావణబ్రహ్మలోని మంచి గుణాలను స్మరించిన మానవతామూర్తి శ్రీరామచంద్రమూర్తి.

మనందరం భక్తిశ్రద్ధలతో ఈ రామనవమి రోజున శ్రీరామచంద్రమూర్తి కళ్యాణాన్ని ఆచరించి, పూజచేసి తరిద్దాం. లోకానికి సుఖశాంతులు కలిగేందుకు మనవంతు కృషి చేద్దాం. శ్రీసీతారాముల వివాహమహోత్సవానికి అందరూ తరలివెడదాం. చూసి తరిద్దాం. లోకకల్యాణం వీక్షించి శ్రీరామరక్ష కోరుకుందాం. జైశ్రీరామ్.

**శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే!**
**సహస్రనామ తత్తుల్యం రామ నామ వరాననే !!**

అందరికీ శ్రీరామ నవమి శుభాకాంక్షలు

**సర్వేజనాః సుఖినోభవంతు**

ధారావాహికం



# ముకుందమాల

- భువనేశ్వరి మారేపల్లి,
9550241921

**హేలోకాశ్శృణుత ప్రసూతి మరణవ్యాధేశ్చిత్సామిమాం**
**యోగఙ్ఞాస్సముదాహరంతి మునయో యాం యాఙ్ఞవల్క్యదయ:**
**అంతర్జ్యోతిరమేయమేకమమృతం కృష్ణాఖ్యామాపీయతాం**
**తత్పీతం పరమౌషధం వితనుతే నిర్వాణమాత్యంతికం (17)**

ముందటి రెండు శ్లోకములలో ఔషధం తెలియక బాధ పడుచున్న సంసార వ్యాధిగ్రస్తులకు, కులశేఖరులు తాను తెలుసుకున్న చికిత్సను ఈ శ్లోకంలో వివరించుచున్నారు.

హే, లోక ప్రజలారా, జనన, మరణ మరియు రోగాలకు సర్వరోగ నివారిణిని వినుము, అది మహా ఋషులచే చెప్పబడింది. పురాతన జ్ఞానంతో నిండిన యాజ్ఞవల్క్యుడు, ఇది అమృతం వంటి అంతర్గత కాంతి మాత్రమే, మరియు దానికి "కృష్ణ" అని పేరు, ఈ గొప్ప అమృతాన్ని త్రాగినప్పుడు, అంతిమ విముక్తిని ఇస్తుంది. ఇది సంపూర్ణమైనది మరియు శాశ్వతమైనది.

కులశేఖరాళ్వారులు కౌస్తుభం యొక్క అంశ, వారికి జ్ఞానభక్త్యాదులు లేకపోలేదు.

**న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన |**
**నా నవాప్త మవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి || గీత.3.22**

శ్రేష్ఠుడగు వాని మార్గమునే ఇతరులు అనుసరింతురు గాన తానాచరించి యితరులు ఆచరించునట్లు చేయదలచిరి. బలాత్కరించినను భగవద్విషయమున సంబంధపడని జనులు సూక్ష్మముగ దెలిపిన తెలిసికొందురా? తమ మార్గమును అనుసరింపకుండు జనుల నుద్దేశించి కులశేఖరులీ రీతి హితోపదేశము చేసిరి.

హే లోకాః శృణుత – ఓ ప్రాణులారా! వినుడు నేనొక మందును చెప్పెదను.

ప్రసూతిమరణవ్యాధేశ్చికిత్సామిమాం–నేను చెప్పబోవునట్టి జనన మరణములనెడు రోగమునకు మందును చెప్పెదను. సాధారణముగా అన్ని వ్యాధులకు ఔషధములు ఉంచుకొని ఉందురు గాని, ఈ వ్యాధికి మాత్రం దొరకదు. రావణ, హిరణ్య కశ్యపులు గూడ బ్రహ్మను యాచించి ఆ ఔషధమును పొందలేకపోయిరి.

యోగజ్ఞాః సముదాహరంతి మునయో యాం యాజ్ఞవల్క్యాదయః – యోగనిష్ఠులైన యాజ్ఞవల్క్యాది మునులు దానిని కనిపెట్టిరి.

**అంతర్జ్యోతిరమేయమేకమమృతం కృష్ణాఖ్యామాపీయతాం**
**తత్పీతం పరమౌషధం వితనుతే నిర్వాణమాత్యంతికం**

ఎక్కడికీ పోనక్కరలేదు. మనసులోనే వున్నది. లోపల చీకటిగా ఉన్నది అనుకుంటారేమో! ఇతర ఔషధములు వెదకి తెచ్చుటకు దీపముండవలెను. ఈ మందు స్వతః ప్రకాశము గలది. కావలయునని తలచిన యెడల జ్యోతి రూపమున నుండి ఆ లోపలి నుండే అన్యదీప సహాయము లేకయే కనబడును.

ఈ మందుకు ఇంత ధర అని లేదు. ఇది ఆ మందులవంటిది కాదు. ఇది ఒకే మందు. దీనిని పుచ్చుకొనిన పిదప వేఱొక్కదానిని పుచ్చుకొనవలసియుండదు. ఆ మందు పేరు కృష్ణుడు. ఈ మందు చేదుగా ఉండదు. ఈ మందు అమృతముగా ఉండును. లోపలికి పనిచేయును.

ఈ మందును నమలక్కరలేదు, పానము చేయవచ్చును. సులభంగానే లోపలికి పోవును. మధురంగా ఉండే ఔషధం అంతగా పనిచేయదు అనుకుంటారేమో! కాదు త్రాగేవరకు అమృతంగా ఉంటుంది. లోపలికి పోగానే ఔషధమవుతుంది. సకల రోగముల పోగొట్టి సుఖమిచ్చును. ఇతర ఔషధసేవ చేయుచు అపథ్యం చేసిరేని వ్యాధి మరల వచ్చును. ఈ మందులు తత్కాలమునకు సుఖమిచ్చును. ఈ ఔషధము శాశ్వత సుఖ మిచ్చును.

**మా ముపేత్య పునర్జన్మ దుఃఖాలయ మశాశ్వతమ్ ।**
**నాప్నువంతి మహాత్మాన స్సం సిద్ధిం పరమాం గతాః ॥**

**– గీత. 8.15**

మరల పుట్టవలసిన అక్కర యుండదు.

**జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ ।**
**తస్మాదపరి హార్యే అర్థే న త్వం శోచితు మర్హసి ॥ - గీత. 2.27**

జనన మరణములు లేకుండా పోవును.

ఆ మందు పారవశ్యంలో ఎంతటి మైమరపును ఇస్తుందో మనం వివరించి చెప్పలేము. అందుకు గొప్ప నిదర్శనం సంత్ గోరా కుంభార్.

సంత్ గోరా కుంభార్ (గోరోబా అని కూడా పిలుస్తారు), వృత్తి రీత్యా కుమ్మరి. బొమ్మలు తయారు చేసి బజారులో అమ్ముతూ జీవనం సాగించేవాడు. అతను ఎప్పుడూ పాండురంగ విఠలుని గురించి ఆలోచిస్తూ తన విధులను నిర్వర్తించేవాడు. అతని హృదయం పాండురంగని పట్ల ప్రేమతో నిండిపోయింది. బొమ్మలు చేయడానికి మట్టిని తడుముతూ, కొట్టేటప్పుడు కూడా గోరా భగవంతుని కీర్తిస్తూ పాడుతూ ఉండేవాడు. భగవంతుని గురించి పాడుతూ తనను తాను మరచిపోయి వేరే లోకానికి పరకాయ ప్రవేశం చేసేవాడు.

అతను పాండురంగడు, రుక్మిణి, రాముడు, కృష్ణుడు వంటి బొమ్మలను తయారుచేసి, వాటికి రంగులు వేసి అంగడికి తీసుకెళ్ళి అమ్మేవాడు. గోరా దేవుడిపై ప్రేమలో మునిగిపోయాడు, అతను తన వృత్తిలో కూడా దేవుడిని గుర్తుచేసే కుండలను, వస్తువులను మాత్రమే తయారు చేస్తాడు. బజారులో బొమ్మలకు ధర చెప్పడు. వీటి కోసం ఎంత డబ్బు ఇచ్చినా తీసుకుని ఆనందంగా ఇంటికి వచ్చేవాడు. అతనికి భార్య 'తులసీబాయి' మరియు 'హరి' అనే కుమారుడు ఉన్నారు.

ఒకరోజు తులసీబాయి హరిని ఎత్తుకుని అన్నం తినిపిస్తూ కథలు చెబుతోంది. ఆహారంలో నెయ్యి లేక పోవడంతో హరి తినడానికి నిరాకరించాడు. తులసి అతన్ని కిందకి దింపి, ఒక బొమ్మను ఆడుకోవడానికి ఇచ్చి, అతను తినడానికి కొంచెం నెయ్యి తీసుకురావడానికి లోపలికి వెళ్ళింది. గోరా కుండలు తయారుచేయడానికి గొయ్యిలా ఏర్పాటుచేసుకున్న మట్టిని తడుముతూ, కొట్టుకుంటూ ఉన్నాడు. ఆకాశంలో చీకటి మేఘాలు ఉన్నాయి మరియు ఒక కాకి ఎగిరిపోయింది. హరి ఆ కాకిని చూసి గోరాకు చూపించాడు. గోరా కాకిని, చీకటి మేఘాలను చూడగానే, అతను కూడా ముదురు రంగులో ఉన్నందున అతని హృదయం పాండురంగ విఠలుని ఆలోచనలతో నిండి పోయింది. గోరా విఠలుని గురించి పాడటం ప్రారంభించాడు. వెంటనే అతను ఎప్పటిలాగే వేరే స్థితికి చేరుకున్నాడు. అతను "విఠల విఠల" అని జపించాడు. మరియు గొయ్యిలో నిలబడి మట్టిని తొక్కుతూ చేతులు పైకి లేపి నృత్యం చేస్తున్నాడు. కొద్దిక్షణాల్లో వర్షం కురువడంతో పిల్లవాడు ఉరుములకు భయపడి గోరా వద్దకు పరుగెత్తుకుంటూ వచ్చాడు. హరి తన తండ్రి వద్దకు రాగానే, అతను మట్టి గొయ్యిలో జారి పడ్డాడు మరియు గోరా అతనిని గమనించకుండా నాట్యం చేస్తూ, మట్టిని కొట్టడం కొనసాగించాడు, హరి గొయ్యిలో ఇరుక్కుపోయాడు. గోరా మట్టిని కొట్టడం వల్ల హరి గొయ్యిలోకి లోతుగా పడి చనిపోయాడు.

తులసీ బాయి ఒక్కసారి వర్షం ఆగడంతో తిరిగి వచ్చి గోరాను హరి ఎక్కడ అని అడిగింది. గోరా ఇప్పటికీ "విఠల్ విఠల్" అని పాడుకుంటూ, నృత్యం చేస్తూనే ఉన్నాడు. మరియు తులసి బాయి అతన్ని ఆపి, హరికి ఏమైంది అని అడగాల్సి వచ్చింది.

గోరా 'ఆమెకు అంతటా హరి' అని సమాధానమిచ్చాడు; అతను ఇంకా భిన్నమైన మానసిక స్థితిలోనే ఉన్నాడు మరియు ఆమె దేవుని గురించి అడుగుతున్నట్లు భావించాడు. అప్పుడు ఆమె తన కొడుకు హరి గురించి అడుగుతున్నానని, సర్వశక్తిమంతుడైన శ్రీహరిని కాదని చెప్పింది. అప్పుడే సాధారణ స్థితికి వచ్చి కొద్దిసేపటి క్రితం ఇక్కడే ఆడుకుంటున్నాడని చెప్పాడు. ఆ తర్వాత అన్ని చోట్ల వెతకగా తన చిన్న కాలు మట్టి గుంతలోంచి బయటికి వస్తూ కనిపించింది. ఇది చూసిన అతను గొయ్యి నుండి పిల్లవాడిని తీసివేసి, అతను చనిపోయాడని గ్రహించాడు. తులసి బాయి అతనిపై అరవడం మరియు ఏడవడం ప్రారంభించింది మరియు తన కొడుకు మరణానికి కూడా అతనిని నిందించింది. పాండురంగడు తమకు ఒక కొడుకును ఇచ్చాడని, ఇప్పుడు అతన్ని తిరిగి కోరుకుంటున్నాడని, అందుకే అతన్ని వెనక్కి తీసుకున్నాడని గోరా చెప్పాడు. తాను జీవించింది కొన్నేళ్లే అయినప్పటికీ భగవంతుని నామస్మరణ చేసి పాడినందున మోక్షాన్ని పొందుతాడని, చింతించవద్దని కోరాడు.

తులసి బాయి ఇప్పుడు కోపంతో పాండురంగని వల్లనే తన కొడుకుని పోగొట్టుకున్నానని, ఇంట్లో ఉన్న పాండురంగని విగ్రహాన్ని పగలగొడతానని చెప్పి గొడ్డలిని తీసుకుని వెళ్లింది. గోరా అది విన్న వెంటనే తులసిబాయిని గొడ్డలితో వెంబడించడం ప్రారంభించాడు. ఇది చూసిన ఆమె "పాండురంగని మీద ఒట్టు, నన్ను ముట్టుకోవద్దు" అని అరిచింది, ఇది విన్న గోరా గొడ్డలిని కిందకి దింపి, ఇకపై తనను తాకనని చెప్పాడు. అనంతరం హరికి అంత్యక్రియలు నిర్వహించి ఇతర కార్యక్రమాలను ముగించారు.

పాండురంగనిపై చేసిన వాగ్దానం కారణంగా ఒక సంవత్సరం గడిచిపోయింది మరియు ఇప్పటికీ గోరా తులసిని తాకలేదు. తులసి తన బిడ్డ చనిపోవడంతో చాలా బాధగా ఉంది మరియు మరొక బిడ్డను కనాలని కోరుకుంది కానీ ఇప్పుడు పాండురంగని మీద వాగ్దానం చేయడం వల్ల అది సాధ్యం కాలేదు. తులసికి ఇప్పుడు తనకు పిల్లలు కలగరని తెలుసు మరియు ఇంట్లో ఒక పిల్లవాడిని కలిగి ఉండటానికి తన సోదరి, 'శాంతుబాయి' నిచ్చి గోరాతో వివాహం చేయాలని నిర్ణయించుకుంది. ఆ తర్వాత ఆమె అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేసింది మరియు తులసి బాయి తల్లిదండ్రుల ఇంట్లో వివాహం జరిగింది. తులసి, శాంతులతో వివాహానంతరం గోరా వెళుతున్నప్పుడు, వాగ్దానం గురించి ఏమీ తెలియని వాళ్ల నాన్న గోరా వద్దకు వచ్చి, తులసితో ఎలా ప్రవర్తిస్తాడో అదే విధంగా శాంతుని కూడా చూసుకోవాలని చెప్పాడు. గోరా అది విని సంకోచించాడు. అతని సంకోచాన్ని చూసి "పాండురంగని మీద వాగ్దానం చేయి, నువ్వు తులసి బాయితో ఎలా ప్రవర్తిస్తావో అలాగే శాంతూ బాయిని చూసుకోవాలి" అన్నాడు. ఇది విన్న గోరా అందుకు అంగీకరించి ఇంటికి తిరిగి వచ్చాడు. గోరా ఇద్దరినీ సమానంగా చూడటం ప్రారంభించాడు. అంతేకాదు ఎవరినీ తాకడు. రోజులు గడిచిపోయాయి. ఒక రోజు సోదరీ మణులు తమలో తాము చర్చించుకుని, అతను నిద్రపోతున్నప్పుడు అతని పడక గదిలోకి వెళ్లారు. ఇరువైపులా కూర్చొని ఆయన చేతులను తాకారు. అతను వెంటనే మేల్కొని తులసి బాయిని అడిగాడు, పాండురంగనిపై వాగ్దానం చేసిన తర్వాత ఆమె అతన్ని ఎలా తాకగలదని. అతను ఈ పనికి తనను తాను శిక్షించుకోవాలని కోరుకున్నాడు. వెంటనే చెట్లను నరికివేయడానికి ఉపయోగించే రంపంతో తన రెండు చేతులను కత్తిరించుకున్నాడు.

గోరా ఇప్పుడు ఏ పనీ చేయలేక పోవడంతో తులసి మరియు శాంతులు ఇద్దరూ కొన్ని కుండలు తయారుచేసి, వాటిని అమ్మి, తినడానికి సరిపడా డబ్బు సంపాదించేవారు. గోరా ఇంతకు ముందు కొన్ని అప్పులు తీసుకున్నాడు మరియు ఇప్పుడు అతను బొమ్మలు చేయలేడని తెలుసుకున్న వారంతా అప్పులు తిరిగి చెల్లించాలని కోరారు. వారు తమ డబ్బును అతని దగ్గర నుండి రాబట్టుకోవడానికి, అతని ఇల్లు మరియు ఇతర ఆస్తులను వేలం వేయడానికి తీసుకున్నారు.

వేలం సమయంలో ఒక యువకుడు అక్కడికి వచ్చి గోరా ఇల్లు, పశువులు మరియు పాత్రలను కొనుగోలు చేశాడు. ఈ ఆస్తులను విక్రయించగా వచ్చిన డబ్బు కేవలం రుణం చెల్లించడానికే సరిపోతుందని, అతనికి ఇవ్వడానికి ఏమీ లేదని అధికారులు చెప్పారు. ఇప్పుడు తన అప్పులు తీరిపోయాయని గోరా సంతోషించాడు.

తులసీబాయి ఇప్పుడు గోరాను ఏమి చేస్తారని అడిగింది. మనం పంఢర్‌పూర్‌కు వెడదామని, పాండురంగడు మనల్ని చూసుకుంటాడని ఆమెతో చెప్పాడు. వారు ఇంటి నుండి బయలుదేరు తున్నప్పుడు, ఈ ఆస్తిని వేలంలో తీసుకున్న చిన్న పిల్లవాడు వారి వద్దకు వచ్చి వారికి సాష్టాంగం చేసి, నాన్న మరియు అమ్మ మీరు ఎక్కడికి వెళ్ళవద్దు అని చెప్పాడు. దీంతో వారు ఆశ్చర్యపోయి ఎందుకు అలా మాట్లాడుతున్నావు, ఎవరు నువ్వు? అని ప్రశ్నించారు. తాను కూడా కుమ్మరి అని, తన పేరు 'రంగ' అని, తాను బొమ్మలు అమ్మే బజారులో తమరిని చూశానని గోరాతో చెప్పాడు. తన ఇంటిని వేలం వేస్తున్నట్లు తెలిసి తమ కోసం మాత్రమే వేలంలో ఈ ఇంటిని కొనుగోలు చేశానని, తాము బాధపడకూడదని కూడా చెప్పాడు. గోరా చలించి పోయి, ఇది కూడా విఠలుని కోరిక అని చెప్పి, తిరిగి ఇంట్లోకి వెళ్ళిపోయాడు.

రంగ మరియు అతని భార్య రుక్మాబాయి (శ్రీకృష్ణుడు–రుక్మిణీదేవి) కూడా గోరా కొడుకు మరియు కోడలిగా వారితోనే ఉన్నారు. అప్పటినుండి గోరా కూర్చొని తన కీర్తనలు మరియు గానం ఆనందంగా నిర్వహిస్తున్నాడు మరియు రంగా బొమ్మల తయారీలో శ్రద్ధ వహిస్తున్నాడు. రుక్మాబాయి తులసి మరియు శాంతులకు ఇంటి కార్యకలాపాలలో సహాయం చేస్తుంది. రంగడి

చేతనే అన్ని పనులు చేయించడం చూసి, గోరా రంగడితో తన కాళ్లు బాగానే ఉన్నందున మట్టిని ముద్ద చేయడంలో, కొట్టడంలో రంగనికి సహాయం చేస్తానని చెప్పాడు. గోరా నుండి తనకు ఏదైనా కావాలంటే అది ఆ కీర్తనలు, భజనలు వినడమే అని రంగడు చెప్పాడు. గోరా పాడటం ప్రారంభించాడు మరియు రంగడు తన చేతులను తన తుంటిలో ఉంచుకుని మట్టిని కొట్టడం ప్రారంభించాడు. ఇది చూసిన గోరా ఒక్కసారిగా ఆగి, రంగడు నిజంగా రంగడేనా లేక పాండు రంగడా! అని అడిగాడు. రంగడు, 'మీరు ప్రతి ఒక్కరిలో పాండురంగడుని చూస్తారు. అందుకే ఆ విధంగా ఆలోచిస్తున్నారు' నేను రంగడు మాత్రమేనని చెప్పాడు.

ఇప్పుడు పాండురంగడు మరియు రుక్మిణి ఇక్కడ ఇంట్లో ఉన్నందున, విఠ్ఠలునితో మాట్లాడే నామదేవుడు మరియు పండరీలోని ఇతర సాధువులు విఠోభ కొంతకాలంగా ఆలయంలో లేరని గ్రహించారు. నామదేవుని నేతృత్వంలోని సాధువులు మరియు సాధువుల బృందం అతనిని కీర్తిస్తూ గ్రామ గ్రామాన వెతకడం ప్రారంభించారు. ఈ సాధు సమూహాలు ఈరోజు గోరా నివసించే గ్రామానికి చేరుకుంటున్నాయి. గ్రామ ప్రజలు ధ్వజాలతో స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యారు. ఇది చూసిన గోరా ఏమైందని అడిగారు మరియు వారు నామదేవునితో పాటు పంఢర్‌పూర్ నుండి సాధువుల బృందం ఈ రోజు ఇక్కడికి వస్తున్నారని చెప్పారు. అది విన్న గోరా ఉప్పొంగిపోయి సాధువుల గుంపు వైపు నడవడం ప్రారంభించాడు.

నామా మరియు గోరా ఒకరికొకరు బాగా తెలుసు, ఎందుకంటే వారు ఇంతకు ముందు ఏకాదశి సమయంలో విఠల రుక్మిణి ఆలయంలో చాలాసార్లు కలుసుకున్నారు. ఇద్దరూ ఒకరికొకరు నమస్కారాలు చేసుకుంటూ భజనలు చేస్తూనే ఉన్నారు. నామా అతనిని చూడగానే, విఠోభుడు ఖచ్చితంగా అతనితో ఉన్నాడని అర్థం చేసుకున్నాడు. భజనలు అయ్యాక నామా అడిగాడు పాండురంగడు ఎక్కడ ఉన్నాడు? అని. గోరా ఇంట్లో వున్న రంగడి గురించి అడుగుతున్నాడని భావించి ఇంట్లోనే ఉన్నాడని చెప్పాడు. ఇది విన్న నామా గోరా ఇంటికి పరిగెత్తాడు, కాని అప్పటికే విఠలుడు మరియు రకుమాబాయి అక్కడ నుండి అదృశ్యమయ్యారు. గోరా అతని వెనుక పరుగెత్తుకుంటూ వచ్చి రంగడిని పిలిచాడు. అతను రంగడు ఎక్కడ ఉన్నాడని తులసి బాయిని అడిగాడు మరియు ఇద్దరూ "రంగా రంగా" అని అరవడం ప్రారంభించారు.

విఠలుడు మరియు రుక్మిణి తన ఇంటికి వచ్చి తన కుమారుడిలా సేవ చేశారని నామా అతనికి చెప్పాడు. ఇది విన్న గోరా తను ఇక్కడ ఉన్నప్పుడు తనను గుర్తించలేకపోయానని, విఠోభను ఇంటి పనులన్నీ చేయమని చెప్పి పాపం చేశానని బాధపడ్డాడు. అప్పుడు అతను విఠలుని కోసం వెక్కివెక్కి ఏడుపు ప్రారంభించాడు. నామా అతనిని ఓదార్చాడు. మరియు గోరాను విఠలుని చూడటానికి తన కుటుంబంతో సహా పండరీకి రమ్మని కోరాడు. వారు పండరి చేరుకున్న తర్వాత, వారు భగవంతుని స్తుతించడం కోసం విఠల, రుక్మిణి ఆలయంలో కూర్చున్నారు. ఈ ఆలయం లోని సంప్రదాయం ఏమిటంటే, ఒక ప్రధాన భక్తుడు అక్కడ ఉన్న భక్తులందరికీ జలాను (త్రాగే ద్రవ పదార్థం) పంచి పెడతారు. ఈరోజు నామదేవ్ జలాలను పంపిణీ చేస్తున్నాడు మరియు అతను గోరాకు కూడా ఇవ్వాలని ప్రయత్నించాడు. అతను ఇలా చేయగానే గోరా చేతులు, చెట్టు నుండి ఆకులు పైకి లేచినట్లు తిరిగి వచ్చాయి. తులసిబాయి అది చూసి బయటకు వెళ్లి పాండురంగని వద్దకు పరిగెత్తింది, అతని పాదాలు పట్టుకుని తన కొడుకు హరిని తనకు తిరిగి ఇవ్వమని కోరింది. అప్పుడు ఆమె అతనితో చెప్పడం ప్రారంభించింది, మీరు మీ భక్తుడికి చేతులు తిరిగి ఇవ్వగలిగితే, నా కొడుకు హరిని ఎందుకు తిరిగి ఇవ్వలేరు? కృష్ణావతార సమయంలో 12 సంవత్సరాల క్రితం మరణించిన తన గురువు కుమారుడికి జీవితాన్ని ఇచ్చారని, మీరు అలా చేయగలిగితే, మీ భక్తుని కోసం ఇప్పుడే ఎందుకు చేయకూడదని ఆమె అతనిని అడిగింది. ఇది చూడటానికి చాలా మంది భక్తులు అక్కడ గుమిగూడారు. ఇంతలో అకస్మాత్తుగా ఒక పిల్లవాడు తన తల్లి కోసం ఏడుస్తున్నాడు. అతను ఎవరు అని వారు పిల్లవాడిని అడిగారు. మరియు తులసి బాయి అతనిని చూసినప్పుడు, ఆమె తన కొడుకు హరి అని గ్రహించింది. ఆమె పరిగెత్తుకుంటూ వచ్చి అతన్ని కౌగిలించుకుని, హరిని తనకు తిరిగి ఇచ్చినందుకు పాండురంగనికి కృతజ్ఞతలు చెప్పింది. ఆ తర్వాత వారంతా సంతోషంగా స్వగ్రామానికి చేరుకున్నారు.

సంత్ గోరా కుంభార్ (గోరోబా అని కూడా పిలుస్తారు) భారతదేశంలోని మహారాష్ట్రలోని భక్తి ఉద్యమం మరియు వార్కరీ శాఖతో సంబంధం ఉన్న హిందూ మతానికి చెందినవాడు. అతను వ్యాపారంలో కుమ్మరి మరియు విఠల్ భక్తుడు. గోరా కుంభార్, ఇతర సాధువులతో కలిసి, వందలాది అభంగాలను వ్రాసి పాడాడు.

గోరా కుంభార్ ప్రస్తుతం మహారాష్ట్రలోని ఉస్మానాబాద్ జిల్లాలో గోరాబా 'తెర్' అని పిలువబడే సత్యపురి గ్రామంలో నివసించినట్లు సాంప్రదాయకంగా నమ్ముతారు. అతను నామ్‌దేవ్‌కు సమకాలీనుడని నమ్ముతారు. 1267CE – 1317 CE మధ్య నివసించినట్లు భావిస్తున్నారు. గ్రామంలో అతని పేరు మీద ఒక చిన్న ఆలయం నిర్మించబడింది మరియు దీనిని భక్తులు సందర్శిస్తారు. గోరా చైత్ర కృష్ణ త్రయోదశి నాడు ఏప్రిల్ 10, 1317 నాడు మరణించాడు.

భగవాన్ రమణ మహర్షి చెప్పిన కథలో సంత్ నామ్‌దేవ్ (క్రీ.శ. 1270 – క్రీ.శ. 1350) ఏ విధంగా జ్ఞానోదయం పొందారో, అందుకు కారణమైన గోరా గురించి వివరించారు.

వ్యాపారంలో కుమ్మరి అయిన గోరా, మరొక సాధువు ఒక

విందును నిర్వహించారు. దానికి గోరా, నామ్‌దేవ్ మరియు జ్ఞానదేవ్‌లతో సహా సాధువులను ఆహ్వానించాడు. నామ్‌దేవ్‌కు జ్ఞానోదయం కలుగ చేయాలనే ఆశతో, జ్ఞానదేవ్ గోరాతో ఇలా అన్నాడు "మీ పని కుండల తయారీ. ఏది సరిగ్గా కాల్చబడిందో మరియు ఏది కాల్చబడలేదో తెలుసుకోవడానికి మీరు ప్రతిరోజూ వాటిని పరీక్షించి చూస్తారు కదా! ఇక్కడ మీ ముందు దేవుని కుండలు (మనుష్యులు) కూర్చుని వున్నాయి, కాబట్టి వాటిని పరీక్షించి ఏవి ధ్వనిగా ఉన్నాయో చూడు."

పరీక్ష ఉద్దేశ్యాన్ని ఏకాంతంగా చెప్పబడిన గోరా, అందుకు అంగీకరించి, తన కుండలను పరీక్షించడానికి ఉపయోగించే కర్రను తీసుకుని, తన అతిథుల మధ్యకు వెళ్ళి, ఒక్కొక్కరి తలపై తడుముకున్నాడు. నామ్‌దేవ్ వద్దకు వచ్చే వరకు వారంతా వినయంగా సమర్పించారు, నామ్‌దేవ్ మాత్రం కోపంగా అరిచాడు: "కుమ్మరీ! నీ కర్రతో నన్ను నొక్కడానికి వచ్చావా?" గోరా జ్ఞానదేవ్‌కి ఇలా సమాధానమిచ్చాడు: "మిగతా కుండలన్నీ సరిగ్గా కాల్చబడ్డాయి, ఇది మాత్రమే ఇంకా కాల్చబడలేదు!"

దీంతో అందరూ పగలబడి నవ్వారు. నామ్‌దేవ్ చాలా అవమానించబడ్డాడు, అతను లేచి ఇంటి నుండి నేరుగా విఠోబా ఆలయానికి వెళ్లాడు, అక్కడ అతను తీవ్రంగా విఠోబాకి ఫిర్యాదు చేశాడు: "నేను మీ బిడ్డ మరియు మీ సన్నిహిత స్నేహితుడిని కాదా? నాకు ఇంత అవమానం జరగడానికి మీరు ఎలా అనుమతించగలరు?" అని. భగవంతుడితో నేరుగా మాట్లాడగలిగిన గొప్ప భక్తుడు నామ్‌దేవ్.

విఠోబా ఎప్పటిలాగే అతని ముందు కనిపించాడు మరియు సానుభూతి చూపుతున్నట్లు అనిపించింది, కానీ తర్వాత ఇలా అన్నాడు: "మీరు అందరి లాగే నిశ్శబ్దంగా కూర్చుని గోరాకి ఎందుకు లొంగిపోలేకపోయారు? అప్పుడు ఇబ్బంది ఉండేది కాదు కదా!"

దీనితో నామ్‌దేవ్ మరింత కలత చెంది ఇలా అరిచాడు: "నువ్వు కూడా నన్ను అవమానించాలను కుంటున్నావు! నేను ఎందుకు సమర్పించాలి? నేను మీ బిడ్డ కాదా?" అప్పుడు విఠోబా ఇలా అన్నాడు: "నీకు ఇంకా అర్థం కాలేదు, నేను చెప్పినా నీకు అర్థం కాలేదు. కానీ అడవిలో ఉన్న ఒక శిథిలమైన ఆలయానికి వెళ్ళు, అక్కడ మీకు జ్ఞానోదయం ఇవ్వగల ఒక సాధువు కనిపిస్తాడు.

నామ్‌దేవ్ విఠోబా చెప్పినట్లుగా అడవికి వెళ్ళాడు మరియు శిథిలమైన ఆలయానికి చేరుకున్నప్పుడు, అక్కడ ఒక సాధారణ వృద్ధుడు తన పాదాలను శివలింగం మీద పెట్టుకుని పడుకుని ఉన్నాడు. విఠోబా చెప్పిన సాధువు ఇతడే, నామ్‌దేవ్ జ్ఞానోదయం పొందబోయే వ్యక్తి ఇతనే అని అతను నమ్మలేకపోయాడు. అయితే, అక్కడ మరెవరూ లేకపోవడంతో, నామ్‌దేవ్ అతని వద్దకు వెళ్ళి, అతనిని మేల్కొలపడానికి చప్పట్లు కొట్టాడు, అప్పుడు వృద్ధుడు కళ్ళు తెరిచి ఇలా అన్నాడు: "ఓహ్, మీరు విఠోబా ఇక్కడకు పంపిన నామ్‌దేవ్!"

దీనితో నామ్‌దేవ్ అవాక్కయ్యాడు. అతని పేరు మరియు అతను ఎందుకు వచ్చాడో తెలుసుకోవడానికి ఈ వ్యక్తి ఎంత శక్తివంతుడో అని ఆలోచించడం ప్రారంభించాడు. అంత శక్తిమంతుడా ఈ మనిషి లేదా కాదు, అతను ఒక లింగం మీద తన పాదాలను ఉంచి విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఇదే విషయాన్ని నామ్‌దేవ్ ఆ వృద్ధునికి చెప్పాడు.

"ఓహ్, నా పాదాలు లింగం మీద ఉన్నాయా?" "సరే, వాటిని వేరే చోట ఉంచండి." వృద్ధుడు అన్నాడు. కాబట్టి నామ్‌దేవ్, శివ లింగంపై ఉన్న గౌరవంతో, వారి పాదాలను మరొక ప్రదేశానికి తిప్పి పెట్టాడు. అక్కడ కూడా ఒక శివలింగం ఆవిర్భవించింది, అందువలన అతను వాటిని ఏ ప్రదేశంలో ఉంచాలో తెలియక, చివరగా, అతను కూర్చుని వాటిని తన ఒడిలోకి తీసుకున్నాడు. వెంటనే ఆ వృద్ధుడు స్వయంగా శివలింగంగా మారాడు. మరియు ఆ సమయంలోనే అతనికి జ్ఞానోదయం ఏర్పడింది.

దీని తర్వాత నామ్‌దేవ్ ఇంటికి తిరిగి వచ్చాడు. రోజూ గుడికి వెళ్లి విఠోబాతో ఎక్కువ సమయం గడపడం అతనికి అలవాటు అయినప్పటికీ కొన్ని రోజులుగా అతను గుడికి వెళ్లలేదు. కొన్ని రోజుల తర్వాత విఠోబానే నామ్‌దేవ్ ఇంట్లో అతని ముందు కనిపించాడు మరియు నన్ను ఎందుకు సందర్శించడం మర్చిపోయావు అని అడిగాడు.

"ఇప్పుడు నువ్వు నన్ను మోసం చేయవద్దు," అని నామ్‌దేవ్ బదులిచ్చారు,అంతేకాదు "నాకు ఇప్పుడు తెలుసు. మీరు లేని ప్రదేశం ఏదైనా ఉందా? నీతో ఉండాలంటే నేను గుడికి వెళ్లాలా? నేను నీకు కాకుండా ఉన్నానా?" "అవును, ఇప్పుడు నీకు అర్థమైంది," అన్నాడు విఠోబా.

15వ శతాబ్దానికి చెందిన సంత్ గోరా కుంభార్ గుజరాత్‌కు చెందిన ఒక వినయపూర్వకమైన కుమ్మరి, గోరా విఠోబా పట్ల తన భక్తి ద్వారా కుల వివక్షను సవాలు చేశాడు. సామాజిక సోపాన క్రమాలను ప్రశ్నించాయి మరియు అందరికీ తెరిచిన భక్తి మార్గాన్ని నొక్కి చెప్పాయి. కుమ్మరి సమాజానికి చెందిన సాధువు, గోరా కుంభార్ తన లోతైన భక్తి మరియు కవిత్వానికి ప్రసిద్ధి చెందాడు. కులం మరియు వృత్తి కంటే భక్తి మరియు ధర్మం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, అతని జీవితం మరియు బోధనలు ప్రజలను ఉత్తేజపరుస్తూనే ఉన్నాయి.

ఇలాగే! కులశేఖరులు కూడా మానవులకు కలిగే చావు పుట్టుకలు అను వ్యాధులకు మందు అప్రమేయమైన ఆ పరంజ్యోతి అను అమృతం ఒక్కటే మిమ్మల్ని కాపాడగలదు. ఆ మందు పేరు శ్రీకృష్ణుడు అని చెప్పారు. దానిని తనివితీరా త్రాగండి మీకు ముక్తి (వ్యాధి నిర్మూలన) ని ఇస్తుంది. అన్నారు.

**ఓం నమో భగవతే వాసుదేవాయనమః**

ధారావాహికం



# శ్రీ కృష్ణ తత్వం

– రాళ్ళబండి శ్రీనివాసన్

కృష్ణ భగవానుని సభా ప్రవేశాన్ని ఈవిధంగా వర్ణించాడు వ్యాసమహర్షి – కృష్ణుడు రథాన్ని దిగిన తరువాత ఒక చేత్తో విదురుణ్ణి మరొక చేత్తో సాత్యకిని పట్టుకుని నడిచాడు.అతనికి ముందు యాదవవీరులునూ అనుసరించారు.

ధృతరాష్ట్రునితో సహా భీష్మద్రోణాదులు తమ తమ ఆసనాలను విడిచిపెట్టి నిలబడినారు. ఇక తక్కిన వేలాది రాజులు ఒక్కుమ్మడిగా లేచినారు. నమస్కరిస్తూ నిలబడ్డారు.

కృష్ణునికి సర్వతోభద్రమైన మహార్హ వజ్రవైడూర్య విచిత్రమైన హేమసింహాసనం సిద్ధపరచబడింది.

అంతరిక్షంలో మహర్షులు కొలువుదీరి వుండటాన్ని గమనించాడు కృష్ణుడు.

ధృతరాష్ట్రునితో అంటున్నాడు కృష్ణ భగవానుడు – రాజా! కురుపాండవులకు శాంతిని చేకూర్చాలని వచ్చినాను. నీ వాళ్లు దుర్యోధనాదులు ధర్మార్థాలను ఏమాత్రం పాటించకుండా కేవలము దుర్మార్గులై ప్రవర్తిస్తున్నారు. దానితో భవిష్యత్తులో భయంకరమైన విపత్తు సంభవించక తప్పదు. అందుకని పాండవులను నేను నియంత్రిస్తాను. నీవు నీ పుత్రులను నియంత్రించు –ఆ విధంగా ప్రారంభించి – యుద్ధం వలన సంభవించే అనర్థాలను వివరించాడు.

పోగాలం దాపురించినపుడు సజ్జనుల మాటలను పెడచెవిని పెడతారు కదా. దుర్యోధనుడు కృష్ణుణ్ణి బంధించాలని తలచాడు. కృష్ణ భగవానునుడు తన దివ్యమైన రూపాన్ని సంకల్పించినాడు. అంతే – అతని ఫాలభాగంలో బ్రహ్మదేవుడు – ఇక వక్షఃస్థలంలో రుద్ర దేవుడునూ ఆవిర్భవించారు. సర్వలోకపాలురును అనేకానేక బాహువులపై ఉద్భవించారు. ఇకపోతే ముఖం నుంచి అగ్ని ఆవిర్భవించింది. ఇంద్రుడు ఆదిత్యులు సాధ్యులు వసువులు విశ్వదేవతలు ఇంకనూ మరుత్తులు ఉద్భవించారు. శంఖ చక్ర గదాదులే కాదు – లెక్కలేనన్ని బాహువుల్లో నుంచి దివ్యాయుధాలు ఉద్భవించినాయి. కన్నుల్లో చెవుల్లో ధూమసహితమైన అగ్నులు – తరువాత రోమకూపాల్లోంచి సూర్యకాంతులు దిక్కులంతటా వ్యాపించాయి.

భగవానుడు ప్రసాదించిన దివ్యదృష్టితో భీష్మద్రోణులు – విదుర సంజయులు మహర్షులు తప్ప తక్కిన వారందరూ దర్శించలేకపోయారు.

ఆనాడు ద్రౌపదికి జరిగిన పరాభవాన్ని మరచిపోలేదు కృష్ణుడు. కౌరవుల దగ్గరికి రాయబారిగా వెళ్లాలనుకున్నపుడు – ధర్మరాజు శాంతి మంత్రాన్ని వల్లించగా – తక్కిన తమ్ముళ్లు అందరూ దానికి వంతపాడినపుడు – ద్రౌపదికి వళ్లు మండిపోయింది. పదమూడేళ్లగా తాను అవమానాగ్నిని కొంగున భరించిన విధానాన్ని – పరిదేవనాన్ని అందరితో పాటుగా విన్నాడు కృష్ణుడు.

ద్రౌపదీ! పొల్లుపోదు – నా మాట – నీ మనోభీష్టము నెరవేరకపోతే – ఆకాశం జారిపడిపోవుగాక! ఇక భూమి బద్దలు బద్దలైపోవు గాక! సముద్రం ఇంకిపోవచ్చు గాక! ఇదే ఇదే నా ప్రతిజ్ఞ. అందుకుగాను సంధికి బదులు యుద్ధాన్ని ఖాయపరచుకుని వచ్చాడు కృష్ణుడు.

ఈనాడు రోజుకు ఒక చోట మానభంగమో – అత్యాచారమో చేసాక – పెట్రోలు పోసి – కాల్చి బూడిద చేస్తున్న సంఘటనలు కోకొల్లలు. ఆ దుర్మార్గులు పట్టుబడినప్పటికి – న్యాయస్థానాలు మరణశిక్ష విధించినా – రాష్ట్రపతి దగ్గరికి క్షమాభిక్ష కోసం వెళ్ళడంతో వెంటనే శిక్ష అమలు కాకుండానే కొన్ని ఏళ్ళు గడుస్తున్నాయి. ఫాస్ట్ ట్రాక్ కోర్టులలో తిరుగులేని శిక్ష అమలు కావాలి. అపుడే నేరం చేయాలంటే భయం కలుగుతుంది.

యుద్ధ రంగంలో పాండవులను జయించలేమని –



జూదమాడి వాళ్లని రాజ్యభ్రష్టులను చేయాలని కుట్రని పూనినాడు దుర్యోధనుడు. వెన్వెంటనే కృష్ణా! నీవు తలచుకునివుంటే ఆ జూదాన్ని ఆపగలవాడవు. అపుడు పాండవులు అడవుల పాలవడమూ – ద్రౌపదికి అవమానమూ జరిగేవి కావుకదా అని ఉద్ధవుడు అడిగాడు కృష్ణుణ్ణి.

ఉద్ధవా! శకుని దుర్యోధనుల కుతంత్రం నాకు తెలుసు. అయితే ధర్మజుడు నన్ను పిలవాలని అనుకోలేదు. పిలిస్తే వెళ్లకుండా వుంటానా? ఇక పైగా నన్ను అటు రాకుండా వుండాలని మనసులో ప్రార్థించాడు.

దుర్యోధనుడు తన బదులు శకునితో ఆడించిన మేధావి. ఓడినపుడైనా ఇక ధర్మరాజు నన్ను తలచుకునివుంటే – అది వేరే విషయం. ఏది ఏమైనా ద్రౌపది శరణాగతికి స్పందించాను. ఆ విధంగా ధర్మజుడు నన్ను రక్షించవయ్యా అని వుంటే ద్రౌపదికి జరిగిన అత్యాచారానికి కౌరవుల తలలు నరికేసేవాడను. ఆ దుష్టుల్ని శిక్షించడానికి పధ్నాలుగేళ్లు పట్టి వుండేవి కావు.

అయితే కృష్ణా! నిన్ను తలచుకుంటే గాని రక్షించవా అని ప్రశ్నించాడు ఉద్ధవుడు.

అంతే కదా! నేను ఎల్లప్పుడూ జీవులకు పక్కనే ఉంటాను. నన్ను తలచుకుంటే వెంటనే చేయూత నిస్తాను. లేకపోతే కర్మఫలాన్ని అనుభవించక తప్పదు.

**తత్ ప్రసాదాత్ వార్ ష్ణేయ! రాజ్యం ప్రాప్తం మయానఘ ।**
**ప్రసాదా దేవ వీర శూన్యం రాష్ట్రం సుదుర్గమమ్ ॥**

ధర్మజుడు అంటున్నాడు – కృష్ణా! నీ దివ్యమైన అనుగ్రహం వలన నాచేత రాజ్యం పొందబడింది. నీ దివ్యమైన అనుగ్రహం చేతనే శూన్యమైన ఈ ప్రదేశం దుర్గమమైన నగరముగా రూపుదిద్దుకున్నది. ఇక మాకు నీవే గతి తల్లి తండ్రి దైవమని —ఆ విధంగా స్తుతించిన ధర్మరాజు తాను జూదానికి పిలవబడినపుడు – అతడు కృష్ణుని అభిప్రాయాన్నికానీ తోడునుగాని తిరస్కరించాడంటే కేవలం కర్మప్రభావమే అనాలి.

ఒకవేళ ఏమైనా ధర్మజుని పిలుపుమేరకు కృష్ణుడు కనుక హస్తినాపురానికి వెళ్లివుంటే – జూదం లేదు. శకుని కణికుని ప్రేరణలతో దుర్యోధనుని ఆటలనేవి సాగివుండేవి కావు.

కురుక్షేత్ర సంగ్రామంలో మూడవనాటి యుద్ధంలో భీష్ముడు విజృంభించి – అటు కృష్ణుణ్ణి – ఇటు అర్జునుణ్ణి బాణాలతో గాయపరిచాడు. కురువృద్ధుడైన భీష్మపితామహుని నిలవరించగలవారు పాండవసేనలో ఒక్కడంటే ఒక్కడు లేరని కృష్ణునికి తెలిసిపోయింది. అర్జునుడు కూడా తూలిపోతున్నాడు.

ఆయుధాన్ని పట్టను. యుద్ధం చేయనని కృష్ణుని ప్రతిజ్ఞ. ఆయుధాన్ని పట్టిస్తానని భీష్ముని ప్రతిజ్ఞ. ఇపుడు తన ప్రతిజ్ఞ భంగమైనా పర్వాలేదు – తన భక్తుని ప్రతిజ్ఞను నెరవేర్చగలిగాడు కృష్ణుడు. చక్రాయుధాన్ని పట్టి– ఉరికాడు.

కుప్పించి ఎగసిన కుండలమ్ముల కాంతి గగనభాగంబెల్ల కప్పుకొనగ శ్రీకృష్ణుడు కరిపైకి లంఘించు సింహమ్ము కరణి –ఇది పోతన శైలి. భక్తిరసతుందిలం. తిక్కన తీర్చిదిద్దిన కృష్ణుడు లీలామానుష వేషధారి. ఆఖరికి అర్జునుడు కృష్ణుణ్ణి అడ్డుకున్నాడు.

యుద్ధరంగంలో కృష్ణభగవానుడు గీతోపదేశం చేస్తుంటే అర్జునుడు చేతులు కట్టుకుని వున్నాడు. అంపశయ్యపై వున్న భీష్మపితామహుడు విష్ణు సహస్రనామ స్తోత్రం చెబుతుంటే – అదే కృష్ణుడు చేతులు కట్టుకుని వున్నాడు. భీష్ముడు అంటున్నాడు కృష్ణునితో–

కృష్ణా! ఆనాడు కుప్పించి పైకెగిసినపుడు నీ కుండలాల కాంతులు గగనమంతా వ్యాపించాయి. ముందుకు దూకినపుడు నీ బొజ్జలోని ముజ్జగాల బరువుకు భూమి కంపించింది. చేత చక్రాన్ని ధరించి వస్తున్న నీ వేగానికి భుజంపై వున్న బంగారు వుత్తరీయం జారిపోయింది. ఏనుగు మీదకి లంఘించే సింహంలా నాపైకి దూకే – ఆనాటి నీ దివ్యమైన కళ్యాణ మంగళకరమైన రూపాన్ని నా హృదయంలో బాగా పదిలపరచుకున్నాను.

**కృష్ణ ఏవం భగవతి మనోవాక్ దృష్టి వృత్తిభిః ।**
**ఆత్మన్యాత్మానమావేశ్యసః అంతఃశ్వాస ఉపారమత్ ॥**

మనోవాక్ దృష్టి వృత్తులతో బుద్ధిని ఆత్మస్వరూపుడైన కృష్ణభగవానునిలో లీనం చేసాడు భీష్ముడు. ఆ వెంటనే ఆయన ప్రాణాలు కృష్ణభగవానునిలో ఐక్యమైనాయి.

మన యశోద చిన్ని మగవానిని కన్నదట – చూచివత్తము రారమ్మా అని గోపికలందరూ నందయశోదల ఇంటికి వెళ్లారు.ఏ

తల్లి చనుబాలు ఎరుగనివాడు
– యశోదమ్మ పాలిస్తే తాగాడు
కన్నయ్య – కన్నతల్లి దేవకీదేవికి
ఆ భాగ్యానికి నోచుకోలేపోయింది.
శ్రీహరి తమకు కొడుకుగా పుట్టాలని
కోరినారు దేవకీవసుదేవులు.
ఆ స్వామి బాల్య క్రీడలను –
లీలావిలాసాలను చూడాలని
కోరింది యశోదమ్మ. ఆ ఇద్దరి
తల్లుల కోరికలు తీర్చాడు కృష్ణుడు.
ఒక తల్లికి పుట్టి అదే రాత్రి వేరొక
తల్లి చెంతకు చేరాడు.

రాక్షసియైన పూతన కంసుని
ఆదేశంతో వ్రేపల్లె చేరింది. తర్వాత
శిశువులను వెతుక్కుంటూ
అప్రయత్నంగా నందుని ఇంట్లోకి
దూరింది. అక్కడ చిన్ని కృష్ణుణ్ణి
చూసింది. తొట్టిలో పడుకున్న
స్వామి – నివురుగప్పిన నిప్పులాగా
దివ్యమైన తేజస్సుని సంపూర్తిగా
కప్పిపుచ్చుకొని అర్ధనిమీలిత
నేత్రుడై వున్నాడు.

దుర్మార్గుడైన దుర్యోధనుని
మాట వినకపోతే ఏవిధమైన
అకృత్యానికి పాల్పడుతాడోనని
భీష్మద్రోణాదులు సహితం
మిన్నకున్నారు.

ఆ మరుసటి రోజున
ద్వారపాలకులు కృష్ణుడు
వస్తున్నాడని బహుపరాక్ పలికారు.
ఇక అందరూ దుర్యోధనుని వైపునకే
చూస్తున్నారు. సుయోధనుడు
ఒక్కడే కృష్ణుడు వచ్చే ద్వారంవైపు
చూస్తున్నాడు. లోపలికి ప్రవేశిస్తున్న
కృష్ణుని చూసీ చూడగానే తనకు
తెలియకుండానే అప్రయత్నముగానే
లేచాడు – నమస్కరించాడు.
అందరూ అతనిని అనుసరించారు.
కృష్ణునిలోని అమితమైన
ఆకర్షణాశక్తి కృష్ణ తత్వం కొందరికి
ఏమాత్రమూ అర్థం కాదు.

★★★

# మీ ప్రశ్న - మా సమాధానం

**నిర్వహణ: డా. మరింగంటి లక్ష్మణాచార్యులు**

**1. జీవితంలో సుఖంగా ఉండాలి అంటే ఏం చెయ్యాలి?**

**– సరిత, బి.హెచ్.ఈ.ఎల్**

జవాబు – మంచి ప్రశ్న. మీకు సప్తస్వరాలు తెలుసు కదా! స రి గ మ ప ద ని స. వీటిని మనం పెద్దలు చెప్పిన విధంగా మరో రకంగా అన్వయించుకోవాలి.

స – సన్మార్గ గమనం = మంచి దారిలో నడవడం, మంచి పనులు చేయడం.
రి – రిక్కించి వినడం = సూక్తులను, సదుపదేశాలను చెవులు రిక్కించి వినడం
గ – గర్వం లేకుండా ఉండటం.
మ – మనోనిగ్రహంతో, సంయమనంతో జీవించడం
ప – పరోపకారం చేయడం
ద – ధర్మ, దానగుణాలు కలిగి ఉండటం
ని – నిజం, నిజాయితీలనే ఆశ్రయించడం
స – సమభావంతో జీవించడం

**2. విజయ రహస్యం ఏమిటి?**

జవాబు – 1. గొప్ప కలలు కనడంతో పాటు అవి నెరవేర్చుకునే దిశగా శ్రమించి పని చేయాలి.
2.లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి.
3.నిజాయితీగాను, నిరాడంబరతోను ఎప్పుడూ ఉండాలి.
4.ఉత్సాహం, ఉత్తేజాలతో ఉండి, వైఫల్యం నుండి పాఠాలు నేర్చుకోవాలి.
5.కృషి మనది, ఫలితం భగవంతుడిది.
6.వర్తమానంలో జీవించాలి.

**3. మంత్రం అంటే ఏమిటి? ఏ మంత్రం దేనికి మంత్రం? మంత్రాలు ఎన్ని రకాలు? శక్తి ప్రణవాలు అంటే ఏమిటి?**


జవాబు – మంచి ప్రశ్న. ''మననాత్త్రాయత ఇతి మంత్రః'' – మననము చేయువాటిని మననము చేయుట వలన రక్షించునదే మంత్రం. అరణి మథిస్తే అగ్ని పుట్టినట్లుగా మంత్రాన్ని నమ్మకంతో, దీక్షగా జపిస్తే శక్తి పుట్టి అది ఆ జపం చేసే సాధకుడికి కోర్కెలు సిద్ధింపచేస్తుంది.

పరమేశ్వర బీజం 'ఓం'కారం. 'ఈం' లక్ష్మీ బీజం. 'ఐం' అనేది వాగ్బీజం. 'క్లీం' మన్మథ బీజం. 'హ్రీం' శక్తి బీజం. 'గం' గణపతి బీజం. అలాగే 'లం' అనేది పృథివీ బీజం. 'హం' ఆకాశబీజం. 'యం' వాయుబీజం. 'రం' అగ్నిబీజం అయితే, 'వం' అనేది అమృతబీజం అని చెప్తారు. మంత్రాలు 3 రకాలు. అవి వైదికములు, తాంత్రికములు, అపభ్రంశములు.

'ఓం' కారాన్ని ప్రణవం అంటారు. 'శ్రీం, హ్రీం, క్లీం, ఐం, సౌః' – ఈ ఐదూ శక్తి ప్రణవాలు.

**జిజ్ఞాస కలిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలు. భక్తులు తమ ప్రశ్నలను మా పత్రికకు రాయగలరు. – ఎడిటర్, శ్రీవేంకటేశం**

ధారావాహికం



# ధనుర్విద్యా ప్రవీణుడు, వీరుడు అర్జునుడు

– కౌతా నిర్మల

**గత సంచిక తరువాయి**

శ్రీకృష్ణుని మాటలు యుధిష్ఠిరునిలో ధైర్యాన్ని ప్రేరేపిస్తూ, నూతన ఉత్సాహాన్ని నింపాయి.

కురుక్షేత్ర యుద్ధంలో అర్జునుని కుమారుడైన అభిమన్యుడు పద్మవ్యూహంలో చిక్కుకుని, ఆ వ్యూహం లోంచి బయటకు రాలేక, కౌరవుల చేతిలో హతమయ్యాడు. తన పుత్రుని మరణానికి కారణం జయద్రథుడని తెలుసుకున్న అర్జునుడు "తన కుమారుడిని ఒంటరివాడిని చేసి, కుటిల పన్నాగంతో హతుడిని కావించిన జయద్రథుని రేపు సూర్యాస్తమయం లోపుగా సంహరిస్తాన"ని ఆగ్రహావేశాలతో శపథం చేశాడు. తానా విధంగా చేయలేకపోతే మండుతున్న అగ్నిలోకి దూకి ప్రాణాలను అగ్నికి అర్పించి దహించుకుపోతాను" అన్నాడు.

అర్జునుని మాటలు విన్న కౌరవసేనలు, జయద్రథుని రక్షణ కోసం నిమగ్నమయ్యారు. శపథం చేసిన అర్జునుడు శ్రీకృష్ణునిపై భారం వేసి నిశ్చింతగానూ, ఆత్మవిశ్వాసంతోనూ, మనోధైర్యంతోనూ ఉన్నాడు.

సుభద్రతో అర్జునుడు చెప్పాడు "ప్రాణసఖీ! జయద్రథుడు నన్ను కానీ, నా సోదరుడు యుధిష్ఠిరుని కానీ, శ్రీకృష్ణుని కాని శరణు కోరకపోతే రేపు సూర్యాస్తమయ సమయం లోపుగా అతనిని నేను తప్పక వధించి తీరుతాను. జయద్రథ మహారాజును సూర్యాస్తమయం అయ్యేలోగా వధించలేకపోతే, భగభగ మండుతున్న అగ్నిగుండంలోకి దూకి నా ప్రాణాలను అర్పిస్తాను. నేను నా శపథాన్ని నిలబెట్టుకోలేని మరుక్షణం నేనీలోకంలో ఉండను".

ఉద్రేకపూరితమైన భర్త మాటలు విన్న సుభద్ర ఎంతో భీతి చెంది తన భర్తకు విజయం చేకూరేలా చేయమని మనస్సులోనే శ్రీకృష్ణుని ప్రార్థించింది. శ్రీకృష్ణుడు ఏకాంతంగా అర్జుననితో "అర్జునా! నాకు తెలియచేయకుండానే, నాతో సంప్రదించకుండానే జయద్రథుని సంహరిస్తానని భీకరమైన ప్రతిజ్ఞ చేశావు. నీ శపథం విన్న శూరులందరూ జయద్రథుని రక్షించడంలో నిమగ్నులై ఉన్నారు" అన్నాడు. అర్జునుని శపథాన్ని నిలబెట్టవలసిన కర్తవ్యం శ్రీకృష్ణుడి మీద పడింది.

ఆనాటి రాత్రి శ్రీకృష్ణుడు అపరాత్రి సమయంలో రథసారథి అయిన దారకుని పిలిచి, అతనితో "దారుకా! అర్జునుడు అందరికంటే నాకు ప్రీతిపాత్రమయినవాడు. అర్జునుడు రేపు తన శపథాన్ని నెరవేర్చుకోవటానికి జయద్రథుని సంహరించక తప్పదు. రేపు అర్జునుడు కౌరవులలో ఎవరిని అంతమొందించాలనుకున్నాడో, దానికి అడ్డు తగిలే వారందరూ అర్జునుని చేతుల్లో హతమవడం ఖాయం. అర్జునుడు తన శపథాన్ని నెరవేర్చుకుని తప్పక విజయం పొందుతాడు. అర్జునుని వెంటబెట్టుకుని నా వద్దకు తీసుకురా" అన్నాడు.

దారకుడు శ్రీకృష్ణుని ఆదేశాన్ని పాటించాడు.

శ్రీకృష్ణుడు అర్జుననితో "అర్జునా! జయద్రథుని చుట్టూరా మహావీరులందరూ అతనికి రక్షణగా ఉన్నారు. రేపు సూర్యాస్తమయం లోపుగా వారి రక్షణ నుండి, కౌరవ సైన్యం నుండి జయద్రథుని తప్పించి సంహరించడం అసాధ్యం. కనుక నేను నీకో ఉపాయాన్ని చెప్తాను. దాని ప్రకారంగా నువ్వు చేశావంటే జయద్రథుని సంహరించవచ్చు. అంతేకాదు అర్జునా! జయద్రథుని సంహరించగానే అతని శిరస్సు నేలమీద పడకుండా ఆ శిరస్సును అతని తండ్రి ఒడిలో పడేటట్లుగా నీ దివ్యాస్త్రాలను ఉపయోగించు. అతని శిరస్సు నేల మీద పడితే అలా చేసిన వారి తల వేయి ముక్కలవుతుంది. ఈ విషయం జ్ఞప్తికి ఉంచుకుని అతని శిరస్సును అతని తండ్రి ఒడిలో పడవేయి. అతనిని సంహరించానన్న సంబరంతో ఈ ముఖ్య విషయాన్ని మర్చిపోవద్దు".

అర్జునుడు శ్రీకృష్ణుడు చెప్పిన మాటలన్నింటినీ శ్రద్ధగా విన్నాడు. ఆ మాటలన్నింటినీ తన మనస్సులో పదిలపరచుకున్నాడు. మర్నాటి ఉదయం కౌరవుల, పాండవుల మధ్య యుద్ధం ఆరంభమైంది. జయద్రథుని రక్షణ విషయంలో కౌరవులందరూ అప్రమత్తంగా ఉన్నారు. జయద్రథుని సంహరించటానికి అర్జుననికి ఎంతమాత్రం అవకాశం లభించటం లేదు. ఆ పరిస్థితిని గుర్తించిన శ్రీహరి తన యోగబలంతో సూర్యభగవానుని కమ్మివేసి, సూర్యుని ప్రకాశం, వెలుగు కనబడకుండా చీకటిని సృష్టించాడు. సూర్యాస్తమయం అయిందని జయద్రథునికి ప్రాణాపాయం తప్పిందని భావించి

కౌరవులు ఆనందంతో జయ జయ ధ్వానాలు చేశారు. అప్పుడు శ్రీకృష్ణుడు అర్జునుడితో ''అర్జునా! సూర్యాస్తమయం ఇంకా కాలేదు. ఇదే మంచి తరుణం. జయద్రథుని సంహరించి అతని శిరస్సును ఖండించి అతని తండ్రి ఒడిలో పడేలా నీ దివ్యాస్త్రాలను ఉపయోగించు''.

అర్జునుడు వెంటనే దివ్యబాణాలను ప్రయోగించి, జయద్రథుని శిరస్సు ఖండించి ఆకాశమార్గం ద్వారా అతని శిరస్సు అతని తండ్రి ఒడిలో పడేటట్లుగా చేశాడు. తృళ్ళిపడిన అతని తండ్రి తన ఒడిలో పడిన కొడుకు ముఖాన్ని చూడకుండానే ఆ శిరస్సును నేలమీదకు నెట్టేశాడు. మరుక్షణమే అతని తండ్రి తల వేయి ముక్కలుగా పగిలిపోయింది. శ్రీకృష్ణభగవానుని సహాయంతో అర్జునుడు తన శపథాన్ని నెరవేర్చుకున్నాడు.

కర్ణునికి పాండవులలో అర్జునుని పట్ల ద్వేషం, వైరభావాలు అమితంగా ఉన్నాయి. తాను అర్జునుని సంహరించగలనన్న ధైర్యం, ఆత్మవిశ్వాసం కర్ణునిలో మెండుగా ఉన్నాయి. అందుకు కారణం కర్ణుడి వద్ద ఇంద్రుడు ప్రసాదించిన అమోఘమైన శక్త్యాయుధం ఉంది. అయితే ఆ శక్తి ఆయుధం ఒక్కసారి మాత్రమే పని చేస్తుంది. ఆ శక్తి ఆయుధాన్ని అర్జునుని మీద ప్రయోగించాలని కర్ణుడు దాచి ఉంచాడు. ఆ శక్తిని అవసరమైనప్పుడు అర్జునుడి మీద ప్రయోగించి, అర్జునుని సంహరించాలన్న ఆలోచనలో ఉన్నాడు కర్ణుడు. యుద్ధసమయంలో అర్జునుడు ఎదురయినప్పుడు కర్ణుడు తన వద్ద ఉన్న శక్తిని మరచిపోయేవాడు. అందుకు కారణం శ్రీకృష్ణుడు అర్జునునిపైన కర్ణుడు శక్తి ఆయుధాన్ని ప్రయోగించకుండా అతడిని సమ్మోహన పరచి, ఇంద్రుడి ద్వారా కర్ణుడు పొందిన శక్తి ఆయుధాన్ని మరచిపోయేలా చేసేవాడు.

కర్ణుడిని భీముని పుత్రుడైన ఘటోత్కచుడు యుద్ధంలో ఎదుర్కొనేటట్లుగా చేశాడు శ్రీకృష్ణుడు. తన రాక్షస మాయతో ఘటోత్కచుడు యుద్ధంలో ఎదుర్కొనేటట్లుగా చేశాడు శ్రీకృష్ణుడు. తన రాక్షస మాయతో ఘటోత్కచుడు యుద్ధంలో కౌరవసైన్యాన్ని ఎంతోమందిని సంహరించాడు. తన పరాక్రమంతో, ధైర్య సాహసాలతో కౌరవులను, ప్రాణభీతికి గురి చేశాడు. దుర్యోధనుడు భీమపుత్రుని శూరత్వానికి మిగుల భీతి, ఆందోళన చెందాడు. ''కర్ణా! నీకు ఇంద్రుడు ప్రసాదించిన శక్త్యాయుధాన్ని అతడి మీద ప్రయోగించు. ఘటోత్కచునితో తలపడటం దుర్లభమన్న అనుమానం కలుగుతోంది. అతని చేతిలో ప్రాణాలు కోల్పోవడం తథ్యమనిపిస్తోంది'' అని చెప్పాడు దుర్యోధనుడు అర్జునుడితో.

వారందరి మాటలు, దుర్యోధనుని అభ్యర్థనను తిరస్కరించలేక, విధి లేక తన శక్త్యాయుధాన్ని రాక్షసుడు, అతి బలవంతుడు, శూరుడు అయిన ఘటోత్కచుని పైన ప్రయోగించాడు కర్ణుడు. ఆ ఆయుధంతో ఘటోత్కచుడు మరణించాడు. అమిత పరాక్రమంతో తమ మీద విరుచుకుపడిన ఘటోత్కచుని మరణానికి కౌరవులు ఆనందంతో పొంగిపోతుంటే, పాండవులు దుఃఖంతో క్రుంగిపోయారు. కాని శ్రీకృష్ణుడు మాత్రం సంతోషంతో, ఎంతో ప్రేమతో అర్జునుని ఆలింగనం చేసుకున్నాడు. అప్పుడు అర్జునుడు విస్మయంతో శ్రీకృష్ణుని ''కృష్ణా! ఘటోత్కచుని మరణానికి మేమంతా ఇంతగా తల్లడిల్లిపోతుంటే, నువ్వు మాత్రం ఏ బాధా లేనట్లుగా, నవ్వుతూ ఆనందపడటమేమిటి? దాని వెనుక ఏదైనా అంతరార్థం, కారణం ఉండవచ్చు ననుకుంటున్నాను. అదేమిటి?'' అన్నాడు.

''అర్జునా! నీ సందేహం నిజమే. ఘోటత్కచుని మరణం వల్ల నీకెటువంటి ఆపద, అనర్థము, ప్రాణాపాయము ఏర్పడదని ఆనందపడుతున్నాను. ఇంద్రుడు కర్ణునికి ప్రసాదించిన దివ్య



శక్త్యాయుధమును ఒక్కసారి మాత్రమే ఉపయోగించాలి. అందువల్ల ఆ ఆయుధాన్ని నీ మీద ప్రయోగించి నిన్ను హతమార్చాలనుకున్నాడు కర్ణుడు. ఇప్పుడు ఆ ఆయుధాన్ని కర్ణుడు కోల్పోయాడు. కనుక నీకు ఎటువంటి ప్రాణాపాయం ఏర్పడదు. అందుకే నేను ఆనందపడుతున్నాను'' అన్నాడు.

శ్రీకృష్ణుని ఆంతర్యాన్ని గ్రహించిన అర్జునుడు ఆయనకు శిరస్సు వంచి నమస్కరించాడు.

యుద్ధంలో అవిరామంగా శ్రమించడంతో అశ్వాలు చాలా అలసటకు గురయ్యాయి. వాటికి ఆకలి, దప్పులు ఏర్పడ్డాయి. వాటి శరీరాలకు బాణాలు గుచ్చుకున్నాయి. అర్జునునితో శ్రీకృష్ణుడు ''అర్జునా, గుఱ్ఱాలు అలసిపోయాయి. దప్పికతో బాధపడుతున్నాయి. దగ్గరలో ఎక్కడా జలాశయం లేదు. ఇప్పుడేం చేయాలి?'' అన్నాడు.

వెంటనే అర్జునుడు అస్త్ర ప్రయోగంతో భూమిని ఛేదించి నీరు పైకి ఉబికేటట్లుగా చేశాడు. ఆ నీరంతా ఒక చెరువులాగా ఏర్పడింది. ఆ లోపుగా శ్రీకృష్ణుడు గుర్రాల శరీరాలకు గుచ్చుకున్న బాణాలను తీసివేసి, వాటిని నీటితో శుభ్రపరిచాడు. ఆ అశ్వాలు ఆ నీటితో దప్పిక తీర్చుకున్నాయి. మేతమేసి ఆకలిని కూడా పోగొట్టుకొని, కొంత సమయం నేలమీద పరుండి, తమ అలసటను తొలగించుకొని నూతన ఉత్సాహాన్ని పెంపొందిచుకున్నాయి. అర్జునుని చర్యను అంటే భూమిలోంచి నీటిని తెప్పించటం చూసి ఆ అద్భుతానికి వారి సైనికులే కాక, శత్రుసేన కూడా ఆశ్చర్య చకితులయ్యారు. అర్జునుని శస్త్ర విద్యా ప్రావీణ్యతను అనేక విధాలుగా కొనియాడారు.

కురుక్షేత్ర సంగ్రామంలో అశ్వత్థామ పాండవుల మీద ఆగ్నేయాస్త్రాన్ని ప్రయోగించాడు. నాలుగు దిక్కులా ఆ అస్త్ర ప్రయోగం వల్ల అగ్నిజ్వాలలు చుట్టుముట్టాయి. ఆ అస్త్రం వల్ల పాండవుల సైన్యం దగ్ధమయింది. అటువంటి క్లిష్టపరిస్థితిని మనోధైర్యంతో ఎదుర్కొన్నాడు అర్జునుడు. అతడు ఒంటరిగా పోరాటాన్ని సలిపాడు. అస్త్రం యొక్క అగ్ని ప్రభావం శ్రీకృష్ణుని మీద కానీ, అర్జునుడి మీద కానీ ప్రసరించలేదు. తాను ప్రయోగించిన ఆగ్నేయాస్త్రం వారిరువురి మీద ఎటువంటి ప్రభావం చూపకపోవడంతో అశ్వత్థామకు మిక్కిలి ఆగ్రహం కలిగింది. తన చేతిలోని వింటిని దూరంగా విసిరేసి అక్కడనుంచి వెళ్ళిపోతుండగా అశ్వత్థామకు వ్యాస మహర్షి కనిపించాడు. ''మహాత్మా! అందరిమీద నేను ప్రయోగించిన ఆగ్నేయాస్త్రం ప్రభావం చూపింది. కానీ అర్జునుడిని, శ్రీకృష్ణుడిని ఆ మంటలు ఏమీ చేయలేకపోయాయి. ఎందుకలా జరిగింది మహర్షీ?'' అని ఆ మహర్షికి వినయంగా నమస్కరించి అడిగాడు అశ్వత్థామ.

**(ఇంకా ఉంది)**

# పద్నాలుగు లోకాలలో భూలోకం అత్యుత్తమమైనది

ఈ భూలోకంలో భరతఖండం ఇంకా ఉత్తమమైనది. ఇక్కడ మానవుడిగా పుట్టడం ఎన్నో జన్మల పుణ్యఫలం. ఎందుకంటే ఇది కర్మభూమి. సులభంగా మోక్షం ఇచ్చే భూమి. ఎందరో దేవతలు కొలువై ఉన్న భూమి. విష్ణుమూర్తి అవతారాలు దాల్చిన భూమి. కష్టం వెనుకే సుఖం, సుఖం వెనుకే కష్టం. నిత్యం పోరాడుతూనే ఉంటాడు మానవుడు. సులభంగా ఆ విష్ణువు సేవ చేయగల అవకాశం కేవలం మనిషికే సొంతం. ఒక సందర్భంలో కుంతీదేవి (పాండవుల తల్లి) శ్రీకృష్ణుడితో ఇలా అంది.

కృష్ణుడు ఒక సందర్భంలో కుంతితో ఇలా అన్నాడు. అత్తా కష్టం వస్తే వెంటనే తలచుకుని పిలుస్తావు. నేను వస్తాను. కానీ కష్టాలు పూర్తిగా తొలగిపోవాలని ఎందుకు కోరవు?

కృష్ణా! కష్టాలు తాత్కాలికంగా ఉంటాయి. అవి వచ్చినప్పుడు మాత్రమే నిన్ను తలుస్తాము. ఆ కష్టాలు లేకపోతే నిన్ను మర్చిపోతాం క్రిష్ణయ్యా. సకల జీవజాతికి ఆధారం నువ్వు. ఒక సమయంలో నువ్వు ఉంటావు. అదే సమయంలో ఉండవు. ప్రతి జీవిలో ఆత్మరూపంలో కొలువై ఉన్నావు. ఈ విశ్వానికి సృష్టికర్తవి నువ్వు. ఆ కష్టం అనేది లేకపోతే నీకు సేవ చేసే భాగ్యం దొరకదయ్యా. దేవతలకి కూడా నీ సాక్షాత్కారం దుర్లభం. అలాంటిది మాకు మాత్రం కష్టం కలిగిందని పిలవగానే పలుకుతావు.

దేవతలకి కూడా సాధ్యం కాదు ఆయనకి సేవ చేయడం. అలాంటిది మనం అనుకున్నదే తడవుగా గుడికి వెళతాం. పూజ చేస్తాం. ఏదో ఒకటి కోరుకుంటాం. ఈ అధికారం మానవుడికి తప్ప దేవతలకి సాధ్యం కాదు. ఎందుకంటే దేవతలు వారి నిత్య కార్యాలలో నిమగ్నమై ఉంటారు. చేసే కార్యాలు మానేసి విష్ణు సేవ చేయడానికి అర్హత లేదు. సూర్యుడు ఉదయించడం అస్తమించడం మానేసి విష్ణువు లేదా శివుడి దగ్గరికి వెళితే లోకాలు అల్లకల్లోలం అయిపోతాయి. అలాగే వాయువు, అగ్ని వారి వారి రోజువారీ కార్యకలాపాలు ఆపేస్తే లోకాలనేవి ఏమీ మిగలవు. అలాగే రాక్షసులు. వీరికి ఎన్నో వేల ఏళ్ళు తపస్సులు చేస్తే తప్ప శివకేశవుల సాక్షాత్కారం కుదరదు. కాని ఒక్క మానవుడు మాత్రం కేవలం నామస్మరణతో అవలీలగా మోక్షాన్ని పొందుతాడు.

**''ఓం నమో భగవతే వాసుదేవాయ''**

# పీఠికాపుర క్షేత్ర వైభవం

– శ్రీమతి వెలమకన్ని పద్మావతి



ఎన్నో పుణ్యక్షేత్రాలకు ఆలవాలమైన కాకినాడ జిల్లాలో జిల్లా ప్రధాన కేంద్రమైన కాకినాడకు 18 కిలోమీటర్ల దూరంలో అన్నవరం వెళ్ళే దారిలో 214వ హైవేలో ఈ పిఠాపుర క్షేత్రం అలరారుతోంది. క్రీ.శ 210 వ సంవత్సరంలో ఈ పిఠాపురం రాజులయిన శాతవాహనుల పాలనలో వుంది. శ్రీనాథ కవిసార్వభౌముడు భీమ మండలంలో పర్యటన కావించి 1428–30 సంవత్సరాల మధ్య భీమేశ్వర పురాణం రచించాడు. ఆ గ్రంథంలో పిఠాపురం ప్రసక్తి ఉంది. ఇలా ఈ పిఠాపురం ప్రాచీనమైన క్షేత్రం అని చెప్పడానికి అనేక నిదర్శనాలు ఉన్నాయి. అనేక శాసనాలలో ఈ పట్టణ నామం పిష్టపురంగా వుంది. కొన్ని శాసనాలలో పిఠాపురమనీ, శ్రీపీఠమనీ వుంది. పురుహూతికా పురం లేదా పురుహూతికా పట్టణం అని కూడా ఒకప్పుడు వాడుకలో ఉంది. శ్రీనాథుడు తన గ్రంథాలలో ఈ క్షేత్ర ప్రసక్తి వచ్చినప్పుడు, పీఠికాపురం పిఠాపురం పీఠాపట్టణం అని వ్యవహరించాడు. ఈ క్షేత్రానికి ''పెట్టపురం'' అనే పేరు కూడా ఉన్నట్లుగా కీ.శే. దువ్వూరి జగన్నాథ శర్మ గారు తన విశ్వసుందర విజయంలో ప్రకటించారు. భీమమండలంలోని ద్వాదశ పుణ్యక్షేత్రాలలోను ఈ పిఠాపురం దైవనిర్మితమైనదని శ్రీనాథుడు తన భీమేశ్వర పురాణంలో పేర్కొన్నాడు. ఇట్టి పిఠాపురం త్రిగయలలో పాదగయగా, శివక్షేత్రాలలో కుక్కుటేశ్వరంగా, అష్టాదశ పీఠాలలో పుర్హూతికా శక్తిపీఠంగా, పంచ మాధవాలలో కుంతీ మాధవ క్షేత్రంగా, దత్త క్షేత్రంగా, హుంకారిణీ శక్తి కేంద్రంగా విలసిల్లుతోంది. ముందుగా మనం పాదగయా క్షేత్రం గురించి తెలుసుకుందాం. పూర్వం గయాసురుడు అనే రాక్షసుడు పిఠాపురంలోని పుర్హూతికా శక్తిపీఠాన్ని సేవించి సర్వశక్తి సంపన్నుడైనాడు. అష్టసిద్ధుల్ని – నవనిధుల్ని సాధించాడు. విష్ణుమూర్తిని గురించి అనేక దివ్య సంవత్సరములు తపస్సు చేశాడు. అంతట విష్ణుమూర్తి ప్రత్యక్షమై వరము కోరుకొనమనగా –''అన్ని పుణ్యతీర్థముల కన్నా నా దేహము పవిత్రము అగునట్లుగా వరము అనుగ్రహించుము'' అని కోరుకున్నాడు. ఆ వరాన్ని ప్రసాదించి విష్ణుమూర్తి అంతర్ధానమయ్యాడు. వర ప్రభావము వలన గయాసురుని శరీరముపై నుండి వచ్చు గాలి సోకినంతనే జనులు పాపవిముక్తులయ్యేవారు. ధర్మాత్ముడైన గయాసురుడు అనేక అశ్వమేధాది పుణ్యక్రతువులు చేశాడు. ఫలితంగా గయాసురునికి ఇంద్రపదవి దక్కింది. పదవీచ్యుతుడైన ఇంద్రుడు బ్రహ్మ విష్ణు మహేశ్వరుల గురించి పదివేల సంవత్సరాలు కఠోర తపస్సు కావించాడు. దేవేంద్రుని తపస్సుకు మెచ్చి ప్రత్యక్షమైన త్రిమూర్తులు వరం కోరుకోమని ఇంద్రుణ్ణి అడిగారు. రాక్షసుడైన గయాసురుని పాలనలో దేవతలు, ప్రజలు అనేక కష్టాలు అనుభవిస్తున్నారు. గయాసురుడు ధర్మాత్ముడైనప్పటికీ దుష్టులైన అతని అనుయాయులు భూలోకములోని జనులను సంహరించుట, యజ్ఞ యాగాది క్రతువులను భగ్నము



చేయుట, పతివ్రతలను చెఱచుట, తపోధనులైన మహాత్ములను హింసించుట – మొదలగు అకృత్యములు చేయుచున్నారు. తపో దాన యజ్ఞాదులను ఆటంకపరిస్తే దేవతలను బలహీన పరచవచ్చునని వారి పన్నాగము. పంటలు పండక మానవులు కష్టాలు పడుచున్నారు. భూమి ఎడారిగా మారినది. ఏదో ఒక ఉపాయము చేత గయాసురుని వధించి, నాకు త్రిలోకాధిపత్యము ఇప్పించండి. దేవతలకు వారి వారి అధికారాలు ఇప్పించండి. అట్లు చేసినచో మరల యజ్ఞ యాగాది క్రతువులు జరిగి వర్షములు కురిసి సకల ప్రాణికోటి సుఖసంతోషములతో అలరారుతారు'' అని ఇంద్రుడు త్రిమూర్తులకు చెప్పాడు. ఇంద్రునకు ఇచ్చిన వరదానమును నెరవేర్చుటకు బ్రహ్మ విష్ణు మహేశ్వరులు బ్రాహ్మణ వేషధారులై గయాసురుని వద్దకు వెళ్ళారు. అతిథులుగా విచ్చేసిన ముగ్గురినీ గయాసురుడు అర్ఘ్య పాద్యాదులచే పూజించి, మీరు విచ్చేసిన కార్యం తెలుపమన్నాడు.

''ఓ ధర్మాత్మా! మాకు స్వంత కోరికలు ఏమీ లేవు. నీవు ధర్మాత్ముడవు. త్రిలోకాధిపతివి. నీ పరిపాలనలో దుర్భిక్షము వలన పాడిపంటలు లేక ప్రజలు బాధపడుచున్నారు. వారి బాధలు తొలగిపోయి విశ్వశాంతి నెలకొనుటకు మేము ఒక యజ్ఞము చేయ తలపెట్టినాము. ఈ యజ్ఞము ఏడు రోజులు నిర్విఘ్నంగా చేయాలి. అప్పుడు సకల జీవరాశులకు సుఖశాంతులు కలుగుతాయి'' అని చెప్పారు. అప్పుడు గయాసురుడు – ''ఆ యజ్ఞమును శీఘ్రముగా చేయండి. గోవులు – దక్షిణలు – యజ్ఞ సంభారాలూ – యజ్ఞ వేదికా స్థలం – ఇలా ఏమి కావాలన్నా నేను సమకూరుస్తాను. లోక కళ్యాణార్థం నా దేహాన్ని అయినా త్యాగం చేస్తాను'' అన్నాడు.

''అన్నీ మేము సమకూర్చుకొన్నాం. యజ్ఞవేదికగా నీ దేహాన్ని అంగీకరిస్తే చాలు. ఈ యజ్ఞభారాన్ని భూమిగానీ మరే పుణ్యక్షేత్రం గానీ భరించలేదు. పరమ పవిత్రమైన నీ దేహం మాత్రమే ఇందుకు తగినది'' అని త్రిమూర్తులు చెప్పారు. అందుకు గయాసురుడు అంగీకరించాడు. ''మేము చేయు యజ్ఞము పూర్తి అగునంతవరకు నీవు దేహము కదిలించరాదు. కదలించినచో నిన్ను సంహరిస్తాము. ఇందుకు అంగీకారమేనా?'' అని త్రిమూర్తులు అడగగా గయాసురుడు ఈ షరతుకు కూడా అంగీకరించాడు. గయాసురుడు తన మహిమాశక్తి చేత బీహారు రాష్ట్రమున గల గయా క్షేత్రమున శిరస్సు ఉండునట్లుగా, ఒరిస్సా రాష్ట్రములోని జాజిపూర్ నందు నాభిస్థానం ఉండునట్లుగా, ఆంధ్రప్రదేశ్ జిల్లాలోని కాకినాడ జిల్లాలో పిఠాపురం నందు పాదములు ఉండునట్లుగా తన దేహమును విస్తారముగా చేసి యజ్ఞమును ఆరంభించమని త్రిమూర్తులను ప్రార్థించాడు. గయాసురుని శిరోభాగము వద్ద విష్ణుమూర్తి, నాభిప్రాంతం వద్ద బ్రహ్మ, పాదభాగము వద్ద పరమేశ్వరుడు కూర్చుని యజ్ఞము చేయనారంభించారు. గయాసురుడు యోగవిద్యచే తన దేహమును నిశ్చలముగా వుంచి కోడికూతను మాత్రమే వినుచూ ఎన్ని రోజులు గడుస్తున్నవో లెక్కించుకుంటున్నాడు. ఏ ఆటంకములు లేకుండా ఆరు రోజులు గడిచిపోయినవి. ఏడవరోజున తెల్లవారకుండానే విష్ణుమూర్తి ఆదేశంతో శివుడు లింగోద్భవ కాలమందు కొక్కొరొకో అని కుక్కుటధ్వని చేశాడు. ఏడు రోజులు పూర్తయ్యాయని భ్రమపడి గయాసురుడు తన దేహాన్ని కదిలించాడు. యజ్ఞము పూర్తి కాకుండానే శరీరాన్ని కదిలించావు కనుక నిన్ను సంహరిస్తామని త్రిమూర్తులు గయాసురుని హెచ్చరించారు. గయాసురుడు అంతర్ముఖుడై తన దివ్యదృష్టితో జరిగిన వాస్తవాలను గ్రహించాడు. ''త్రిమూర్తులైన మీ చేతిలో చనిపోవడం ముక్తికరం. నన్ను సంహరించండి'' అన్నాడు గయాసురుడు. ''మరణించే ముందు నువ్వు వరం కోరుకో – మేము అనుగ్రహిస్తాం'' అన్నారు త్రిమూర్తులు.

''మరణించే ముందు నాకు కోరికలు ఏమి ఉంటాయి? అయినా మీరు కోరుకోమన్నారు కాబట్టి కోరుకుంటున్నాను

– నేను చనిపోయిన తర్వాత నా శరీరములోని ముఖ్యమైన మూడు భాగములు నా పేరున త్రిగయా క్షేత్రాలుగా ప్రసిద్ధి చెందాలి. ఆయా క్షేత్రాలలో త్రిమూర్తులైన మీరు ముగ్గురూ వసించాలి. ఆ మూడు క్షేత్రాలు శక్తిపీఠాలుగా విరాజిల్లాలి. అంతేగాక మానవులు చనిపోయిన తమ పితరులను ఉద్దేశించి చేసే కర్మకాండ – పిండప్రదాన – తర్పణాదులు ఈ క్షేత్రములో చేసినచో పునరావృత్తి రహిత బ్రహ్మపదము లభించాలి. ఆఖరుగా ఎక్కడైనా గయ నామోచ్చారణ పూర్వకముగా చేయు పితృకర్మల వలన మాత్రమే గయా శ్రాద్ధ ఫలితమూ, తద్వారా పితృదేవతలకు ముక్తీ కలగాలి'' – అంటూ వరములు కోరుకొనగా త్రిమూర్తులు ఆ వరాలను అనుగ్రహించి, గయాసురుని సంహరించి ముక్తిని ప్రసాదించారు. అలా గయాసురునికి ఇచ్చిన వరప్రభావం వలన త్రిగయా క్షేత్రాలు ఏర్పడ్డాయి. అవి శిరోగయ, నాభిగయ, పాదగయ. ఈ గయా క్షేత్రాలు శక్తిపీఠాలుగా విరాజిల్లుతున్నాయి. త్రిమూర్తులు ఈ గయా క్షేత్రాలలో వెలసి గయాసురుని వరాన్ని నిజం చేశారు.

శిరోగయ బీహారు రాష్ట్రములో ఫల్గుణీ నదీ తీరాన ఉంది. ఇది గయాసురునికి శిరస్సు గల ప్రదేశము. ఇచ్చట విష్ణుమూర్తి పాదముల ఆలయం ఉంది. మంగళగౌరీదేవి శక్తిపీఠం ఈ శిరోగయలో విరాజిల్లుతోంది. నాభిగయ ఒరిస్సా రాష్ట్రము లోని కటక్ కి దగ్గర గల జాజిపూరులో ఉంది. గయాసురుని నాభిగల ప్రదేశము ఇది. యజ్ఞవేదికా స్వరూపంలో బ్రహ్మదేవుడు ఇక్కడ కొలువై ఉన్నాడు. గిరిజాదేవి శక్తిపీఠం ఈ క్షేత్రంలో ఉంది. ఇక పాదగయ ఆంధ్రప్రదేశ్ లోని కాకినాడ జిల్లా పిఠాపురంలో ఉంది. గయాసురుని పాదాలు గల ప్రాంతం ఇది. ఈశ్వరుడు కుక్కుటేశ్వరునిగా ఇక్కడ కొలువై ఉన్నాడు. పుర్హూతికా శక్తిపీఠం ఇక్కడ విరాజిల్లుతోంది. త్రిగయా క్షేత్రాలలో, పాదగయ శ్రేష్ఠమైనదిగా భావిస్తారు. ఈ పాదగయా క్షేత్రములో పితృకార్యములు చేయుట, పిండప్రదానములు చేయుట ముక్తికరంగా, అందరూ భావిస్తారు.

పితృ ముక్తికరమైన క్షేత్రాలు కేవలం అయిదు మాత్రమే ఈ భూమండలంలో వున్నట్లుగా చెప్తారు. అవి – బీహారు రాష్ట్రంలోని శిరోగయ, ఒరిస్సా రాష్ట్రం లోని నాభిగయ, ఆంధ్రప్రదేశ్ లో పిఠాపురంలోని పాదగయ, గుజరాత్ రాష్ట్రంలో సిద్ధిపూర్ లో గల మాతృగయ, ఉత్తరాంచల్ రాష్ట్రంలోని బదరీలో గల బ్రహ్మ కపాలం.

పిఠాపురంలో గయాపాదం, విష్ణుపాదాలు గల ఉపాలయం కుక్కుటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో ఉంది.

ఇక స్వయంభూ శివక్షేత్రమైన కుక్కుటేశ్వరం గురించి తెల్సుకుందాం. గయాసురుని మరణకాలమందు కోరిన కోరిక మేరకు శివుడు కుక్కుటేశ్వరునిగా స్వయంభువ మూర్తిగా ఈ క్షేత్రంలో వెలశాడు. ఇక్కడ శివుడు స్ఫటికలింగమూర్తి. కుక్కుటేశ్వరునిలో కాశీ విశ్వేశ్వరుని, రాజరాజేశ్వరీదేవిలో అన్నపూర్ణాదేవిని – పీఠికాపుర క్షేత్రంలో కాశీ క్షేత్రాన్ని దర్శించి కాశీ వియోగ దుఃఖాన్ని నివారించుకున్నాడు వ్యాసుడు.

**విశ్వేశ్వరుండంచు పిలిచెదరచ్చట**
**కుక్కుటేశ్వరుడటంచు కొలుతురిచ్చట**
**అచట విశాలాక్షియై వెలసెను అంబ**
**రాజ రాజేశ్వరీ రాజ్ఞి యిచట**
**గంగా జలాభిషేకము సేతురచ్చోట**
**పాదగయా పూతవారి నిచ్చట**
**కాశియందు రచట క్రాలెను ఈ పురి**
**దక్షిణ కాశిగా ధరణి నిచట**
**అచ్చట నిచ్చట నెచ్చటనైన నీవె**
**సకల లోకేశుడవు స్వామి! సాంబ! శర్వ**
**అరయ పేరు భేదమె – యిసుమంతలేదు**
**వేరు భేదము కాశికి – పీఠపురికి**

అంటూ కాశీకి, పిఠాపురానికీ అభేదం కల్పించారు కవులు.

**"అథా భజత మేనిశో దేవేశం భక్తవత్సలం**
**విశ్వాత్మకం మహాభాగం శాశ్వతం కుక్కుటేశ్వరమ్"**

అంటూ వ్యాసుడు కుక్కుటేశ్వరునికి నమోవాకాలు సమర్పించాడు. గర్భగుడిలో కుక్కుటేశ్వరుని ప్రక్కనే కొలువై ఉన్న అమ్మవారు హుంకారిణీదేవి! ఈ దేవి హుంకార మంత్రము చేతనే ధూమ్ర లోచనుడు అనే రాక్షసుడిని వధించింది. కావున హుంకారిణీ దేవిగా ఈ క్షేత్రములో వెలసింది.

**"హుంకారిణీం మహాశక్తిమసేవత శివప్రియామ్"**

అంటూ భక్తులు ఈమెను కొలుస్తారు.

స్వామివారికి వామ భాగంలోని ఉపాలయంలో భక్తులకు అభయప్రదానం చేస్తూ రాజరాజేశ్వరీదేవి కొలువై ఉంటుంది. చతుర్భుజుడైన గణపతి, మయూరవాహనుడై చతుర్భుజమూర్తిగా కుమారస్వామి అమ్మవారి ఇరు పార్శ్వాలలోను దర్శనమిస్తారు. ఈ దృశ్యం తిలకించిన భక్తులు లలితా సహస్రనామంలోని ''కుమారగణనాథాంబా'' అనే నామం తలచుకుంటూ పరవశించిపోతారు.

**"కాచిల్లతా తరుః కశ్చిత్పేఠియాం సదద్భుతమ్**
**అపర్ణా సాసతు స్థాణుః దదాతే కాంక్షితం ఫలమ్"**

పీఠికాపురంలో అద్భుతమైన ఒకానొక తీగ – తరువు ఉన్నాయి. ఈ లత అపర్ణా – అంటే ఆకులు లేనిది. ఆ తరువు స్థాణువు. అంటే మోడు. అయినా అవి రెండూ ఆకాంక్షిత ఫలాన్ని ప్రసాదిస్తాయి అని ఈ శ్లోకానికి అర్థం. అపర్ణా – స్థాణువు అనే పదాలను పార్వతీ పరమేశ్వరుల పరంగా సుందరమైన భావన చేసి ఈ శ్లోకంలో శ్రీ దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి గారు చమత్కారంగా అన్వయింప చేశారు.

**(ఇంకా ఉంది)**

# శ్రీ విష్ణుమూర్తి మోహినీ రూపాన్ని ధరించుట

– విద్వాన్ వల్లూరి చిన్నయ్య

మానవజన్మ ధర్మసాధన కోసమే అనే నిత్య సత్యాన్ని ఆనందదాయకుడు, ఆత్మేశుడు అయిన శౌరి ప్రసాదించాడని ప్రజలకు తెల్పి ప్రజలను పరమ ప్రభావితులుగా చేసేది, అహంకారాన్ని వదలి అవనిని పరికిస్తే అంతా బ్రహ్మమయంగా కనిపిస్తుందని, నిస్తుల సందేశంగా నిరుపమాన నిర్మల నీతిదాయకంగా వివరించేది, జగత్తు జన్మిస్తూ గతిస్తూ ఉంటుందనే విషయాన్ని విపులంగా వీనుల విందుగా, విమల వికాసంగా వేదప్రమాణంగా తెల్పేది, అవిద్యను అందలమెక్కించి త్రాడును కాంచి పామనే భ్రమలో పడేవారి అజ్ఞానాన్ని తొలగించి వారి హృదయ పీఠికల్లో జ్ఞానజ్యోతిని వెలిగించేది శ్రీమదాంధ్ర మహాభాగవతం. అలాంటి అమూల్యమైన గ్రంథరాజం లోని అష్టమ స్కంధం నుండి శ్రీవిష్ణుమూర్తి మోహినీ రూపాన్ని ధరించుట అనే అంశం ఆధారంగా ఈ వ్యాసం వ్రాయబడింది.

దేవదానవులు అమృతం కోసం మంధర పర్వతాన్ని కవ్వంగా, వాసుకుని త్రాడుగా చేసుకుని పాల సముద్రాన్ని చిలికారు. చివరిగా అమృత కలశం చేత ధరించి ధన్వంతరి జన్మించాడు.

**ఆ.వె అతని చేత నున్న యమృత కుంభము సూచి**
**కెరలు వొడిచి సురలఁ గికురువెట్టి**
**పుచ్చుకొనిరి యసుర పుంగవు లెల్లను**
**మారులేని బలిమి మానవేంద్ర!**

–ఆంధ్ర మహాభాగవతం – అష్టమస్కంధం – 295 పద్యం

సముద్రం నుండి ధన్వంతరి వెలువడగానే అసురులు, సురులను త్రోసిపుచ్చి అతని చేతినుండి బలవంతంగా లాగుకొన్నారు.

దేవతలు మాత్రం మనకు అమృతభాండం దక్కకుండా పోయింది. ఇక మనకు అమృతప్రాప్తి లేదని విష్ణుమూర్తితో మొర పెట్టుకున్నారు. మీరు భయం విడనాడండి. మహోన్నతమైన నా మాయా ప్రభావంతో అమృతాన్ని అందజేస్తానని విష్ణుదేవుడన్నాడు. దేవతలకు దేవదేవుడగు పరమాత్మ అభయమిస్తూ ఉండగా రాక్షసుల్లో వాదోపవాదాలు చెలరేగాయి. కొందరేమో మొత్తం అమృతాన్ని మనమే తాగేద్దాం అంటున్నారు. మరికొందరేమో మనతో సమానంగా పోరాడిన దేవతలకు కూడా అమృతం దక్కాలన్నారు. ఈ సమయంలో బలవంతమైన అసురుడు అమృత భాండాన్ని చేకొని వెళ్ళనారంభించాడు. తక్కిన బలహీనులు గట్టిగా కేకలు వేయసాగారు.

ఆ సమయంలో విష్ణుదేవుడు తాను దేవతలకిచ్చిన మాటను




నిలబెట్టుకోదలచాడు. మోహినీ రూపాన్ని ధరించాడు. చంద్రబింబం వంటి ముఖం, వినూత్నంగా వెలుగులు విరజిమ్మే నేత్రాలు, తుమ్మెదల వర్ణంతో ఒప్పారే వెండ్రుకల కొప్పు, ఆదిగా గల అలంకారాలతో చూడముచ్చటగా ఉంది ఆ మోహినీ రూపం. ఆమె ముఖంపై ముసురుకుంటున్న తుమ్మెదలను పారద్రోలుతూ చిగురాకు పొదరిండ్లలో విహరిస్తున్న మోహిని అందాన్ని రాక్షసులు తిలకించారు.

ఓ వన్నెల వనితా! మేము కశ్యపుని పుత్రులం. సురలకు సోదరులం. అమృతం కోసం ఇటకేతెంచాం. మాలో మాకు ఒద్దిక కుదరక ఇబ్బంది పడుచున్నాం. ఈ అమృతాన్ని మాకు సమానంగా పంచిపెట్టి పుణ్యం కట్టుకో అన్నారు అసురులు. మీకు నాపై విశ్వాసముంటే అమృతభాండాన్ని నా వశం చేయండి అన్నాడు మోహిని రూపంలో ఉన్న ఆ పరంధాముడు. తక్షణమే వారు ఆ భాండాన్ని మోహినికి అందించారు. నేను పంచిన విధంగా సర్వులు (ఇరు పక్షముల వారు) ఒప్పుకోవాలి అన్నాడు వెన్నుడు. అందుకు రాక్షసులు దేవతలు సమ్మతించారు. వారంతా మహాశుచితో స్నానాదికాలు కావించారు. అగ్నిహోత్రం చేశారు. బ్రాహ్మణోత్తములకు గోవులను, భూమిని, బంగారాన్ని దానంగా ఇచ్చారు. బ్రాహ్మణాశీస్సులు ఘనంగా పొందారు. మోహిని దేవ దానవులను రెండు వరుసలుగా కూర్చోబెట్టింది. రాక్షసులారా!

మీరు తొందరపడవద్దు. అందరికీ అందుతుంది అమృతం. నెమ్మదిగా ఆసీనులు కండి అని తెల్పి రాక్షసులను నమ్మించింది. ఆలస్యం చేయకుండా త్రాగండని అమరులకు తెల్పింది. వారు తృప్తికరంగా సేవించి మోహినిని అభినందించారు.

**మ. అమర వ్రాతములోనఁ జొచ్చి దివిజుండై రాహు పీయూష పా**
**నము సేయంగని చంద్రభాస్కరులు సన్నల్ సేయ నారాయణుం**
**డమరారాతి శిరంబు చక్రహతిఁ దున్మాడెన్ సుధాసిక్తమై**
**యమరత్వంబును జెందె మూర్ధము దదన్యాంగంబు నేలం బడెన్**

**-శ్రీమదాంధ్ర మహాభాగవతం – అష్టమస్కంధం –322 పద్యం**

మోహినీ అవతారంలోనున్న ముకుందుడు అమృతాన్ని అమరులకు పోయడం కన్నారా కాంచిన రాహువు అనే పేరు గల రాక్షసుడు రహస్యంగా దేవతల పంక్తిలో చేరి అమృతాన్ని ఆరగించాడు. అది తెలుసుకున్న సూర్యచంద్రులు మోహినికి సైగ రూపంలో తెలియజేశారు. తక్షణమే శౌరి తన చక్రాయుధంతో రాహువు తలను ఖండించి వేశాడు. అమృతమయమై ఉన్నందున వాని తల జీవించే ఉంది. మొండెం నేలపై కూలిపోయింది.

**ఆ.వె అజుడు వాని శిరము నంబర వీధిని**
**గ్రహము సేసిపెట్టి గారవించె**
**వారు పర్వంబులను వైరంబు దప్పక**
**భాను చంద్రములను బట్టుచుండు**

**-శ్రీమదాంధ్ర మహాభాగవతం – అష్టమస్కంధం – 323 పద్యం**

బ్రహ్మదేవుడు రాహువు శిరస్సును ఆకాశంలో గౌరవంగా నిలిపినాడు. ఆ రాహుగ్రహం అమావాస్య పూర్ణిమల్లో సూర్యచంద్రులను అడ్డగిస్తూ ఉంటుంది.

మోహినీ అవతారంలో నున్న లక్ష్మీపతి అమృతాన్నంతా దేవతలకే పంచిపెట్టి పిమ్మట మోహినీ రూపాన్ని వదిలివేసి తన మామూలు రూపం ధరించాడు. తమ ప్రయాస వృధా అయినందుకు అసురులు అమితంగా తమలో తాము కుమిలిపోయారు.

**మ. అమరుల్ రక్కసులుం బ్రయాసబల హేత్వర్థాభి మానంబులన్**
**సములై లబ్ధవికల్పులైరి యమరుల్ సంశ్రేయముంబొంది ర**
**య్యమరారుల్ బహు దుఃఖముల్ గనిరి తామత్యంత దోర్గర్వులై**
**కమలాక్షున్ శరణంబు వేడని జనుల్ గళ్యాణ సంయుక్తులే?**

**-శ్రీమదాంధ్ర మహాభాగవతం – అష్టమస్కంధం – 325 పద్యం**

సుర లు, అసురులు అన్ని విధాలా సమానమైన శక్తి సామర్థ్యాలు కలవారైనా అమృతం లభించే ప్రయత్నంలో రెండు విధాలైన ఫలితాలు సంప్రాప్తమయ్యాయి. దేవతలకు శుభం చేకూరింది. దనుజులు దుఃఖాన్ని పొందవలసి వచ్చింది. ఈ సందర్భాన్ని కూర్చి ఆధ్యాత్మ దృష్టితో అవగతం చేసుకుంటే సర్వాంతర్యామి, సర్వాన్ని భరించేవాడు, సజ్జన సంపోషకుడు, సర్వేశ్వరుడు, సదానందుడు అయిన శౌరిని శరణు వేడని వారు శుభాలను పొందజాలరని అవగతమౌతోంది.



**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంకల్పించిన మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా గత నెలలో నిర్వహించిన కళ్యాణాలు**

## 63 వ కళ్యాణము

తేది 11-02-2024 ఆదివారం నాడు ఉదయం ఉదయం 10.30 నుండి జరిగింది. దీనిని శ్రీమాన్ టి.వి.ఎన్.హరీశ్, స్వప్న దంపతులు నిర్వహించారు. ఇది కొండాపూర్ లోని అపర్ణ టవర్స్ లో గల క్లబ్ హౌస్ లో జరిగింది. వైఖానసాగమోక్తంగా, అత్యంత వైభవంగా జరిగింది.

## 64 వ కళ్యాణము

తేది 24-02-2024 శనివారం నాడు ఉదయం 10.30 నుండి జరిగింది. ఇది శ్రీ అభయాంజనేయ స్వామివారి దేవస్థానము, హెచ్-106, మధురానగర్, హైదరాబాద్-38 లో జరిగింది. దీనిని దేవస్థానపు వ్యవస్థాపక ధర్మకర్తలు శ్రీమాన్ టి.ఎన్. రావు గారు మరియు ఇతరులు వైఖానసాగమోక్తంగా నిర్వహించారు.

## శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



**తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో 'శ్రీనివాస కళ్యాణాలు' అనే కార్యక్రమమును చేపట్టాము.**

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

**శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథం యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము. (హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)**

**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

**అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. ప్రతి విషయంలో తెలియని భయము. భార్యాభర్తల విషయంలో చిన్న చిన్న విషయములలో ఉద్రేకపడి మాటల యుద్ధంలాగ ఉంటుంది. ఆదాయమునకు మించిన ఖర్చులు శిరోబాధ. ఔషధసేవలు, నవగ్రహ ప్రదక్షిణలు చేయండి. అనుకూలంగా ఉంటుంది.

## వృషభరాశి

**కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. తెలియని భయము. మనశ్శాంతి లేకుండా మాట్లాడుట వ్యాపారస్తులకు ధనాదాయము, ఆకస్మిక ధనవ్యయము. దూర ప్రాంతముల ప్రయాణములు కలసి వచ్చును. తీర్థయాత్రలు చేయుటకు అవకాశములు కలిగి ఉన్నారు. నవగ్రహ ప్రదక్షిణలు చేయండి.

## మిథునరాశి

**మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. ఆకస్మికముగా బంధుమిత్రులు కలియుట. ప్రేమానురాగములు కలిగి ఉండగలరు. వివాహ ప్రయత్నములు ఫలించుట సంఘంలో గౌరవ మర్యాదలు, వినయ విధేయతలు కలిగి ఉంటారు. నవగ్రహ ప్రదక్షిణలు, జపాలు, దానాలు చేయండి.

## కర్కాటకరాశి

**పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనేక విధములుగా సమస్యలు రాగలవు. ఆర్థికంగా చాలా బాగుంటుంది. గ్రహ ఆరాధన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి పూజలు, హోమం. ఏది సంతృప్తిని ఇవ్వగలదో ఆ ప్రకారం చేయండి. శివునికి విష్ణువునకు ఆరాధన తప్పనిసరి. శివకేశవుల నామం చేయండి.

## సింహరాశి

**మఘ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్న తెలియన కష్టనష్టములు పడవలసి ఉన్నది. ప్రతి నిమిషంలో చాలా జాగ్రత్తలు తీసుకొనవలెను. ఉద్యోగస్తులు కన్నెర్ర చేయగలరు. కోర్టు కేసులు రాగలవు. నిరంతరం భగవంతుని ధ్యానం, అనారోగ్య సమస్యలు, వినాయక సరస్వతి చిత్రగుప్త పూజలు.

## కన్యారాశి

**ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు ప్రతి విషయంలో ఆటంకములు కలిగి ఉన్నారు. ప్రయాణంలో అనేక సమస్యలు. జీవిత భాగస్వామికి అనారోగ్య సమస్యలు. తొందరపాటు నిర్ణయములతో మానసిక సమస్యలు రాగలవు. అధికారులు కొంతవరకు అనుకూలత ఉంటుంది. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పూజలు చేయండి.

## తులారాశి

**చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. ప్రతి విషయంలో ఆచితూచి నడుచుకొనగలరు. ఆదాయమునకు మించిన ఖర్చు అదనంగా ఉంటుంది. చాలా అప్రయత్నంగా ఉండాలి. సమాజంలో గుర్తింపు పొందగలరు. పెద్దల సలహాలు పాటించండి. సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి అభిషేకం, హోమము చేయండి.

## వృశ్చికరాశి

**విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. ఆటుపోట్లు ఉండగలవు. తొందరపాటు వలన కోర్టు కేసులు రాగలవు. చాలా జాగ్రత్తగా ఉండవలసిన రోజులు. అవసరానికి ధనం సమకూరగలదు. సున్నితముగా మాట్లాడగలరు. గురు పూజలు, దక్షిణామూర్తికి శనగలు గుగ్గిళ్లు ప్రసాదం పెట్టండి.

## ధనూరాశి

**మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.**

ఈ రాశి పురుషులకు అనుకూలంగా ఉన్నది. మీరు ప్రయత్న లోపం లేకుండా కార్యసాధనలో ముందుకు సాగండి. గౌరవమునకు భంగము లేదు. వృత్తి వ్యాపారాములందు అనుకూలంగా ఉంటుంది. ఆర్థికంగా బాగుంటుంది. అందరిని కలుపుకొని ముందుకు సాగండి. వినాయక, సరస్వతి, చిత్రగుప్తుని పూజలు చేయండి.

## మకరరాశి

**ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ట 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు కార్యసిద్ధి కలిగి ముందుకు సాగండి. వృత్తి వ్యాపార అనుకూలత. పై అధికారుల మన్ననలు ప్రమోషన్ కలిగి ఉన్నారు. ఆకస్మిక ధనలాభము అందగలదు. ఏ పరిస్థితులలోనైనా పాజిటివ్‌గా ఉండండి. శ్రీ సూర్యనారాయణ నమః సూర్య ఆరాధన వలన అనుకూలంగా ఉంటుంది.

## కుంభరాశి

**ధనిష్ట 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.**

ఈ రా శి స్త్రీ పురుషులకు చాలా జాగ్రత్తగా ఉండవలసిన రోజులు. ఏమాత్రం నిర్లక్ష్యముగా ఉన్నా సమస్యలలో చిక్కు కొనగలరు. మీ మేధాశక్తికి పదును పెట్టండి. చాలా హుందాగా ఉండండి. ఇతరులకు మానసికంగా కుంగిపోయినట్లు తెలియరాదు. సుబ్రహ్మణ్యేశ్వర పూజలు శక్తిని నింపగలవు.

## మీనరాశి

**పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. తల్లిదండ్రులను చులకనగా మాట్లాడినవారికి అనేక విధముల కష్టములు ఉండుటకు అవకాశాలు కలిగి ఉన్నవి. వారిపై ప్రేమగా చూసుకున్నచో అన్ని విషయములలో అనుకూలత ఉంటుంది.

# మీ విజ్ఞానం

నిర్వహణ: **డా.పి. లలితవాణి**



శ్రీ వేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com

ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. వాయుదేవుని ధిక్కరించిన చెట్టు ఏది?
2. గోవిందదాసు సొంత ఊరు ఏది?
3. ఎవరి అనుగ్రహ ఉపదేశాలతో పార్వతి శివుని అర్థభాగాన్ని పొందింది?
4. ఇంద్రద్యుమ్నుడు కలిసిన గుడ్లగూబ పేరేమిటి?
5. ఒకరిపై ఒకరు దుమ్ము చల్లుకునే పండుగ ఏది?
6. సుగ్రీవుని భార్య పేరు ఏమిటి?
7. పరమశివుని ఆక్షేపించిన కవి ఎవరు?
8. శివపూజలో వాడని పుష్పమేది?
9. తులసీదాసు భార్య ఎవరు?
10. ఇంద్రద్యుమ్నుని గుర్తించినదెవరు?
11. నత్కీరుడు ఎవరి భక్తుడు?
12. ఎవరి – ఎముకలు పాండురంగని జపించాయి?
13. అర్జునుని శపించిందెవరు?
14. నారదునికి పూర్వనామం ఏది?
15. దూర్వాసుని వెంటబడి తరిమిందెవరు?

1. ____________________
2. ____________________
3. ____________________
4. ____________________
5. ____________________
6. ____________________
7. ____________________
8. ____________________
9. ____________________
10. ____________________
11. ____________________
12. ____________________
13. ____________________
14. ____________________
15. ____________________

## గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. మణినాగుడు, 2. సూర్యుడు, 3. విష్ణుమూర్తి, 4. పావురం, 5. కుక్క, 6. తన ప్రాణాన్ని కాపాడిన మునికి, 7.మాఘ శుద్ధ పంచమి నాడు, 8. మయూర శతకం, 9. రుమ, 10. సుషేణుని, 11. లీలాశుకుడు, 12. విష్ణుమూర్తిని, 13. యజ్ఞయాగాలు, 14. స్త్రీరూపంలో, 15. వాక్‌బీజం

## సరైన సమాధానాలు రాసినవారు

1. వనమాల రామలింగాచారి, 2. పవన్ కుమార్, 3. శశిరేఖ, 4. అనసూయ, 5. అరుంధతి, 6. చింతపాటి శివశంకరాచారి

పేరు: ____________________

చిరునామా: ____________________

____________________

____________________

____________________

పిన్‌కోడ్: ____________________

ఫోన్: ____________________

## లక్కీడిప్ ద్వారా స్వామివారి పాదాలు పొందిన విజేత

**వనమాల రామలింగాచారి**



Postel Registration No: HSE/879/2022-2024

Published on 28th and Licenced to Post On 29th & 30th of Every Month

RNI No.: APTEL/2008/23122




If Un delivered please return to:

**SRI VENKATESHAM, (Sri Venkateshwara Maha Mantra Peetham)**

H.No: 1-1-53, Street No. 1, Habsiguda, Hyderabad-500007. Ph: 040-27175050.

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు https://www.srivenkatesham.org లో చదవండి

Srivenkatesham Magazine in Google Drive https://drive.google.com/drive/folders/1jOWBeoUHjF4Qhn4wl-d9eUGlh6kVYyLq